# అధికారులు ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టి పరిష్కరించాలి



- "వన్ మంత్ - ఫోర్ విజిట్"లో భాగంగా ఉదిరిపికొండలో ప్రత్యేక గ్రీవెన్స్ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్
- ప్రత్యేక పిజిఆర్ఎస్ ద్వారా ప్రజా సమస్యలు అక్కడికక్కడే పరిష్కారం

మిగతా 2లో


# మనం
## అనంతపురం / శ్రీ సత్యసాయి జిల్లా

శనివారం - 8 - ఆగస్టు - 2026 : పేజీలు 16


## రహదారుల అభివృద్ధి కోసం నిధులు కేటాయించాలని కేంద్రమంత్రికి ఎంపీ వినతి

- గుత్తి - గుంతకల్లు జాతీయ రహదారి టెండర్ ప్రక్రియను వీలైనంత త్వరగా పూర్తి చేసి పనులు ప్రారంభించమనిద కేంద్ర రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీని కోరిన అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ
- జాతీయ రహదారి విస్తరణ, సర్వీస్ రోడ్లు, లింక్ రోడ్లు, అండర్‌పాస్‌లపై తక్షణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి



**అనంతపురం,(న్యూఢిల్లీ) ఆగస్టు 7 మనంన్యూస్‌బ్యూరో:** అనంతపురం పార్లమెంట్ నియోజకవర్గ ప్రజల రవాణా సౌకర్యాల మెరుగుదల, రోడ్డు భద్రత, పట్టణ అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ వాల్మీకి కేంద్ర రహదారుల రవాణా జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ని కలిసి 3 కీలక వినతిపత్రాలను సమర్పించారు. అనంతపురం జిల్లా భవిష్యత్ అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత కలిగిన జాతీయ రహదారి ప్రాజెక్టులను వేగవంతం చేయాలని, ప్రజలు ఎదుర్కొంటున్న ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారంచూపాలని

మిగతా 2లో

# నేతన్నల సంక్షేమమే ఎన్డీఏ ప్రభుత్వ ధ్యేయం

- చేనేతకు బంగారు భవిష్యత్... ధర్మవరం పట్టుకు ప్రపంచ ఖ్యాతి తీసుకొస్తాం
- 82 వేల మంది నేతన్నలకు రూ.179 కోట్లతో 'నేతన్న సేవ' ప్రారంభం
- నేతన్న సేవతో ప్రతి అర్హత నేతన్న ఖాతాలో రూ.25 వేల ఆర్థిక చేయూత అందిస్తున్నాం
- 109 చేనేత సహకార సంఘాలకు రూ.79 కోట్ల క్యాష్ క్రెడిట్ సాయం అందించడం జరుగుతోంది
- రూ.150 కోట్లతో ఉచిత విద్యుత్ అందిస్తూ... చేనేత రంగానికి మరింత ఊతం వెయ్యడం జరుగుతోంది
- ఉచిత విద్యుత్ నుంచి మెగా క్లస్టర్ వరకు...నేతన్నల వెన్నంటే ప్రభుత్వం
- వీవర్ సర్వీస్ సెంటర్ - సిల్క్ యార్న్ డిపోతో ధర్మవరం చేనేతకు మరింత బలం కల్పిస్తాం
- ధర్మవరం పట్టు ఖ్యాతిని ప్రపంచ వ్యాప్తంగా చాటడమే నా లక్ష్యం
- ధర్మవరం సిల్క్‌ను ప్రపంచ బ్రాండ్‌గా నిలబెడతాం



ధర్మవరం పట్టు చీర అనేది కేవలం వస్త్రం కాదని, ప్రపంచాన్ని ఆకట్టుకునే కళాఖండమని... పొందూరు, ఉప్పాడ, వెంకటగిరి, మంగళగిరి, కలంకారి వంటి చేనేత ఉత్పత్తులకు ప్రత్యేక గుర్తింపు ఉన్నప్పటికీ, ధర్మవరం పట్టు చీరకు ప్రత్యేక స్థానం ఉందని మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు.12వ జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన నేతన్న సేవలో కార్యక్రమం ధర్మవరంలో ఘనంగా జరిగింది.



**ధర్మవరం, ఆగస్టు 07, మనంన్యూస్ :** రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మరియు వైద్య విద్య శాఖామాత్యులు, ధర్మవరం ఎమ్మెల్యే సత్యకుమార్ యాదవ్, కదిరిఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్, జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి, ఎన్డీఏ కూటమి నాయకులు, అధికారులు, చేనేత కార్మికులు, మాస్టర్ వీవర్లు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ముందుగా నేతన్న విగ్రహానికి పూలమాలలు వేసి, జ్యోతి ప్రజ్వల చేసి, కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ ధర్మవరం నియోజకవర్గంలోని ప్రతి నేతన్నకు, ప్రతి నేతమ్మకు, చేనేత రంగంతో అనుబంధం ఉన్న ప్రతి కుటుంబానికి జాతీయ చేనేత దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. చేనేత అనేది కేవలం ఒక చేతివృత్తి కాదని, భారతీయతకు ప్రతిబింబం, స్వదేశీ స్ఫూర్తికి ప్రతీక, భారతీయ సంస్కృతి, సంప్రదాయం, వారసత్వానికి జీవం పోసే కళ అని పేర్కొన్నారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలిచిన చేనేత రంగాన్ని గౌరవిస్తూ జాతీయ చేనేత దినోత్సవాన్ని ప్రారంభించిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ధర్మవరానికి వచ్చిన తొలినాళ్లలో చేనేతపై తనకు పెద్దగా అవగాహన లేకపోయినా,

మిగతా 9లో

# చేనేత కార్మికులకు అండగా కూటమి ప్రభుత్వం

## ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు



**రాయదుర్గం ఆగస్టు 7 మనం న్యూస్ :** " రాష్ట్రవ్యాప్తంగా చేనేత కార్మికులకు ఒక పండుగ రోజు. తరతరాలుగా చేనేత వృత్తిని కొనసాగిస్తూ.. కష్టాలు వచ్చినా, నష్టాలు ఎదురైనా తమ వృత్తిని వదులుకోకుండా ముందుకు సాగుతున్న నేతన్నలకు అండగా నిలిచే రోజు. అటువంటి చేనేత కార్మికులకు ఒక్కొక్కరికి రూ. 25వేల ఆర్థిక సహాయం అందిస్తున్న రోజు కావడం ఎంతో సంతోషంగా ఉంది" అని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా శుక్రవారం రాయదుర్గం పట్టణంలో చేనేత కార్మికుల ఇంటికి వెళ్లి ప్రభుత్వ సాయం గురించి వివరించారు. ఈ సందర్భంగా నేత కార్మికులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ, స్వర్గీయ ఎన్టీ రామారావు తెలుగుదేశం పార్టీని స్థాపించినప్పటి నుంచి నేటి వరకు రాష్ట్రంలోని చేనేత కార్మికులు పార్టీకి అండగా నిలుస్తున్నారన్నారు. నేతన్నలతో తెలుగుదేశం పార్టీకి విడదీయరాని అనుబంధం ఉందన్నారు. రాజకీయంగా ఎన్నో సంక్షోభాలు వచ్చినా, ఎంతోమంది ఎన్నో రకాల మాయ మాటలు చెప్పినా... చేనేత వర్గం మాత్రం తెలుగుదేశం పార్టీకి ఒక బలమైన వర్గంగా కొనసాగుతూ వస్తోందన్నారు. చేనేత కార్మికులు తెలుగుదేశం పార్టీకి అందించిన ఆదరణ, అండదండలకు మేము ఎంత చేసినా తక్కువనని, వారి రుణం తీర్చుకోలేనిదన్నారు. చేనేత కార్మికుల సంక్షేమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 54 వేల మంది



మిగతా 2లో

## బ్లాక్ లిస్టులో పెట్టి...

# రికవరీకి ఆదేశిస్తామ్!



- ఎల్టిపిల వక్రపనులపై స్పందించిన కమిషనర్ రావ్
- మనం వరుస కథనాలపై సర్వత్రా చర్చ
- ఇంచార్జ్ టిపిఓ ఓంకార్ ప్రమేయంపై కూడా ఆరా! చర్యలకు ఏసీబీ కసరత్తు, విజిలెన్స్‌కు వీడని నిద్రమత్తు ?

**అనంతపురం, ఆగస్టు 7 మనంన్యూస్ :** తల్లిపాలు తాగి రొమ్ము గుద్దడం అంటే బహుశా ఇదేనేమో. అనంతపురం నగరపాలక సంస్థ టౌన్ ప్లాన్ విభాగంలో గుట్టు చప్పుడు కాకుండా రూ, లక్షలు స్వాహా చేస్తున్నారు. బిల్డింగ్ అనుమతుల నిమిత్తం పన్నుల రూపేనా పలు రకాలుగా ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంది. అందులో ముఖ్యమైనవి ఖాళీజాగా పన్ను, 14% బెటర్మెంట్ టాక్స్,ఇదేగాక ప్రధాన రహదారుల ప్రాంతాల్లో ఏర్పాటు చేసుకుంటే ఇంపాక్ట్ ఫీజు, మార్కెట్ వేల్యూకు అనుగుణంగా ఫీజులు చెల్లించాల్సి ఉంటుంది. అయితే కొందరు లైసెన్స్ టెక్నికల్ పర్సనల్‌లు నగర పరిధిలోని కొందరు సచివాలయ వార్డు ప్లానర్లతో లోపాయి కారు ఒప్పందం చేసుకొని, వారిపైన ప్లానింగ్ ఉన్నతాధికారులను మరో రకంగా ఒప్పిస్తూ లక్షల కాదు ప్రతి నెల రూ, కోట్ల లోనే ప్రభుత్వ ఖజానాకు చేరాల్సిన సొమ్మును స్వాహా చేస్తున్నట్లు స్పష్టంగా తెలుస్తోంది. అయితే నగరపాలక ప్లానింగ్ అధికారులు, నగరపాలక కమిషనర్ మాత్రం అప్రూవల్ ఫైల్స్ తమ వద్దకు రావని,

మిగతా 2లో



# బ్లాక్ లిస్టులో పెట్టి... రికవరీకి ఆదేశిస్తామ్!




ఎల్పిపిలే ప్రీ అప్రూవల్‌తో బిల్డింగ్ అనుమతులు పొందేస్తున్నారని అటు మీడియాకు మిడిమిడి జ్ఞానమే ఉంటుందనే ఆలోచనతో సెలవిస్తున్నారు. అవినీతికి ఇలా పచ్చ జెండా... అనంతపురం నగర పరిధిలో ఎవరైనా బిల్డింగ్ నిర్మించుకోవాలంటే మొదట సచివాలయంలోని వార్డు ప్లానర్ ను సంప్రదిస్తారు, ఆయన సలహా, సూచనలు మేరకు ఎల్టిపిలను ఆశ్రయిస్తారు. అక్కడే అసలు కథ మొదలవుతుంది. ఆ ప్రాంతంలో అదే అదే ఆ బిల్డింగ్ ఏర్పాటు చేసుకోవాలనుకున్న స్థలంలో 14% బెటర్మెంట్ టాక్స్ నిర్ణయించేది వార్డ్ ప్లానరే. కొందరి మధ్య అక్కడ జరుగుతున్న లోపాయికారి ఒప్పందం కారణంగా ఆ 14 శాతం బెటర్మెంట్ టాక్స్ ఆ ఏరియాకి పడుతున్నప్పటికీ లేకుండా చేస్తున్నారు. వాస్తవానికి ఏదైనా బిల్డింగ్ అనుమతులకు సంబంధించి ఫైల్ ఎల్టిపిల నుండి ఫార్వర్డ్ అయితే 100 మీటర్ల నుండి 200 మీటర్ల వరకు సంబంధిత ప్లానింగ్ అధికారి, ఏసీపీ వరకు బాధ్యులు. వారి లాగిన్ కు వచ్చిన ఫైలు సక్రమంగా ఉందా లేదా చూసి సక్రమంగా ఉంటే ఎలాంటి అభ్యర్థన లేకుండా ఫార్వర్డ్ చేస్తారు. అదే ఫైల్ లో ఏదైనా అనుమానం ఉంటే రిటర్న్ చేసే అధికారం సంబంధిత అధికారికి ఉంటుంది దీన్నే పోస్ట్ అప్రూవల్ అంటారు. అయితే బిల్డింగ్ నిర్మాణం బట్టి పొందే అనుమతులను బట్టి కూడా ఈ ప్రాసెస్ ఉంటుంది. ఇందులో బిల్డింగ్ నిర్మాణం 200 మీటర్లకు పైగా ఉంటే ఆ ఫైల్ కమిషనర్ లాగిన్ వరకు పోతుంది. అందులో ఏదైనా ఫేక్ డాక్యుమెంట్లు పొందపరిచి ఉంటే ఆ ఫైలు ను రిజెక్ట్ చేసే అధికారం కూడా కమిషనర్ కే ఉంటుంది. అయితే ఇంత అధికారాలు ఉన్న యదేచ్ఛగా ఎల్టిపిలు 14శాతం బెటర్మెంట్ టాక్స్ లేకుండా ప్రీ అప్రూవల్ లోనే బిల్డింగ్ అనుమతులుపొందడం పైనే సర్వత్రబహిరంగ విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఇదే విషయంపై కమిషనర్ కు మనం వివరణ కోరగా... బ్లాక్ లిస్టులో పెట్టి రికవరీ ఆదేశిస్తామ్.... ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా లో వస్తున్న నగరపాలక సంస్థకు సంబంధించిన ప్రతి వార్త కథనాన్ని తాము క్షుణ్ణంగాపరిశీలిస్తున్నామని అందులోభాగంగానే మనం ప్రచురించిన ఆ కథ నాలనుకూడాచూసామని,వాటిపైనవిచారణకుఆదేశించి ,తప్పుచేసిన ఎల్టిపీలు, వార్డుప్లానర్లపై చర్యలుతీసుకోవడమే కాకుండాసొమ్ము రికవరీకూడా ఆదేశాలు జారీ చేస్తామని నగరపాలక సంస్థ కమిషనర్ జస్వంత్ రావు తెలియజేశారు.

## మార్పు కోసం చలో ఢిల్లీ పోస్టర్లు విడుదల

**హిందూపురం (మనం న్యూస్) ఆగస్టు 7:** "బల్దావ్ జరూరీ హై--దేశ్ కో బచావో, మోడీ హటావో" నినాదంతో సెప్టెంబర్ 1న నిర్వహించనున్న చలో ఢిల్లీ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను సీపీఐ హిందూపురం సమితి ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని ఎంజీఎం గ్రౌండ్‌లో విడుదల చేశారు. ఈ సందర్భంగా సీపీఐ హిందూపురం పట్టణ కార్యదర్శి కనిశెట్టిపల్లి వినోద్ కుమార్ మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా సీపీఐ ఆధ్వర్యంలో ఆగస్టు 6 నుంచి 15వ తేదీ వరకు పాదయాత్రలు, ఆగస్టు 16 నుంచి 30వ తేదీ వరకు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో వివిధ ఆందోళన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సెప్టెంబర్ 1న ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో నిర్వహించే భారీ ర్యాలీలో హిందూపురం నుంచి సీపీఐ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొంటారని పేర్కొన్నారు. రైతులు పండించిన పంటలకు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) కల్పించాలని, నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, స్కీమ్ వర్కర్లను రెగ్యులర్ చేయాలని,దళితులు,ఆదివాసీలు,మైనార్టీలు, వెనుకబడిన వర్గాలపై దాడులను అరికట్టాలని కోరారు. మహిళలకు రక్షణ కల్పించాలనే తదితర డిమాండ్లతో చలో ఢిల్లీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వినోద్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ సీనియర్ నాయకులు డి. బాబు, సహాయ కార్యదర్శి మారుతి రెడ్డి, కార్యవర్గ సభ్యులు కమల్ భాషా, చాంద్ భాషా, శ్రీనివాసులు, చలపతి, సాబీరా, నౌషాద్, సమీవుల్లా, ఆసియా తదితరులు పాల్గొన్నారు.



# అధికారులు ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టి పరిష్కరించాలి

**కూడేరు , ఆగస్టు 07 మనం న్యూస్ :** అధికారులు ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టి ఎప్పటికప్పుడు సమస్యలు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ పేర్కొన్నారు.శుక్రవారం కూడేరు మండలం లోని కుదిరిపికొండ గ్రామంలో శుక్రవారం ఉదయం అనంతపురం ఆర్ డి ఓ ప్రేమత కుమార్ తో కలిసి "వన్ మంత్ - ఫోర్ విజిట్" కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కారవేదికకార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...ప్రతి సోమవారం జిల్లా కేంద్రంలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాలతో పాటు, ప్రతి నెల ఒక నియోజకవర్గాన్ని ఎంపిక చేసి అక్కడ వరుసగా నాలుగు వారాల పాటు ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదికలు నిర్వహించడం జరుగుతుందన్నారు. జిల్లాలో ఏ ఒక్కరు కూడా సమస్యలతో బాధపడకూడదనే ఉద్దేశంతో ప్రత్యేక ప్రజాసమస్యలపరిష్కారవేదిక కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. కావున అధికారులు ప్రజలు సమర్పించిన ప్రతి అర్జీని క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి, సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. తీసుకుంటున్న చర్యలను నేరుగా ప్రజలకు తెలియజేయాలని స్పష్టం చేశారు. అర్జీలు సమర్పించిన వారికి తప్పకుండా రసీదులు ఇవ్వాలన్నారు. ఇళ్లు, స్థలాలు, పెన్షన్లు, రెవెన్యూ అంశాలు, భూమి వివాదాలు సహా ప్రజలు ఎదుర్కొంటున్న అన్ని సమస్యలను ఈ వేదిక ద్వారా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ పేర్కొన్నారు.ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారంపై అధిక ప్రాధాన్యతనిస్తోందని ప్రతి అధికారి బాధ్యతాయుతంగా వ్యవహరించి, అవసరమైన చోట వ్యక్తిగతంగా తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. అర్జీల పరిష్కార పురోగతిపై నిరంతర సమీక్ష ఉంటుందన్నారు.ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలు అక్కడికక్కడే పరిష్కరించడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు అలాగే చట్ట పరంగా సమస్యల పరిష్కారానికి ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగపడు తుందన్నారు. గతంలో జిల్లా కేంద్రానికే పరిమితమైన గ్రీవెన్స్ వ్యవస్థను ఇప్పుడు నియోజకవర్గ స్థాయికి విస్తరించడం ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించే అవకాశం కలిగిందన్నారు. నెలలో వచ్చే నాలుగు వారాల్లో ఒక్కో మండలంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తూ, ప్రజల సమస్యలను నేరుగా స్వీకరించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామనిజిల్లా తెలిపారు. నియోజకవర్గ స్థాయిలో పరిష్కరించగల అంశాలను అక్కడికక్కడే పరిష్కరించడంతో పాటు, జిల్లా మరియు రాష్ట్ర స్థాయి సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. ప్రజలు ఎలాంటి ఆందోళన చెందకుండా తమ సమస్యలను అధికారులకు వివరించి, ఈ ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదికను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఇంకా ఈ కార్యక్రమంలో వివిధ సమస్యలపై ప్రజలు అర్జీలు సమర్పించారు. ఈ సమస్యలన్నీ వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులకు ఎండార్స్ చేస్తూ ఆదేశించారు. కోర్టు కేసులు మినహాయించి మొత్తం 219 ఫిర్యాదులు రాగా ఇందులో 139 వరకు పరిష్కరించబడినవని 80 వరకు వివిధ కారణాలవల్ల తిరస్కరించ బడినవని ఇంకనూ 58 దాకా ఉన్న ఫిర్యాదులను పరిశీలించి వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కూడేరు తాసిల్దార్ మోహన్ కుమార్, డిప్యూటీ ఎంపీడీవో జిలాన్ భాష, సిడిపిఓ శ్రీదేవి, ఎంఈఓ మహమ్మద్ గౌస్, ఐసిడిఎస్ సూపర్వైజర్ సురేఖ, ఏపీ ఎస్పీడీసీఎల్ ఏఈ శ్రీనివాసులు, పంచాయతీరాజ్ ఏఈ రమణయ్య, ఏపీవో పోలేరయ్య, స్థానిక నాయకులు మహేష్ జల్లిపల్లి చంద్ర,గ్రామ ప్రజలు అర్జీదారులుతదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# రహదారుల అభివృద్ధి కోసం నిధులు కేటాయించాలని కేంద్రమంత్రికి ఎంపీ వినతి

మొదటిపేజీ తరువాయి...

ఎంపీ కోరారు. హైదరాబాద్-బెంగళూరు జాతీయ రహదారి ( ఎన్‌హెచ్-44) విస్తరణకు ప్రాధాన్యత ఇవ్వాలి: హైదరాబాద్-బెంగళూరు మధ్య ఉన్న ఎన్ హెచ్-44 దేశంలో అత్యంత రద్దీగా ఉండే జాతీయ రహదారులలో ఒకటని ఎంపీ పేర్కొన్నారు. ప్రస్తుతం నాలుగు లేన్లుగా ఉన్న ఈ మార్గం సామర్థ్యానికి మించి వాహన రాకపోకలు సాగుతున్నందున తరచూ ట్రాఫిక్ సమస్యలు, ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని వివరించారు.ఈ రహదారిని విస్తరించేందుకు గతంలో డీపీఆర్లు సిద్ధమైనప్పటికీ ఇప్పటివరకు పనులు ప్రారంభం కాలేదని గుర్తుచేస్తూ, తక్షణమే పరిపాలనా, ఆర్థిక అనుమతులు మంజూరు చేసి ప్రాధాన్యత ఆధారంగా విస్తరణ పనులు ప్రారంభించాలని కోరారు.అలాగే గుత్తి - గుంతకల్లు జాతీయ రహదారి టెండర్ ప్రక్రియను వీలైనంత త్వరగా పూర్తి చేసి పనులు ప్రారంభించమని కేంద్ర రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ని ఎంపీ కోరారు.అనంతపురం పట్టణంలో ఎన్ హెచ్ -44పై సర్వీస్ రోడ్లు, వాహన అండర్‌పాస్‌లలో మార్పులు అవసరం : అనంతపురం పట్టణ పరిధిలోని సాక్షి కార్యాలయం అండర్‌పాస్ నుంచి ప్రసన్నాయపల్లి అండర్‌పాస్ వరకు సుమారు 750 మీటర్ల మేర సర్వీస్ రోడ్డు లేకపోవడం వల్ల స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎంపీ తెలిపారు. ఈ కారణంగా ప్రధాన రహదారిని దాటాల్సి రావడంతో ప్రమాదాల ముప్పు పెరుగుతోందని వివరించారు. ఈ నేపథ్యంలో ఆ ప్రాంతంలో సర్వీస్ రోడ్డును పూర్తి చేయాలని కోరారు.అదేవిధంగా ప్రసన్నాయపల్లి వద్ద ప్రతిపాదిత వాహన అండర్‌పాస్‌ను ప్రస్తుతం నిర్ణయించిన ప్రదేశం నుంచి ప్రధాన క్రాస్‌రోడ్డు సమీపానికి మార్చాలని సూచించారు. ఎన్ హెచ్ -42 - ఎన్ హెచ్ -544డి మధ్య నేరుగా లింక్ రోడ్డు నిర్మాణం చేపట్టాలి: అనంతపురం నగర ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారంగా ఎన్ హెచ్ -44, ఎన్ హెచ్ -42, మరియు ఎన్ హెచ్ -544డిలను అనుసంధానించే "తూర్పు బైపాస్" (ఈస్ట్ బైపాస్ ) నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.ఈ బైపాస్‌ను అనంతపురం-తాడిపత్రి రహదారి నుంచి అనంతపురం--చెన్నై రహదారికి అనుసంధానించేలా ప్రతిపాదించారు. దీని ద్వారా పట్టణంలోకి వచ్చే సిమెంట్ లారీలు, ఇతర భారీ రవాణా వాహనాలను నగరానికి వెలుపలే మళ్లించడం సాధ్యమై, ట్రాఫిక్ రద్దీ గణనీయంగా తగ్గడంతో పాటు రవాణా సౌకర్యం మెరుగుపడుతుందని తెలిపారు. అలాగే అనంతపురం నగర విస్తరణకు ఈ ప్రాజెక్టు దోహదపడుతుందని పేర్కొంటూ, బైపాస్ నిర్మాణానికి అవసరమైన నిధులను త్వరితగతిన మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతపురం సమగ్ర అభివృద్ధే లక్ష్యం:అనంతపురం పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలకు సురక్షితమైన, ఆధునిక రవాణా సదుపాయాలు అందించడమే తన ప్రధాన లక్ష్యమని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఈ ప్రతిపాదనలను సానుకూలంగా పరిశీలించి తక్షణ చర్యలు తీసుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ ప్రాజెక్టులు అమలైతే అనంతపురం నగర ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించడంతో పాటు ప్రజల ప్రయాణ సౌకర్యాలు మెరుగుపడతాయని, పారిశ్రామిక, వాణిజ్య, ఆర్థిక అభివృద్ధికి కొత్త దిశ లభిస్తుందని ఎంపీ అంబిక లక్ష్మీనారాయణ పేర్కొన్నారు.

# చేనేత కార్మికులకు అండగా కూటమి ప్రభుత్వం : ఎమ్మెల్యే కాలవ

చేనేత కార్మికులకు ఒక్కొక్కరికి రూ.25 వేల చొప్పున ఆర్థిక సహాయం అందిస్తుండటం చాలా ఆనందంగా ఉందన్నారు. నేతన్న కుటుంబం ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి ఈ సహాయం ఉపయోగపడుతుందని ఆశాభావం వ్యక్తపరిచారు. ఆర్థిక చేయూత అందించడం ద్వారా కష్టకాలంలో ప్రభుత్వం తమకు అండగా ఉందనే భరోసా వారిలో కల్పించినట్లు అవుతోందన్నారు. ఇంతకు ముందు మగ్గం మీద పనిచేసే చేనేత కార్మికులకే పరిమితమైన ప్రయోజనాలను చేనేతకు అనుబంధంగా రాట్నం వడికేవారు, రంగులు అద్దే కార్మికులకు కూడా నేతన్న సేవలో పథకం వర్తింప జేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్ణయం తీసుకున్నారన్నారు. దీనివల్ల మరో సుమారు 10 వేల మందికి అదనంగా ప్రయోజనం కలిగే అవకాశం ఉందన్నారు. ఈ ఏడాది బడ్జెట్లో చేనేత రంగానికి ప్రత్యేకంగా రూ.250 కోట్ల నిధులు కేటాయించా మని, ఎక్కడ అవకాశం ఉన్నా చేనేత కార్మికులకు మరింత సహాయం అందించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. ప్రతి చేనేత కార్మికుడు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవా లని ఆయన విన్నవించారు. అర్హత ఉన్నప్పటికీ ఏ కారణం చేతనైనా జాబితాలో పేరు రాని చేనేత కార్మికులు ఎవరైనా ఉంటే ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అలాంటి వారిని కూడా గుర్తించి లబ్ధిదారులుగా చేర్చేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. రాయదుర్గం అంటేనే చేనేతలకు పుట్టినిల్లని, ఒకప్పుడు పట్టణంలో వేలాది కుటుంబాలు మగ్గాలపైనే ఆధారపడి జీవించేవని గుర్తు చేశారు. కాలక్రమంలో గార్మెంట్స్ పరిశ్రమ అభివృద్ధి చెందడంతో చాలామంది తమ వృత్తిని మార్చు కుని కుట్టుమిషన్లు ఏర్పాటు చేసుకుని గార్మెంట్స్ రంగంలోకి వెళ్లారన్నారు. అయినప్పటికీ రాయదుర్గం ప్రాంతంలో సుమారు 250 మంది చేనేత కార్మికులకు ఈ సహాయం అందు తోందన్నారు. అంతేకాకుండా గుమ్మఘట్ట మండలంలో సుమారు 300 మంది కంబళ్లను నేసే కార్మికులు ఉన్నారనీ వారిని కూడా 'నేతన్న సేవలో' పథకం కింద లబ్ధిదారులుగా గుర్తించాలని చేనేత, జౌళి శాఖ మంత్రి సవితమ్మకు వినతిపత్రం అందించామన్నారు. ప్రభుత్వం దీనిపై సానుకూలంగా నిర్ణయం తీసుకుంటుందని, త్వరలోనే వారికి కూడా ఈ పథకం ద్వారా ప్రయోజనం అందుతుం దని ఆశిస్తున్నామన్నారు. నేతన్న మగ్గం ఆగకూడదు.. నేతన్న కుటుంబంలో పొయ్యి ఆరిపోకూడదు.. చేనేత కుటుంబం ఆర్థికంగా నిలదొక్కుకోవాలి అన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్య మన్నారు. చేనేత కార్మికులు మాపై చూపిస్తున్న ఆదరణకు ఎప్పటికీ రుణపడి ఉంటామని, వారి ఆశీస్సులు, అండదండలు, ఆదరణ ఎల్లప్పుడూ తనపై, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, నారా లోకేష్ లపై ఉండాలని కోరుకుంటున్నానని ఎమ్మెల్యే కాలవ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో వార్డు ఇంఛార్జి ప్రవీణ్, రాష్ట్ర మాజీ చేనేత డైరెక్టర్ టంకిశాల హనుమంత, పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ పోరాళ్ల పురుషోత్తం, గుద్దిటి లోకేష్,ఎల్లప్ప,కాంట్లీ రాజశేఖర్, మంతా సీన, ధనర్జున, వడ్డే శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



# చేనేత వారసత్వాన్ని తెలుసుకున్న సూర్య పాఠశాల విద్యార్థులు



## జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా సెరిఫెడ్ కార్యాలయ సందర్శన

**ధర్మవరం, ఆగస్టు 7, మనంన్యూస్ :** జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని సూర్య పాఠశాల విద్యార్థులు గురువారం సెరిఫెడ్ కార్యాలయాన్ని సందర్శించి చేనేత కళా వైభవాన్ని, పట్టు పరిశ్రమ విశిష్టతను ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. పాఠశాలకరస్పాండెంట్ వై. నరేంద్రబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ విద్యా పర్యటన విద్యార్థుల్లో చేనేతపై అవగాహన పెంపొందించింది. ఈ సందర్భంగా సెరిఫెడ్ సాంకేతిక అధికారి ఎస్. షరా భాయ్, జయమ్మ విద్యార్థులకు చేనేత వస్త్రాల తయారీ ప్రక్రియ, పట్టు గుళ్ల తయారీ విధానం, నాణ్యత ప్రమాణాలు, చేనేత ఉత్పత్తుల ప్రత్యేకతలను వివరించారు. ముడి పదార్థం నుంచి అందమైన పట్టు చీర తయారయ్యే వరకు జరిగే ప్రతి దశను వివరించి విద్యార్థుల సందేహాలకు సమాధానాలు ఇచ్చారు. చేనేత అనేది కేవలం ఒక వృత్తి మాత్రమే కాకుండా భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని, చేనేత కార్మికుల శ్రమ, నైపుణ్యం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని విద్యార్థులకు తెలియజేశారు. స్థానిక చేనేత ఉత్పత్తులను ప్రోత్సహించడం ద్వారా నేతన్నల జీవనోపాధికి తోడ్పాటునందించవచ్చని వివరించారు. సందర్శన అనంతరం విద్యార్థులు "చేనేత కళను కాపాడుదాం... చేనేత వస్త్రాలను కొనుగోలు చేద్దాం... మన సంప్రదాయం మన బాధ్యత" అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో చేనేతపై అవగాహనతో పాటు భారతీయ వారసత్వం పట్ల గౌరవభావం పెంపొందిందనిపాఠశాల యాజమాన్యం పేర్కొంది.

# నేతన్నకు అండగా కూటమి.. వైసీపీ హయాంలో చేనేత నిర్లక్ష్యమైంది: టీడీపీ



## జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ధర్మవరంలో ఘనంగా వేడుకలు

**ధర్మవరం, ఆగస్టు 7, మనంన్యూస్ :** రాష్ట్రంలో చేనేత వృత్తిదారులకు దేశంలో ఎక్కడా లేని విధంగా ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తోందని ధర్మవరం నియోజకవర్గ తెలుగు దేశం పార్టీ నాయకులు పేర్కొన్నారు. 12వ జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం ధర్మవరం పట్టణంలో టీడీపీ ఆధ్వర్యంలో చేనేత దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా కదిరి గేట్ సమీపంలోని చేనేత విగ్రహానికి, అనంతరం గాంధీనగర్ సర్కిల్‌లోని మహాత్మా గాంధీ విగ్రహానికి, రైల్వే స్టేషన్ వద్ద ఉన్న చేనేత విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో టీడీపీ నాయకులు మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం చేనేత సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ధర్మవరంలో చేనేత క్లస్టర్ ఏర్పాటు ద్వారా సుమారు 10 వేల మంది చేనేత కార్మికులకు నైపుణ్య శిక్షణ, ఆధునిక పనిముట్లు సబ్సిడీపై అందించనున్నట్లు చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 50 ఏళ్లు దాటిన చేనేత కార్మికులకు నెలకు రూ.4 వేల పెన్షన్, 62,541 చేనేత కుటుంబాలకు 200 యూనిట్లు, 10,032 మరమగ్గాల కుటుంబాలకు 500యూనిట్లవరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నట్లు పేర్కొన్నారు. కొత్తగా ప్రవేశపెట్టిన "నేతన్నల సేవలో" పథకం కింద 71,536 మంది చేనేత కార్మికులకు ఒక్కొక్కరికి రూ.25 వేల చొప్పున మొత్తం రూ.179 కోట్లు విడుదల చేయడం చేనేత కుటుంబాలకు పెద్ద ఊరటనిచ్చిందన్నారు. అదేవిధంగా 109 చేనేత సహకార సంఘాలకు రూ.79 కోట్ల క్రెడిట్ సౌకర్యం, హ్యాండ్లూమ్ పార్కులు, చేనేత మ్యూజియంలు, టెక్స్‌టైల్ రీసైక్లింగ్ యూనిట్లు ఏర్పాటు చేయనున్నట్లు ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీపై తీవ్ర విమర్శలు గుప్పించారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో చేనేత వృత్తిని పూర్తిగా నిర్లక్ష్యం చేశారని, నేతన్నల సమస్యలను పట్టించుకోకుండా వేలాది కుటుంబాలు ఆర్థిక ఇబ్బందుల్లోకి వెళ్లే పరిస్థితి కల్పించారని ఆరోపించారు. ప్రతిపక్షంలోకి వచ్చిన తర్వాత మాత్రమే చేనేతపై ప్రేమ చూపిస్తూ ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. చేనేత కార్మికుల సంక్షేమానికి వైసీపీ ప్రభుత్వం తీసుకున్న చర్యలుఆశించినస్థాయిలోలేవని,కూటమి ప్రభుత్వం మాత్రం ఆచరణాత్మక పథకాలతో నేతన్నలకు ఆర్థికభరోసాకల్పిస్తోందనిపేర్కొన్నారు. చేనేత వృత్తిని మరింత బలోపేతం చేసేందుకు భవి ష్యత్తులో మరిన్ని సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమా లను అమలు చేస్తామని టీడీపీ నాయకులు తెలి పారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు కమతం కాటమయ్య పరిశే సుధాకర్, పురుషోత్తం గౌడ్ భీమనేని ప్రసాద్ నాయుడు, మాధవరెడ్డి,సనత్, రాంపురంశీనా,రవి, ఫణికుమార్,చేనేత కార్మికులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# మెగా డీఎస్సీ కాదు.. దగా డీఎస్సీ' అంటూ వైఎస్సార్‌సీపీ నిరసన

## – డీఎస్సీ అవకతవకలపై సీబీఐ విచారణ జరపాలని డిమాండ్.. మంత్రి లోకేష్ రాజీనామా చేయాలంటూ నినాదాలు



**ధర్మవరం, ఆగస్టు 7, మనం న్యూస్ :** ఇటీవల నిర్వహించిన డీఎస్సీ నియామక ప్రక్రియలో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం ధర్మవరంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఏపీ జెన్–జెడ్ వార్ రిలే కార్యక్రమం రెండో రోజు భాగంగా చేపట్టిన ఈ ఆందోళనలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా మాజీ పట్టణ కన్వీనర్ రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో "మెగా డీఎస్సీ" పేరుతో నిరుద్యోగ యువతకు హామీలు ఇచ్చిన ప్రభుత్వం, చివరకు వారి ఆశలను వమ్ము చేసిందని విమర్శించారు. డీఎస్సీ పరీక్షల నిర్వహణలో అవకతవకలు, ప్రశ్నాపత్రంలీకేజీ ఆరోపణలు రావడం వల్ల నిజాయితీగా పరీక్షలు రాసిన అభ్యర్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని ఆరోపించారు. టీచర్ ఉద్యోగాల కోసం ఎన్నో సంవత్సరాలుగా సిద్ధమవుతూ టెట్, బీఈడ్ పూర్తి చేసిన వేలాది మంది నిరుద్యోగ యువతకు తీవ్ర అన్యాయం జరిగిందని ఆయన అన్నారు. డీఎస్సీ నియామకాల్లో జరిగిన అక్రమాలపై కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ)తో సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నైతిక బాధ్యత వహిస్తూ వెంటనే రాజీనామా చేయాలని, నిజాయితీగా పరీక్ష రాసిన అభ్యర్థులకు న్యాయంచేయాలని,ఎన్నికలహామీ మేరకు నిరుద్యోగ భృతిని అమలు చేయడంతో పాటు పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయి లను విడుదలచేయాలనివైఎస్సార్‌సీపీ నాయకులు డిమాండ్ చేశారు. "మెగా డీఎస్సీ కాదు.. దగా డీఎస్సీ", "విద్యార్థులభవిష్యత్తుతోచెలగాటంఆపాలి", "డీఎస్సీ అవకతవకలపై సీబీఐ విచారణ జరపాలి", "లోకేష్ రాజీనామా చేయాలి" అంటూ నిరసనకా రులనినాదాలుచేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యువజన విభాగంనియోజకవర్గ అధ్య క్షుడు గంగాధర్, పట్టణ అధ్యక్షుడు వేణు, సోషల్ మీడియా నియోజకవర్గఅధ్యక్షుడుచిరు వర్ధన్ రెడ్డి,పట్టణ అధ్యక్షుడు జక్కాభార్గవ,మాజీకన్వీనర్‌రాజశేఖర్‌రెడ్డి, చెన్నారెడ్డి, దివాకర్ నాయక్, దాసరి శివ, మహమ్మద్ రఫీ, సిద్ధిక్,హరి,మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ మాసపల్లి సాయికుమార్,మాజీకౌన్సిలర్లురమాదేవి, చందా బాషా, అమీర్ బాషా తదితరులు పాల్గొన్నారు




# 150 మంది విద్యార్థులకు ఉచిత కంటి పరీక్షలు

## ఐదుగురికి కంటి అద్దాలు అవసరమని నిర్ధారణ



**ధర్మవరం, ఆగస్టు 7, మనంన్యూస్ :** ధర్మవరం పట్టణంలోని ఇందిరమ్మ కాలనీలో ఉన్న పురపాలక పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన ఉచిత కంటి పరీక్షల శిబిరానికి విద్యార్థుల నుంచి విశేష స్పందన లభించింది. ఆప్తాలిక్ ఆఫీసర్ ఉరుకుందప్ప ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో మొత్తం 150 మందివిద్యార్థిని, విద్యార్థులకు కంటిపరీక్షలునిర్వహించారు. పరీక్షల అనంతరం ఐదుగురు విద్యార్థులకు దృష్టి లోపం ఉన్నట్లు గుర్తించి, వారికి కంటి అద్దాలు అవసరమని నిర్ధారించినట్లు ఆప్తాలజిస్టు ఉరుకుందప్ప తెలిపారు. అవసరమైన విద్యార్థులకు త్వరలో కంటి అద్దాలు అందించేందుకు చర్యలు చేపడతామని ఆయన పేర్కొన్నారు. విద్యార్థుల్లో కంటి సంబంధిత సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించి తగిన చికిత్స అందించేందుకు ఇటువంటి వైద్య శిబిరాలు ఎంతో ఉపయోగపడతాయని పాఠశాల ఉపాధ్యాయులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాలప్రధానోపాధ్యాయులు రమణప్ప, ఉపాధ్యాయులు, మలేరియాఅసిస్టెంట్‌శ్రీనివాసులు వైద్యసిబ్బందిఅరుణ, లలితమ్మ పాల్గొన్నారు.

# మడకశిర నగర పంచాయతీ నూతన కమిషనర్‌గా మురళిధర్

## – ఘన స్వాగతం పలికిన కార్యాలయం బృందం



**మడకశిర,ఆగస్టు 07,మనంన్యూస్:** మడకశిర నగర పంచాయతీ ఇంచార్జీ కమిషనర్‌గా డి.మురళిదర్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా, నగర పంచాయతీ అధికారులు, సిబ్బంది కలసి ఘన స్వాగతం పలికారు. శాలువా కప్పి పూలమాల వేసి ఘనంగా సన్మానించారు. ఆయనకు అభినందనలు తెలిపారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ ఇంచార్జీ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన అయన పదవీ కాలం ప్రశాం తంగా, షాపిగా, సమర్ధవంతంగా సాగాలని వారు ఆకాంక్షించారు. ఈ సందర్బంగా బాధ్యతలను స్వీకరించిన కమిషనర్ మురళిదర్ మాట్లాడుతూ ప్రజల ప్రయోజనం కోసం పౌర సేవలను మెరుగుపరచడం, పరిశుభ్రతను. నిర్వహించడం, వివిధ మున్సిపల్ అభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయడంపై ప్రత్యేక దృష్టి సారిస్తామని కమిషనర్ స్పష్టం చేసారు. ఈ కార్యక్రమంలో నగరపంచాయతీ అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా 12వ జాతీయ చేనేత దినోత్సవం

**బుక్కరాయసముద్రం ఆగస్టు 7, మనంన్యూస్:** జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా సింగనమల వైయస్సార్సీపి నియోజకవర్గం సమన్వయకర్త డాక్టర్ సాగే శైలజనాథ్ ఆదేశాల మేరకు పుట్లూరు మండల కేంద్రంలో మండల కన్వీనర్ మహేశ్వర్ రెడ్డిఆధ్వర్యంలో సింగనమల నియోజకవర్గం వైఎస్ఆర్సిపి చేనేత విభాగ అధ్యక్షులు మాడిశెట్టి సురేష్ ఆధ్వర్యంలో 12వ జాతీయ చేనేత దినోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు పుట్లూరు చేనేత మండల అధ్యక్షులు వీరనారాయణ, అనంతపురంజిల్లాచేనేతవిభాగప్రధానకార్యదర్శి నిమ్మలభాస్కర , దయలకుంటపల్లి గ్రామకమిటీ అధ్యక్షులురఘునందన్, సూర్యపల్లి నాగేంద్రనార్పల రామాంజనేయులు, బండారు మారుతి చేనేత కుటుంబ సభ్యులు పాల్గొనడం జరిగింది



# మంచి మార్గం ఎంచుకోవాలి

సిఐ హేమంత్ కుమార్



**ఆత్మకూరు ఆగస్టు 7 మనంన్యూస్ :** ప్రతి విద్యార్థి మంచి మార్గంలో నడవాలని సర్కిల్ఇన్స్పెక్టర్ హేమంత్ కుమార్ విద్యార్థులకు సూచించారు శుక్రవారం మండలకేంద్రంలోని జూనియర్కళాశాలలో రోడ్డుప్రమాదాలు మార్గద్రవ్యాలు చట్ట వ్యతిరేక పనులపై అవగాహన కార్యక్రమం చేపట్టారు ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి చట్ట వ్యతిరేక పనులకు దూరంగా ఉండాలన్నారు మీ విద్య కోసం తల్లిదండ్రులు ఎంతో కష్టపడి చదివించడం జరుగుతుందన్నారు. కష్టపడిచదివి ఉన్నతస్థానాలను సాధించాలని ఆకాంక్షించారు. ఎస్సై లక్ష్మణరావు విద్యార్థినిలు ఆత్మకూరు పోలీస్ సిబ్బంది ఉన్నారు

# తల్లిపాలు వారోత్సవాలు



**ఆత్మకూరు ఆగస్టు 7 మనంన్యూస్ :** మండల కేంద్రం ఆత్మకూరులోని భగత్ సింగ్కాలనీలో అంగన్వాడి కేంద్రంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు కార్యక్రమం శిశుసంక్షేమ శాఖ వారునిర్వహించారు ఈ సందర్భంగా సూపర్వైజర్ ఝాన్సీ రాణి మాట్లాడుతూ పుట్టిన వెంటనే శిశువుకు తల్లిపాలు అందించాలనితెలిపారు ఆరు నెలలనుండి పౌష్టిక రకమైన ఆహార అందించా లన్నారు గర్భంసమయంలోమహిళలు తీసుకోవలసినజాగ్రత్తలనుగురించి వివరించారు ఈ కార్యక్రమంలో బాలింతలు గర్భవతులు మహిళలు పాల్గొన్నారు

# వేదవ్యాస మహర్షి జయంతి అధికారికంగా నిర్వహించాలి

- ఎమ్మెల్యే దగ్గుపాటిని కోరిన జశ్వంత్ వ్యాస్



**అనంతపురం, ఆగస్టు 7 మనంన్యూస్ :** శ్రీవేద వ్యాస మహర్షి జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని మత్స్యకార సంక్షేమ సమితి జిల్లా అధ్యక్షులు జశ్వంత్ వ్యాస్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ను కోరారు. శుక్రవారం ఎమ్మెల్యేను మర్యాద పూర్వకంగా కలిసిన సమితి సభ్యులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జశ్వంత్ వ్యాస్ మాట్లాడుతూ.. అర్బన్ నియోజకవర్గంలో అర్హులైన నిరుపేద బెస్తలకు నివాస స్థలాలు కల్పించి ప్రభుత్వంద్వారా ఇళ్లు నిర్మించాలన్నారు. బెస్త కులస్తులు ఎక్కువగా ఉన్న డివిజన్లలో స్థానిక మున్సిపల్ ఎన్నికలలో అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఇందుకుఎమ్మెల్యే దగ్గుపాటిప్రసాద్ సానుకూలంగా స్పందించారు. అనంతరం ఎమ్మెల్యేను పూలమాలతో సత్కరించారు. అదేవిధంగా ఇటీవల నూతన జిల్లా మత్స్యకార సంక్షేమసమితి సభ్యులనుఎమ్మెల్యే దగ్గుపాటిప్రసాద్ శుభాకాంక్షలు తెలియజేసి అభినందించారు. కార్యక్రమంలో రాష్ట్ర బెస్త కార్పొరేషన్ డైరెక్టర్ బెస్తపవన్కుమార్,మత్స్యకారసంక్షేమ సమితిరాష్ట్ర కార్యదర్శి నారాయణమూర్తి, నగర అధ్యక్షులు బెస్త అశోక్, మత్స్యకార సంక్షేమ సమితి జిల్లా గౌరవ సలహాదారులు,వరదాయపల్లి మాజీ సర్పంచ్ బెస్త రమణ, సలహాదారులు తుపాకుల శంకర్, జిల్లా ఇంచార్జి శివకుమార్, జిల్లా ఉపాధ్యక్షులు బెస్త వెంకటేష్, బెస్త రామాంజనేయులు, దుర్గా ప్రసాద్, పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరూ చేనేత వస్త్రాలు ధరించి చేనేతలకు ఉపాధి కల్పించాలి

- చేనేత సంపదను కాపాడుకోవడం మనందరి బాధ్యత
- జిల్లా రెవెన్యూ అధికారి మలోల



**అనంతపురం, కలెక్టరేట్ ఆగస్టు 07 మనంన్యూస్ :** ప్రతి ఒక్కరూ చేనేత వస్త్రాలను ధరించి చేనేత కార్మికులకు జీవనోపాధి కల్పించాలని జిల్లా రెవెన్యూ అధికారి మలోల పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్ లోని రెవెన్యూ భవన్ నందు 12వ జాతీయ చేనేత దినోత్సవ కార్యక్రమాన్ని అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా రెవెన్యూ అధికారి మలోల మాట్లాడుతూ చేనేత మన జాతి సంపద దానిని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. చేనేత వస్త్రాలు ధరించడం వల్ల ఆరోగ్యాన్ని కాపాడుకోవడమే కాక మన సంస్కృతి సాంప్రదాయాలను కాపాడుకోగలిగిన వారమవుతామన్నారు.చేనేత రంగానికి భారతదేశంలో సుదీర్ఘ చరిత్ర ఉందన్నారు. భారతీయ చేనేత కళాకారుల సృజన అద్భుతమైనదని చేనేతలు వస్త్రాలు నేయడంలో వారి ప్రతిభ అంతర్జాతీయ ఖ్యాతి గడించిందన్నారు. అగ్గిపెట్టెలో ఇమిడిపోయే చీరలను నేసిన ఘనత భారత చేనేత కళాకారులదన్నారు. జాతిపిత గాంధీజీ కూడా రాట్నంపై నూలు వడకడానికి అత్యంతప్రాధాన్యంఇచ్చారనిరాట్నం మన స్వాతంత్ర్య సంగ్రామంలో ప్రధాన భూమిక పోషించిందన్నారు. వ్యవసాయ రంగం తర్వాత దేశంలో అత్యధికులకు జీవనోపాధి కల్పిస్తున్నది చేనేత రంగమేనన్నారు. దేశంలో కోటి 30 లక్షల మందికి ఈ రంగం ప్రత్యక్షంగా ఉపాధి కల్పిస్తుందని పరోక్షంగా మరో 9, కోట్ల మంది ఈ రంగంపై ఆధారపడి జీవిస్తున్నారన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉత్పత్తి అవుతున్న చేనేత వస్త్రాల్లో 95 శాతం భారతదేశంలో చేనేత ఉత్పత్తి అవుతుంది. దేశంలో తయారవుతున్న వస్త్రాల్లో చేనేత వాటా 23% అన్నారు. మన చేనేత సంస్కృతి సాంప్రదాయాలను కాపాడుకునేందుకు ప్రభుత్వం ప్రతి ఏడాది ఆగస్టు 7వ తేదీన జాతీయ చేనేత దినోత్సవాన్ని అత్యంత ఘనంగా నిర్వహించుకోవడం జరుగుతుందన్నారు. 2015 ఆగస్టు 7న చెన్నైలో నిర్వహించిన జాతీయ చేనేత దినోత్సవంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పాల్గొని చేనేత యొక్క విశిష్టతను వివరించడం జరిగిందన్నారు. 1905, ఆగస్టు 7న కలకత్తా టౌన్ హాల్లో మొట్టమొదటిగా స్వదేశీ ఉద్యమానికి అంకురార్పణ జరిగింది. విదేశీ వస్త్రాలను బహిష్కరించాలని స్వదేశీ వస్త్రాలనే వాడాలని అప్పటి నాయకులు పిలుపునివ్వడం జరిగిందన్నారు.అందువల్ల ప్రతి ఏటా ఆగస్టు 7 న జాతీయ చేనేత దినోత్సవంగా పాటించాలని ఎన్డీఏ ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. చేనేత రంగం మరింత అభివృద్ధి చెందేందుకు ప్రభుత్వం చేనేత కార్పొరేషన్ఏర్పాటు చేసిచేనేత రంగ ప్రయోజనాల కోసం అన్ని రకాల నూలును కొనడం, నిల్వ చేయడంమార్కెటింగ్వంటి కార్యకలాపాలను కార్పొరేషన్ ద్వారా చేపడుతుందన్నారు. ఎంతో ఘన చరిత్ర ఉన్న మన చేనేత రంగాన్ని ప్రోత్సహించేందుకు ప్రతి ఒక్కరూ చేయాలన్నారు. ఈ సందర్భంగా మహిళా స్వయం సహాయక సంఘాలలోని 735 మంది చేనేత లబ్ధిదారులకు బ్యాంకు రుణాలు 15,02,22,000/-రూపాయల మెగా చెక్కును ముఖ్య అతిథుల చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేశారు.ఈ కార్యక్రమానికి ముందు ఫాదర్ ఫెర్రర్ విగ్రహం నుంచి కలెక్టరేట్లోని రెవిన్యూ భవన్ వరకు చేనేత కార్మికులు ప్లే కార్డులు చేత పట్టుకొని నా దేశం–నా చేనేత, ప్రతి ఒక్కరూ చేనేత వస్త్రాలు ధరించండి, చేనేత మన జాతి సంపద దానిని కాపాడడం మనందరి బాధ్యత, అనేనినాదాలతోచేనేతకార్మికులు ర్యాలీ నిర్వహించారు.ఈకార్యక్రమంలోపద్మశాలి సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ పోతుల లక్ష్మీ నరసింహులు, జిల్లా చేనేత జౌళి శాఖ అధికారి బసవరాజు, జిల్లా కో–ఆపరేటివ్ అధికారి అరుణకుమారి, జిల్లాలోని చేనేత కార్మికులు, తదితరులు పాల్గొన్నారు..

# ఎల్నినో ప్రభావంపై రైతులకు అవగాహన

- ముందస్తు ప్రణాళికతో సాగు చేపట్టాలి: వ్యవసాయ అధికారులు



**పెనుకొండ ఆగస్టు 7 మనంన్యూస్ :** ఎల్నినో ప్రభావంతో వర్షపాతం తక్కువగా నమోదయ్యే అవకాశం ఉన్నందున రైతులు ముందస్తు ప్రణాళికతో సాగు చేపట్టాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచించారు. శుక్రవారం పెనుకొండ మండలం రైతు సేవా కేంద్రం పరిధిలో రైతన్నా మీ కోసం -- ఎల్నినో ప్రభావ నివారణ కార్యాచరణ ప్రణాళికలో భాగంగా రైతు ఆండ్రూస్ సాగు చేసిన కంది పొలంలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారిణి కె.సి. చందన మాట్లాడుతూ ఎల్నినో పరిస్థితుల్లో రైతులు అనుసరించాల్సిన శాస్త్రీయ సాగు విధానాలు, డ్రైల్యాండ్ టెక్నాలజీ, వర్షాభావ పరిస్థితుల్లో పంటల నిర్వహణ పద్ధతులపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా వేరుశనగ పంటలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన సూచనలను వివరించారు.ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో ఎల్నినో ప్రభావంతో వర్షపాతం తక్కువగా ఉండే అవకాశం ఉన్నందున వర్షపు నీటిని సంరక్షించడం, డ్రిప్ ఇరిగేషన్ ద్వారా నీటిని పొదుపుగా వినియోగించడం, పంటలను రక్షించుకోవడంపై రైతులు దృష్టి సారించాలనిసూచించారు. పంటమార్పిడి, అంతర పంటలు, తక్కువ నీటి అవసరమయ్యే పంటల సాగును ప్రోత్సహించుకోవాలని, నోటిపై చేసిన పంటలకు దిగుబడి ఆధారిత పంటల బీమా పథకంలో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని కోరారు. మట్టి పరీక్ష ఆధారంగానే ఎరువులు వినియోగించాలని, అధికంగా ఎరువులు వాడటం మానుకోవాలని సూచించారు.అనంతరం ఉద్యానవన శాఖ అధికారి రాంప్రసాద్ మాట్లాడుతూ.. ఫార్మ్ పాండ్లు, చెక్డ్యామ్ల ద్వారా వర్షపు నీటిని ఒడిసి పట్టి భూగర్భ జలాలను పెంచుకోవాలని సూచించారు. డ్రిప్, స్ప్రింక్లర్, మల్చింగ్ వంటి నీటి పొదుపు పద్ధతులను అన్ని పంటల్లోనూ అనుసరించాలని తెలిపారు. పంట బీమా, రాయితీలు, ప్రస్తుతం అమలులో ఉన్న ప్రభుత్వ పథకాల వివరాల కోసం స్థానిక వ్యవసాయ, ఉద్యాన సహాయకులను సంప్రదించాలని కోరారు. పట్టు పరిశ్రమ శాఖ అధికారి ఓబులేష్ మాట్లా డుతూ.. మల్బరీ సాగులో ప్రకృతి వ్యవసాయ పద్ధతులను పాటించిఅధికదిగుబడులు సాధించాలని సూచించారు. పట్టు పరిశ్రమ శాఖ అమలు చేస్తున్న వివిధ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని, ఇతర రైతులను కూడా మల్బరీ సాగు వైపు ప్రోత్సహించాలని కోరారు.ఏపీ సిఎన్ఎఫ్ అధికారి సాకప్ప మాట్లాడుతూ పిడియంయస్ , సీడ్ ఫెర్టిలైజేషన్, ఆఫ్ మూన్ మోడల్ పద్ధతులపై రైతులకు సమగ్ర అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఈఓ ఎం.అశోక్కుమార్, రైతు సేవా కేంద్రం సిబ్బందిప్రసన్న లక్ష్మీ, భారతి, పట్టు పరిశ్రమ శాఖ, ప్రకృతివ్యవసాయసిబ్బంది నారాయణ నాయక్, ఈశ్వర్, చంద్ర, సోము, నరసింహులు, జాఫర్, ఆంజనేయులుతదితరరైతు సోదరులు పాల్గొన్నారు.



# చేనేత దినోత్సవాన్ని హక్కుల దినోత్సవంగా జరుపుకోవాలి



**ధర్మవరం, ఆగస్టు 7, మనం న్యూస్ :** జాతీయ చేనేత దినోత్సవాన్ని చేనేతల హక్కుల దినోత్సవంగా జరుపుకోవాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ముసుగు మధు, ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటనారాయణ పిలుపునిచ్చారు. గురువారం కదిరిగేట్ వద్ద ఉన్న నేతన్న విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం వారు మాట్లాడారు.చేనేత రంగం దేశంలో వ్యవసాయం తర్వాత అత్యధిక ఉపాధి కల్పిస్తున్న రంగమని, ధర్మవరం పట్టు చీరలు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందాయని పేర్కొన్నారు. చేనేత కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం మరింత ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన "నేతన్న సేవలో" పథకాన్ని చేనేత ఉపవృత్తుల కార్మికులకు కూడా వర్తింపజేయాలని, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకాన్ని విస్తరించాలని డిమాండ్ చేశారు. అలాగే ధర్మవరంలో ఆర్డీడీ కార్యాలయం ఏర్పాటు చేయడం, చేనేత రంగానికి తగిన బడ్జెట్ కేటాయింపులు, సహకార సంఘాల బకాయిల చెల్లింపు, రుణమాఫీ,ముడిసరుకులపై సబ్సిడీ, చేనేత వస్త్రాల ప్రభుత్వ కొనుగోలు, ప్రత్యేక చేనేత మంత్రిత్వ శాఖ ఏర్పాటు తదితర డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు.ఈ కార్యక్ర మంలో చేనేత కార్మిక సంఘం జిల్లా గౌర వాధ్యక్షుడు వెంకటస్వామి, ఏఐటీయూసీ జిల్లా నాయకుడు వై.రమణ ,రవికుమార్, చెన్న భుజంగం, చెన్నంపల్లి శ్రీనివాసులు, సంకారపు రాజా, బాల రంగయ్య, పామల శ్రీనివాసులు, కొండన్నతో పాటు పెద్ద సంఖ్యలో చేనేత కార్మికులు పాల్గొన్నారు.

# వ్యవసాయ శాస్త్రవేత్తలు విస్తృతంగా పంటపొలాలు సందర్శన

– ప్రత్యామ్నాయ పంటల సాగు పట్ల రైతులకు అవగాహన సూచనలు సలహాలు



**అమరాపురం,ఆగస్టు 07,మనం న్యూస్:** మడకశిర వ్యవసాయ శాఖ డివిజన్ పరిధిలోని అమరాపురం మండలంలో రేకులకుంట వ్యవసాయ పరిశోధన సంస్థకు చెందిన శాస్త్రవేత్తల బృందం రైత న్నల పంట పొలాలను శుక్రవారం విస్తృతంగా పర్యటించారు. గత 30 రోజులుగా కొనసాగుతున్న వర్షాభావం (బెట్ట) పరిస్థితుల నేపథ్యంలో రైతుల పొలాలను వారు నేరుగా సందర్శించి పంటల సంరక్షణ, యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. అమరాపురం మండలంలోని రైతు సేవా కేంద్రాల పరిధిలోని గ్రామాలలో పర్యటించారు.వలస, అమరాపురం,తమ్మడేపల్లి-1, తమ్మడేపల్లి-2, హేమావతి-1, హేమావతి-2 రైతు సేవా కేంద్రాల పరిధి లోని పంటలను శాస్త్రవేత్తల బృందంపరిశీలించారు.శాస్త్రవేత్తలు రైతులతో కలిసి వేరుశనగ, కంది,మొక్కజొన్న,పత్తి పంట పొలాలను స్వయంగా పరిశీలించి, ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు అనుగుణంగాతగినసలహాలు, సూచనలు అందించారు. తేమ పరిరక్షణ చర్యలు,బెట్ట పరిస్థితుల నుంచి వేరుశనగ, కంది, మొక్కజొన్న, పత్తి పంటలను రక్షించేందుకు అవసరమైన తేమ పరిరక్షణ యాజమాన్య పద్ధతులు జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.వాతావరణ ఆధారిత ప్రణాళికలో భాగంగా మారుతున్న వాతావరణ పరిస్థితులను, ముందస్తు వర్ష సూచనలను గమనిస్తూ పంటలనిర్వహణలోమార్పులు చేసు కోవాలని వారు సూచించారు. స్వల్పకాలిక, ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసుకోవాలన్నారు. రాబోయే వర్షాలను దృష్టిలో ఉంచుకుని ఖాళీగా ఉన్న బీడు భూముల్లో స్వల్పకాలిక పంటలను సాగు చేయాలని వారు కోరారు.చిరుధాన్యాలు కొర్రలు,సామలు,అరికలు, సజ్జలు.అపరాలు, ఉలవలు, పెసర, మినుములు, అలసందలు పంటలు సాగుచేసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు రేకులకుంట వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు: డాక్టర్ ఎం. విజయశంకర్ బాబు, డాక్టర్ రాధాకుమారి, డాక్టర్ నరసింహులు, డాక్టర్ నారాయణస్వామి.మండలవ్యవసాయ శాఖ అధికారిమంజునాథ్, గ్రామ వ్యవసాయ సహాయ కులు మౌనిక,రాఘవేంద్ర,మహాలక్ష్మి,ఇతర భాగస్వాములు సంబంధిత రైతు సేవా కేంద్రాల పరిధిలోని అధికారులు,ప్రకృతివ్యవసాయసిబ్బంది, గ్రామాలకు చెందిన రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.




# టిడిపితోనే అభివృద్ధి



**ఆత్మకూరు ఆగస్టు 7 మనంన్యూస్ :** టిడిపి తోనే గ్రామాలలో అభివృద్ధి సాధ్యమని మండల కన్వీనర్ శ్రీనివాసులు పేర్కొన్నారు శుక్రవారం ఆత్మకూరులోనే తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మండల నాయకులు కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా కన్వీనర్ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ అభివృద్ధి సంక్షేమానికి ముందుంటుందన్నారు టిడిపి ప్రచార కార్యక్రమంలో భాగంగా మై టిడిపి యాప్ లో వంద శాతం సాధించిన పి కొత్తపల్లి ఉమాపతి అజయ్ కుమారులకు సన్మానం చేశారు ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పలమాసి సూరి కొత్తపల్లి హనుమప్ప వెంకటనారాయణ కందుల ఓబుల పతి శశాంక్ చౌదరి తిక్క స్వామి నాయి బ్రాహ్మణ ఆనందు అస్వార్థ చౌదరి మంద హక్కులన్నా వడ్డే సరళ పెద్ద లక్ష్మమ్మ కాయగూరల ఓబుళపతి తదితరులు పాల్గొన్నారు

# 15 రోజుల్లో మూడు పథకాలు, ప్రజలకు సంక్షేమ ఫలాలు

- కూటమి ప్రభుత్వ పాలనపై ప్రజల్లో హర్షం
- తెలుగు యువత మండల ఉపాధ్యక్షుడు గుత్తా కార్తీక్ నాయుడు



**ముదిగుబ్బ, ఆగస్టు 7 మనం న్యూస్ :** కూటమి ప్రభుత్వం సంక్షేమానికి పెద్దపీట వేస్తూ, అర్హులైన ప్రజలకు పథకాల ప్రయోజనాలను వేగంగా అందిస్తోందని తెలుగు యువత మండల ఉపాధ్యక్షుడు గుత్తా కార్తీక్ నాయుడు అన్నారు. కేవలం 15రోజులవ్యవధిలో మూడు కీలక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేసి, ప్రజలకు ప్రభుత్వం అండగా నిలిచిందని తెలిపారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి భరోసా కల్పించే తల్లికి వందనం, పేదలు, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు తదితర అర్హులకు ఆర్థిక భరోసా అందించే ఎన్టీఆర్ భరోసా పెన్షన్, చేనేత కార్మికుల సంక్షేమానికి చేనేత సేవలో వంటి కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేస్తోందనిపేర్కొన్నారు. "మాటల్లో కాదు.. చేతల్లో సంక్షేమం" అన్న విధంగా కూటమి ప్రభుత్వంపనిచేస్తోందని గుత్తాకార్తీక్‌నాయుడు అన్నారు. అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రినారాచంద్రబాబు నాయుడు నాయకత్వంలోని ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు.సంక్షేమంతో పాటురాష్ట్ర అభివృద్ధికి సమప్రాధాన్యతఇస్తూ, ప్రజలకుఇచ్చినహామీలను ఒక్కొక్కటిగాఅమలు చేస్తున్నారనిఅన్నారు.ప్రజల సంక్షేమమేలక్ష్యంగాప్రభుత్వంతీసుకుంటున్న నిర్ణయాలపైప్రజల్లోవిశ్వాసం పెరుగుతోందని పేర్కొన్నారు.

# 32 మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కులు



**ధర్మవరం, ఆగస్టు 7, మనంన్యూస్ :** ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా ధర్మవరం నియోజకవర్గానికి చెందిన 32 మంది లబ్ధిదారులకు రూ.15,36,742 విలువైన చెక్కులను రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి, ఎమ్మెల్యే సత్యకుమార్ యాదవ్ శుక్రవారం పంపిణీ చేశారు. ధర్మవరంలోని ఎన్డీఏ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, అనారోగ్యంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి గొప్ప భరోసాగా నిలుస్తోందన్నారు. వైద్య ఖర్చుల వల్ల ఏ కుటుంబమూ ఇబ్బంది పడకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ వేగంగా ఆర్థిక సహాయం అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని చెప్పారు.చెక్కులు అందుకున్న లబ్ధిదారులు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

# ఘనంగా అంగన్వాడి కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు

**నార్పల ఆగస్టు 7 మనం న్యూస్ :** మండలం పరిధిలోని నడిమి దొడ్డి రెండవ అంగన్వాడీ కేంద్రం నందు శుక్రవారం రోజున తల్లిపాల వారోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సిడిపిఓ భారతి, సూపర్వైజర్ సునాలిని, కోఆర్డినేటర్ లావణ్య హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో భాగంగా చిన్నారుల తల్లులకు తల్లిపాల ప్రాముఖ్యత గురించి వివరించడం జరిగింది. బిడ్డ పుట్టిన అరగంటలోపే ముర్రు పాలు ఇవ్వాలని, ఆ పాల ద్వారా చిన్నారులకు వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని పిల్లలు వ్యాధుల బారిన



పడకుండా సంరక్షించబడతారని తెలిపారు. అంగన్వాడీ కేంద్రం సేవలను ప్రతి తల్లి సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా కోరారు. అంగన్వాడీ కార్యకర్త శ్రీదేవి, కళావతి, రామాజీనమ్మ, ఆయాలు, చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.

# నాగేపల్లిలో టీడీపీ ఇంటింటి కార్యక్రమం



**లేపాక్షి, ఆగస్టు 7, మనంన్యూస్:** మండలంలోని కోడిపల్లి పంచాయతీ నాగేపల్లి గ్రామంలో బూత్ నంబర్ 186 పరిధిలో తెలుగుదేశం పార్టీ నాయకులు,కార్యకర్తలు ఇంటింటి కార్యక్రమాన్నిఉత్సాహంగా నిర్వహించారు. గ్రామంలోని ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలను కలుసుకుంటూ పార్టీ కార్యక్ర మాలను వివరించారు.టీడీపీకో-క్లస్టర్ నాగరాజు,కో-కన్వీనర్ గంగిరెడ్డి, బూత్ కన్వీనర్ నాగరాజుఆధ్వర్యంలోనిర్వహించిన ఈకార్యక్రమంలోపంచాయతీటీడీపీ నాయకులు కే. లక్ష్మీనారాయణ, బుక్కపట్నం శంకరప్ప, వీ. కిష్టప్పతో పాటు పలువురుపార్టీ కార్యకర్తలుపాల్గొన్నారు.ఈసందర్భంగా నాయకులు మాట్లా డుతూ బూత్ స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు ప్రతి కార్యకర్త సమన్వయంతో పనిచేయాలనిపిలుపునిచ్చారు. ప్రజలసమస్యలను నేరుగా తెలుసుకుని వాటిపరిష్కారానికి కృషిచేస్తామనితెలిపారు.రానున్నరోజుల్లో గ్రామస్థాయిలో పార్టీ కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహిస్తామని పేర్కొన్నారు.

# ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా అవగాహన కార్యక్రమం



**బుక్కరాయసముద్రం ఆగస్టు 7 ,మనంన్యూస్:** ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు (ఆగస్టు 1-7) సందర్భంగా ప్రభుత్వ వైద్య కళాశాల, అనంతపురం, సామాజిక వైద్య విభాగం ఆధ్వర్యంలో బుక్కరాయసముద్రం అర్బన్ హెల్త్ సెంటర్‌లో శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సంవత్సరం ప్రపంచ తల్లిపాల వారోత్సవాల థీమ్ జీవితానికి స్థిరమైన ఆరంభం కోసం తల్లిపాలు: ఇప్పటికే ఉన్న మంచి పద్ధతులను బలోపేతం చేద్దాం ("జీవితంలో సుస్థిర ఆరంభం కోసం తల్లిపాలు ఇవ్వడం: పనిచేసే విధానాలను బలోపేతం చేద్దాం నిర్ణయించారు.)"ఈ సందర్భంగా సామాజిక వైద్య విభాగం ఆచార్యులు డాక్టర్ టి. మధుమాట్లాడుతూ, తల్లిపాలు శిశువులకు సంపూర్ణ పోషకాహారాన్ని అందించడమే కాకుండా, వ్యాధి నిరోధక శక్తిని పెంపొందిస్తాయని తెలిపారు. పుట్టిన వెంటనే మొదటి గంటలోపు తల్లిపాలను ప్రారంభించడం, మొదటి ఆరు నెలల పాటు శిశువుకు తల్లిపాలు మాత్రమే ఇవ్వడం, అనంతరం సరైన అనుబంధ ఆహారంతో పాటు రెండేళ్లు లేదా అంతకంటే ఎక్కువ కాలం తల్లిపాలను కొనసాగించడం ఎంతో అవసరమని వివరించారు.అలాగే, తల్లిపాలుశిశువుల ఆరోగ్యానికి మాత్రమే కాకుండా తల్లుల ఆరోగ్యానికి కూడా ఎంతో మేలు చేసాయని, తల్లిపాలు ఇవ్వడం వల్ల రొమ్ము క్యాన్సర్, అండాశయ క్యాన్సర్ వంటి వ్యాధుల ప్రమాదం తగ్గుతుందని పేర్కొన్నారు.గర్భిణీలు, బాలింతలు మరియు వారి కుటుంబ సభ్యులు తల్లిపాల ప్రాముఖ్యతను గుర్తించి, తల్లిపాలను ప్రోత్సహించాలని సామాజిక వైద్య విభాగం వైద్యులు కోరారు.ఈ కార్యక్రమంలో సామాజిక వైద్య విభాగానికి చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ సుమనా గోపీచంద్, డాక్టర్ రెహమాన్, డాక్టర్ సుష్మ, డాక్టర్ శ్రీనివాస రావు, డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ నాగ ప్రవీణ్, డాక్టర్ గీతాంజలి, డాక్టర్ గీతా, డాక్టర్ సునీల్, హెల్త్ఎడ్యుకేషన్ఆఫీసర్ రాజు, సీనియర్ రెసిడెంట్ డాక్టర్ వైష్ణవి, పోస్టు గ్రాడ్యుయేట్ విద్యార్థులు పాల్గొన్నారు.అలాగే, బుక్కరాయ సముద్రం అర్బన్ హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ తాహిర్ ఉన్నిసా, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ (సిహెచ్ఓ) మోహన్ రావు, వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలుపాల్గొన్నారు.ఈ అవగాహన కార్యక్రమంలో బుక్కరాయసముద్రం ప్రాంతానికి చెందిన గర్భిణీలు, బాలింతలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేలా పంటల సాగు చేయాలి

'రైతన్న మీకోసం' కార్యక్రమంలో అధికారుల సూచనలు



**ధర్మవరం, ఆగస్టు 7 మనంన్యూస్** : ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచు కొని రైతులు పంటల సాగులో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయ, ఏపీసీఎన్ఎఫ్ అధికారులు సూచించారు. ధర్మవరం మండలంలోని మలకాపురం యూనిట్ పరిధి చిగిచెర్ల క్లస్టర్‌లోని వసంతపురం గ్రామంలో శు క్రవారం నిర్వహించిన 'రైతన్న మీకోసం' కార్యక్రమంలో రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, విత్తనాలను శుద్ధి (సీడ్ ట్రీట్‌మెంట్) చేసి విత్తాలని, మొక్కల మధ్య కనీసం ఒక మీటరు దూరం ఉండేలా సాగు చేపట్టాలని సూచించారు. వర్షాభావ పరిస్థితులను తట్టుకు నేందుకు కందులు, అనుములు, సజ్జలు, గోరుచిక్కుడు, టమాటా, వంకాయ, మిరపతో పాటు జీవ వైవిధ్య పంటలను సాగు చేయడం ద్వారా నష్టాలను తగ్గించుకోవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో డీపీఎం లక్ష్మణ్ నాయక్, చక్రవర్తి, డీఆర్ నవీన్, ఏఓ ముస్తఫా, ఎఫ్ఎంటీ ఆదినారాయణ, ఎన్ఎఫ్ఏ నవీన్, వీఏఏ మీనా, నాగార్జున, ఐసీఆర్‌పీ పక్కిరప్ప, టీ-ఐసీఆర్‌పీలు నాగరత్న, అనిత, మమత, ఎంఎంఎల్ఎఫ్‌లు నాగమణి, అరవింద్, ఏపీసీఎన్ ఎఫ్ సిబ్బంది, రైతులు నాగేంద్రప్రసాద్, హరిప్రసాద్, కృష్ణయ్య, మల్లికార్జున, గోపాల్, జయరాములు, పెద్దమోలా సబ్ తదితరులు పాల్గొన్నారు.

# విత్తన ఉత్పత్తి క్షేత్రాల అభివృద్ధే లక్ష్యం

జిల్లా వ్యవసాయ అధికారి



**కనేకల్ ఆగస్టు 7 మనంన్యూస్** : జిల్లాలో నాణ్యమైన విత్తనాల కొరతను నివారించడానికి విత్తన ఉత్పత్తి క్షేత్రాల అభివృద్ధి అత్యంత కీలకమని జిల్లా వ్యవసాయఅధికారి ఎన్. సాలు రెడ్డి, టెక్నికల్ వ్యవసాయ అధికారి వంశీ అన్నారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని స్థానిక వ్యవసాయ విత్తన ఉత్పత్తి క్షేత్రాన్ని జిల్లా అధికారులు శుక్రవారం సందర్శించారు. అనంతరం వారు మాట్లాడుతూ విత్తన ఉత్పత్తి క్షేత్రానికి సంబంధించిన రికార్డులు, నిల్వలో ఉన్న విత్తన ధాన్యం నాణ్యత, నిర్వహణ విధానాలను క్షుణ్ణంగా పరిశీలించినట్లు తెలిపారు. క్షేత్రంలో జరుగుతున్న పనితీరుపై అధికారులతో సమీక్ష నిర్వహించి, విత్తన ఉత్పత్తి క్షేత్ర అభివృద్ధికి అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచనలు చేశారు. అలాగే రైతులకు నాణ్యమైన విత్తనాలు అందేలా ఉత్పత్తి నిల్వ, నిర్వహణలో నాణ్యత ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. క్షేత్ర అభివృద్ధికి అవసరమైన అన్ని చర్యలు చేపడతామని జిల్లా వ్యవసాయ అధికారి ఎన్ సాలు రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏడిఏ ఇన్చార్జ్ ఎ.మహేష్, స్థానిక మండల వ్యవసాయ అధికారి జగదీష్ బాబు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# కియా ఇండియా-ఐఐటీ తిరుపతి భాగస్వామ్యంలో మరో కీలక మైలురాయి

- ఇన్‌స్పైర్ వర్క్స్' మేకర్స్ ల్యాబ్ ప్రారంభం.. ▪ రూ.25 కోట్లకు పైగా పెట్టుబడికి కియా నిర్ణయం




**పెనుకొండ ఆగస్టు 7 మనంన్యూస్ :** కియా ఇండియా, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ తిరుపతి (ఐఐటీ తిరుపతి) మధ్య కొనసాగుతున్న వ్యూహాత్మక భాగస్వామ్యంలో మరో కీలక మైలురాయి నమోదైంది. ఐఐటీ తిరుపతిలో 'ఇన్‌స్పైర్ వర్క్స్ - ది మేకర్స్ ల్యాబ్'ను కియా ఇండియా చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ తేహ్యూన్ కిమ్, ఐఐటీ తిరుపతి డైరెక్టర్ ప్రొఫెసర్ కె.ఎన్. సత్యనారాయణ సంయుక్తంగా ప్రారంభిం చారు. 2025 మే 9న కియా ఇండియా, ఐఐటీ తిరుపతి మధ్య కుదిరిన అవగాహనా ఒప్పందం (ఎంఓ యు ) అనంతరం ఏడాది కాలానికి పైగా కొనసాగుతున్న భాగస్వామ్యంలో భాగంగా ఈ మేకర్స్ ల్యాబ్‌ను ఏర్పాటు చేశారు. ల్యాబ్‌కు సంబ ంధించిన ఫేజ్-ఎ విజయవంతంగా పూర్తవడంతో పాటు అత్యాధునిక పరికరాలను సమకూర్చిన సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థుల ఆవిష్కరణలకు వేదిక::ఇన్‌స్పైర్ వర్క్స్ ద్వారా విద్యార్థులు తమ సొంత ఆలోచనలతో ప్రాజెక్టులు, ప్రోటోటైప్స్‌ను రూపొందించుకునే అవకాశం లభించనుంది. విద్యార్థులు తరగతి గదుల్లో నేర్చుకున్న సాంకేతిక నైపుణ్యాలను వాస్తవ ప్రపంచ అవసరాలకు అనుగుణంగా ఉపయోగిం చుకునేందుకు ఈ మేకర్స్ ల్యాబ్ దోహదపడనుంద న్నారు .కియా ఇండియా వచ్చే ఐదేళ్లలో ఐఐటీ తిరుపతిలో రూ.25 కోట్లకు పైగా పెట్టుబడి పెట్టాలని నిర్ణయించింది. ల్యాబ్ అభివృద్ధితో పాటు విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు, పరిశోధన మరియు అభివృద్ధి కార్యక్రమాలకు ఈ నిధులను వినియోగి ంచనున్నారు.సృజనాత్మకతకు కేంద్రంగా మారాలి:: ఐఐటీ తిరుపతి డైరెక్టర్ ప్రొఫెసర్ కె.ఎన్. సత్య నారాయణ మాట్లాడుతూ.. కియా ఇండియా-- ఐఐటీ తిరుపతి భాగస్వామ్యం ప్రతి మైలురాయిని అధిగమిస్తూ మరింత బలోపేతం కావడం ఆనందంగా ఉందన్నారు. 'ఇన్‌స్పైర్ వర్క్స్' ఐఐటీ విద్యార్థులతో పాటు పాఠశాల విద్యార్థులు, అధ్యా పకులు, స్టార్టప్‌లు, ఇతర ఆవిష్కర్తలకు సృజ నాత్మకతకు కేంద్రంగా మారుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.సాంకేతికతను సమాజ శ్రేయస్సు కోసం బాధ్యతాయుతంగా ఉపయోగిస్తూ వినూత్న ఆలోచనలు, నిరంతర కృషితో ముందుకు సాగాలని విద్యార్థులకు సూచించారు.భవిష్యత్ ఆవిష్కర్తలకు వేదిక:కియా ఇండియా చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ఆఫీసర్‌తేహ్యూన్ కిమ్ మాట్లాడుతూ.. సహకార ఆవిష్కరణలపై కియా ఇండియాకు ఉన్న నమ్మకానికి 'ఇన్‌స్పైర్ వర్క్స్ మేకర్స్ ల్యాబ్' నిదర్శ నమన్నారు. ఐఐటీ తిరుపతిలో ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడం ద్వారా యువ ఇంజనీర్లు తమ ఆలోచనలను వాస్తవ ప్రపంచంలో ఉపయోగపడే పరిష్కారాలుగా మార్చుకునేఅవకాశాన్ని కల్పిస్తున్నామని తెలిపారు. ఈ ల్యాబ్ కేవలం ప్రయోగశాల మాత్రమే కాదని, భవిష్యత్ ఆవిష్కర్తలు, సమస్యల పరిష్కారకర్తలను తీర్చిదిద్దే వేదికగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కియా-ఐఐటీ స్కాలర్‌షిప్ పొందిన విద్యార్థులకియాఉన్నతాధికారులతో నేరుగా ముచ్చటించారు.కార్యక్రమంలో కియా ఇండియా హెడ్-సిఎస్ఆర్,కార్పొరేట్అఫైర్స్‌పిఆర్ జంగ్‌హో అన్, హెడ్- హెచ్ఆర్ స్ట్రాటజీ హాంగ్‌సంగ్ పార్క్, సీనియర్ అడ్వైజర్--హెచ్అర్ గ్యూన్‌బమ్ కిమ్ తదితరులు పాల్గొన్నారు. ఐఐటీ తిరుపతి తరపున డీన్ జీఏపీ ప్రొఫెసర్ సురేష్ జైన్, మేకర్స్ ల్యాబ్ ఫ్యాకల్టీ ఇన్‌చార్జ్ డాక్టర్ డి.వి. కిరణ్, డీన్లు, విభా గాధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.



# కాంట్రాక్టు పారామెడికల్ ఉద్యోగులకూ ఓపీఎస్ అమలు చేయాలి

మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు వినతిపత్రం



**ధర్మవరం, ఆగస్టు 7, మనంన్యూస్** : 2002 కాంట్రాక్టు నోటిఫికేషన్ ద్వారా నియ మితులై అనంతరం రెగ్యులరైజ్ అయిన పారామెడికల్ ఉద్యోగులకు కూడా పాత పెన్షన్ విధానం (ఓపీఎస్) వర్తింపజేయాలని ఉమ్మడి అనంతపురం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కాంట్రాక్టు ఉద్యోగులు రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను కోరారు. శుక్రవారం ధర్మ వరంలోని మంత్రి కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఉద్యోగుల ప్రతినిధులు మాట్లాడుతూ, జీఓ ఆర్‌టీఈ నెం.459 (22-05-2002) ప్రకారం డీఎస్సీ ద్వారా ఎంపికై, రూల్ ఆఫ్ రిజర్వేషన్ మేరకు ఖాళీ పోస్టుల్లో కాంట్రాక్టు ప్రాతిపదికన విధుల్లో చేరామని తెలిపారు. అనంతరం 2024 ఏప్రిల్ 1న జారీ చేసిన ఉత్తర్వుల మేరకు అదే పోస్టు, అదే స్థానంలో తమ సేవలను క్రమబద్ధీకరించారని వివరించారు. కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన మెమో-57, రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీఓ నెం.53 (జూలై 13, 2026) ప్రకారం2004 సెప్టెంబర్1కుముందు నోటిఫికే షన్ పొందిన కొందరికి ఓపీఎస్ వర్తింపజేస్తున్న నేపథ్యంలో, అదే ప్రమాణాలను తమకూ వర్తింపజేసి పాత పెన్షన్ విధానం అమలు చేయా లని మంత్రిని కోరారు. ఈ సందర్భంగా ఉద్యోగుల సమస్యలను మంత్రి సానుకూలంగా పరిశీలిస్తా మని హామీ ఇచ్చినట్లు ఉద్యోగులు తెలిపారు. వినతిపత్రం అందజేసిన వారిలో జానీ, హరికృష్ణ, వీరశేఖర్ ప్రసాద్, రవీంద్ర, బ్రహ్మానందరెడ్డి, శ్రీనివాస్, అంజి, వెంకటేష్, రమేష్, విష్ణు, జానకిరామ్, హర్షవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

# లెన్స్‌కార్ట్ షోరూమ్‌పై మంత్రి దృష్టికి అఖిలపక్షం

స్థానిక ఆప్టికల్ వ్యాపారుల ఉపాధి పరిరక్షించాలని వినతి

**ధర్మవరం, ఆగస్టు 7, మనం న్యూస్ :** ధర్మవరంలో ప్రతిపాదిత లెన్స్‌కార్ట్ షోరూమ్ ఏర్పాటుతో స్థానిక ఆప్టికల్ వ్యాపారుల జీవనోపాధిపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని అఖిలపక్ష రాజకీయ పార్టీల నాయకులు, ప్రజా సంఘాల ప్రతినిధులు, ధర్మవరం ఆప్టికల్ అసోసియేషన్ సభ్యులు రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు వినతిపత్రం అందజేశారు. శుక్రవారం మంత్రిని కలిసి వారు మాట్లాడుతూ, పట్టణంలో దశాబ్దాలుగా కొనసాగు తున్న స్థానిక ఆప్టికల్ వ్యాపారాలపై సుమారు 200 కుటుంబాలు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆధార పడి జీవిస్తున్నాయని వివరించారు. కార్పొరేట్ సంస్థల ప్రవేశంతో చిన్న వ్యాపారులు, ఉద్యోగుల ఉపాధి దెబ్బతినే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. స్థానిక వ్యాపారుల ప్రయోజనా లను పరిరక్షించేలా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. వినతిని మంత్రి సత్య కుమార్ యాదవ్ సానుకూలంగా స్వీకరించినట్లు ప్రతినిధులు తెలిపారు. చట్టబద్ధమైన పరిధిలో



సంబ ంధిత అంశాన్ని పరిశీలించి తగిన చర్యలు తీసుకునేలా చూస్తామని మంత్రి హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. మంత్రి స్పందనపై ధర్మవరం ఆప్టికల్ అసోసియేషన్ సభ్యులు, అఖిలపక్ష నాయకులు, వామపక్ష పార్టీలు, కార్మిక, విద్యార్థి, ప్రజా సంఘా ల ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్ర మంలో స్థానిక ఆప్టికల్ వ్యాపారులు, ఉద్యోగులు, వివిధ ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# సంక్షేమ శాఖ వసతి గృహాలలో పిల్లలకు మెరుగైన సేవలు అందించాలి

ఎస్సీ,ఎస్టీ,బీసీ,మైనార్టీ వెల్ఫేర్ అధికారులతో సమావేశమై సమీక్షించిన ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్ తెగల కమిషన్ సభ్యులు పి. వెంకటప్ప

**అనంతపురం, కలెక్టరేట్ ఆగస్ట్07 మనంన్యూస్** : అనంతపురం నగరంలోని స్థానిక ఆర్ అండ్ అతిథి గృహంలో సంక్షేమ శాఖ అధికారులతో నేటి శుక్రవారం ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్ తెగల కమిషన్ సభ్యులు పి.వెంకటప్ప సమావేశం నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా షెడ్యూల్ తెగల కమిషన్ సభ్యులు మాట్లాడుతూ వసతి గృహాల్లో పేద విద్యార్థులకు మెను ప్రకారం భోజనం పెడు తున్నారా లేదా అని ఆరా తీస్తూ, సంక్షేమ హాస్టల్లో విద్యార్థుల సంఖ్య పెరిగేందుకు కృషి చేయాలని సంక్షేమ హాస్టల్లో ఏమైనా ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని తెలియజేశారు. కొన్ని శాఖల అధికారులు స్పందిం చడం లేదని, అలాంటి వారిపైన శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని తెలియ జేశారు. అం బేద్కర్ గురుకులాలలో సీట్ల సంఖ్యను పెంచేందుకు కృషి చేయాలని డిసిఓ దాదా పీర్ ను కోరడమైనది. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారిణి కుష్బూ కొఠారి, సాంఘిక సంక్షేమ శాఖ ఎస్‌డబ్ల్యూఓలు రామ్మోహన్‌రాము నాయక్, మైనార్టీ సంక్షేమ శాఖ వార్డెన్లు తదితరులు పాల్గొన్నారు



# జోరుగా ఇంటింటికీ తెలుగుదేశం



చిలమత్తూరు, ఆగస్ట్ 7, మనన్యూస్ : టీడీపీ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన డోర్ టూ డోర్ కార్యక్రమం చిలమత్తూరు మండలంలో జోరుగా జరుగుతోంది. కూటమి ప్రభుత్వం రెండు సంవత్సరాల సుపరిపాలన, సంక్షేమం, అభివృద్ధి, సూపర్ సిక్స్ పథకాల అమలు, ప్రజలకు తెలియచేసే ఇంటింటికి తెలుగు దేశం కార్యక్రమం శుక్రవారం మండలంలోని కోడూరు, మొరసలపల్లి, చిలమత్తూరు పంచాయతీలోని పలు బూత్ లలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టీడీపీ హిందూపురం నియోజకవర్గ పరిశీలకులు నరసింహ యాదవ్,పొలిటికల్‌కోఆర్డినేటర్‌శ్రీనివాసరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం రెండు సంవత్సరాలలో అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టిందని తెలిపారు. సుపరిపాలనలో భాగంగా అభివృద్ధి పనులతోపాటు సూపర్ సిక్స్ పథకాల అమలు చేసినట్లు తెలిపారు. చేస్తున్న అభివృద్ధిని ప్రజలకు తెలియజేసేందుకే ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ శ్రీనివాస్, నాగరాజు యాదవ్, గౌరీ శంకర్ , క్లస్టర్ ఇంచార్జి నందిశప్ప, లక్ష్మీ నారాయణ, అశ్వర్థప్ప, శ్రీరామ్ రెడ్డి, వేమ నారాయణ, డిష్ అంజి, మురళి, యూనిట్ ఇన్చార్జిలు వేణు, గంగాధర్, మూర్తి , మంజునాథ్, బూత్ కన్వీనర్లు కుమార్,మల్లికార్జున ,గోపి, నాగరాజు, చంద్రారెడ్డి, మైనారిటీ సెల్ అధ్యక్షులు గౌస్ బాషా, క్రిష్టప్ప, కుమార్, గంగాధర్, నారాయణస్వామి, శివప్ప, లక్ష్మీ నారాయణ,లక్ష్మీపతిరెడ్డి,శ్రీరామ,నరసప్ప, రమేష్, కదిరప్ప, అంజి, నరసింహ మూర్తి, ఆదిమూర్తి, రామచంద్ర, నాగరాజు, ముస్తఫా, సోహైల్, బాలరాజు, ఆంజ నేయులు, బాలాజీ, శ్రీనివాస్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# నూతన తహశీల్దార్ కార్యాలయం భావన పనుల పరిశీలన

కార్యాలయాల రికార్డుల తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ ఓ .ఆనంద్



ఉరవకొండ, ఆగస్ట్ 7 మనన్యూస్ : అనంతపురం జిల్లా కలెక్టర్ ఓ .ఆనంద్ శుక్రవారం ఉరవకొండ ప్రధాన కేంద్రంలో ఆకస్మికంగా పలు కార్యాల యాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తొలుత ఉరవకొండ మండల కేంద్రంలో పాత తాసిల్దార్ ఆఫీస్ నూతన భవన పనులను పరిశీలి ంచారు. అలాగే రెవెన్యూ రికార్డు రూమ్ ను తనిఖీ చేసి అసైన్డ్ ఫైల్స్ స్కెచ్ నమోదు భూసర్వే డైలాట్ తదితరధ్రువీకరణ పత్రాలనుజాగ్రత్తగా భద్రప రచాలని అలాగే మొబైల్‌యాప్ ద్వారా వివరాల నమోదు ప్రక్రియను పరిశీలి ంచి వాటన్నింటినినమోదు చేయాలనిఆదేశించారు. అనంతరం మండల తాసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించి పిజిఆర్ఎస్ ఫిర్యాదుల పరిష్కారం రెవెన్యూ అంశాలపై సంబంధిత అధికారుల ద్వారా జిల్లా కలెక్టర్ అడిగి తెలు సుకున్నారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయాన్ని సందర్శించి జనగణన (సెన్సెస్) క్షేత్రస్థాయి పని -నిర్దేశిత కాలక్రమం పై పంచాయతీ సెక్రటరీలు, వీఆర్వోలుడిజిటల్ అసిస్టెంట్లకు జరుగుతున్న శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్,తాసిల్దార్అరుణ ఎంపీడీవోబివి రవి ప్రసాద్ తో కలిసి పరిశీలించారు.

# డీయస్సీపై నేడు వైసీపీ నిరాహార దీక్ష



చిలమత్తూరు, ఆగస్ట్ 07, మనన్యూస్ : మెగా డీయస్సీని - దగా డీయస్సీగా మార్చిన కూటమి ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన నిరసనల్లో భాగంగా నేడు చిలమత్తూరులో మూడో రోజు రిలేనిరాహార దీక్ష చేపట్టనున్నట్లు వైసీపీ మండల కన్వీనర్‌రామక్రిష్ణారెడ్డిశుక్రవారంఒకప్రకటన లో తెలిపారు.ఈకార్యక్రమానికి హిందూపురంనియోజకవర్గ సమన్వయకర్త దీపి కావేణురెడ్డి హాజరుకానున్నట్లు చెప్పారు.మండలంలోని నిరుద్యోగులు, చాత్రో పాధ్యాయులు,విద్యార్థులు, వైసీపీశ్రేణులుపెద్దఎత్తున పాల్గొనాలని కోరారు.

# ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల్లో నైపుణ్యాల పెంపే లక్ష్యం...

- ధర్మవరంలో 'విద్యా వికాసం-విద్యా వాహిని' కార్యక్రమాల ప్రారంభం
- 30 పంచాయతీలు, 40 పాఠశాలల్లో అమలు: మంత్రి సత్యకుమార్ యాదవ్



ధర్మవరం, ఆగస్టు 7, మనన్యూస్ : ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల్లో అపా మైన ప్రతిభ దాగి ఉందని, వారికి సరైన మార్గ దర్శకత్వం, నైపుణ్య శిక్షణ, ఆత్మవిశ్వాసం కల్పిస్తే ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని రాష్ట్ర వైద్య, ఆరోగ్య,కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి, ధర్మవరం ఎమ్మెల్యే సత్యకుమార్ యాదవ్ అన్నారు. ధర్మవరం లోని శ్రీ గణేష్ మున్సిపల్ పాఠశాలలో సంస్కృతి సేవా సమితి సహకారంతో ఏకలవ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన 'విద్యా వికాసం-విద్యా వాహిని' కార్యక్రమాలను శుక్రవారం ఆయన ప్రార ంభించారు.విద్యార్థులతో ముచ్చటించిన మంత్రి, చదువుతో పాటు క్రమశిక్షణ, వ్యక్తిత్వ వికాసం, కమ్యూనికేషన్ నైపుణ్యాలు, నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలని సూచించారు. విద్యే శాశ్వత ఆస్తి అని, ప్రభుత్వ పాఠశాలల నుంచి కూడాఅత్యున్నత స్థానాలకు ఎదగవచ్చని చెప్పారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం నియోజక వర్గంలో వివిధ కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. పదో తరగతి చదువుతున్న 2,087 మంది విద్యార్థులకు రూ.98 లక్షల వ్యయంతో ఉచిత సైకిళ్లు పంపిణీ చేయడంతో పాటు పరీక్ష ఫీజులు చెల్లించినట్లు వెల్లడించారు. పాఠశాలల్లో మరుగుదొడ్లు, ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేసి మెరుగైన వసతులు కల్పిస్తున్నామని పేర్కొన్నారు. యువతకు ఉపాధి కల్పించేందుకు మెగా జాబ్ మేళాల నిర్వహణ, బ్యాంకింగ్ ఉద్యోగాలకు ఉచిత కోచింగ్, సివిల్ సర్వీసెస్ అభ్యర్థులకు ఉచిత





శిక్షణ, వసతి కల్పిస్తున్నామని తెలిపారు. ధర్మవరం నుంచి ఐఎఎస్, ఐపీఎస్ అధికారులు రావాలన్నదే లక్ష్యమన్నారు.సంస్కృతి సేవా సమితి, ఏకలవ్య ఫౌండేషన్‌సంయుక్తంగా 30 పంచాయతీల్లో 'విద్యా వికాసం' ద్వారా పాఠశాల అనంతరం ఉచిత విద్యా సహాయం, 40ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో 'విద్యా వాహిని' ద్వారా వ్యక్తిత్వ వికాసం, కెరీర్ గైడెన్స్, పోటీ పరీక్షల అవగాహన, సృజనాత్మక కార్యక్రమా లు నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమం లో సంస్కృతి సేవా సమితి కార్యదర్శి ఒంటేరు శ్రీనివాస్ రెడ్డి, ఏకలవ్య ఫౌండేషన్ ప్రతినిధులు ప్రశాంత్, బాలకృష్ణ, పాఠశాల ప్రధానోపాధ్యా యుడు సాపుద్దీన్, ప్రిన్సిపాల్ బిల్లే భాస్కరయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# నేతన్నల బాగు కోరుకునే ప్రభుత్వం మాది

- అర్హులైన నేతన్నలందరికీ నేతన్నల సేవలో
- హామీ ఇవ్వకున్నా ఏటా రూ.25 వేలు ఇస్తున్నాం
- చేనేతలు ఆర్థికంగా ఉన్నత స్థాయిలో ఉండాలన్నదే సీఎం చంద్రబాబు లక్ష్యం: మంత్రి సవిత



పెనుకొండ ఆగస్టు 7 మనం న్యూస్ : అర్హులైన ప్రతి ఒక్క నేతన్నకూ నేతన్నల సేవలో పథకంకింద ఏటా రూ. 25 వేలు అందజేయ నున్నామని రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్ సవిత స్పష్టం చేశారు. చేనేతలు ఆర్థికంగా ఉన్నత స్థాయిలో ఉండాలన్నదే సీఎం చంద్రబాబు లక్ష్య మన్నారు. ఎన్ని ఆర్థిక ఇబ్బందులున్నా, ఎన్నికల్లో హామీ ఇవ్వకున్నా నేతన్నల సేవలో పథకాన్ని అమలు చేస్తున్నారని తెలిపారు. శుక్రవారం చీరాలలోని కొత్తపేటలో సీఎం చంద్రబాబు నాయుడు ముఖ్య అతిథిగా 12 వ జాతీయ చేనేత దినోత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి సవిత పాల్గొని ప్రసంగిస్తూ... నేతన్నల బాగు కోరుకునే ప్రభుత్వం తమదన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు పాలన చేపట్టిన ప్రతిసారీ చేనేతలకు స్వర్ణయుగమేనన్నారు. ముఖ్యంగా 2014-19 మధ్య నేతన్నల సంక్షేమానికి ఎన్నో పథకాలు అమలు చేశారన్నారు. 50 ఏళ్లు నిండిన నేతన్నలకు పెన్షన్లు అందజేసిన ఘనత కూడా ఆయనదేనన్నారు. త్రిఫ్ట్ ఫండ్, ముద్రా రుణాలు అందజేశారన్నారు. ఒక్క ఛాన్స్ అంటూ అధికారం లోకి వచ్చిన జగన్ అసమర్థ పాలనలో చేనేతలు అన్ని విధాలా నష్టపోయారన్నారు. చేనేతల అభ్యు న్నతికి సీఎం చంద్రబాబు అమలు పథకాలను జగన్ నిలిపేశారన్నారు. 2024 ఎన్నికల్లో సీఎం చంద్రబాబు నాయుడు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో చేనేతలకు మంచిరోజులు ప్రారంభమయ్యాయన్నారు. ఎన్నిక ల్లో హామీ ఇవ్వకున్నా, మేనిఫెస్టో లో పేర్కొన్నక పోయినా చేనేతలకు ఏటా రూ.25 వేలు ఇవ్వాలని సీఎం చంద్రబాబు నిర్ణయించారన్నారు. 73 వేల చేనేతలకు రూ.180 కోట్లు చెల్లిస్తున్నామన్నారు. అర్హులైన నేతన్నలందరికీ నేతన్నల సేవలో పథకం కింద ఆర్థిక సాయం అందిస్తామని, ఎవరు



ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మంత్రి సవిత తెలిపారు. ఇటీవలే చీరాలలో చేనేతల జాతిపిత ప్రగడ కోటయ్య జయంతిని ఘనంగా నిర్వహించిన విషయాన్ని గుర్తు చేశారు. రూ.పది కోట్లతో అమరావతిలో ప్రగడ కోటయ్య స్మృతి వనంనిర్మిస్తున్నామని, ఈ స్మృతి వనం నిర్మాణంలో మంత్రి నారాలోకేష్ విశేషకృషి చేస్తున్నారని మంత్రి సవిత తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్చార్జి మంత్రి కొలుసు పార్థసారధి, మంత్రులు అనగాని సత్యప్రసాద్,గొట్టిపాటిరవికుమార్,ఎమ్మెల్యే మద్దు లూరి మాలకొండయ్య, ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్, ఎమ్మెల్సీబీటీనాయుడు,జిల్లాకలెక్టర్‌వినోద్ కుమార్, చేనేత, జౌళి శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఆర్పీ సిసోడియా, భారీ సంఖ్యలో చేనేతలు పాల్గొన్నారు.

# ఆగస్టు 10న జైల్‌భరో ఆందోళనను విజయవంతం చేయాలి

కార్మికులు, రైతులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలి: సీఐటీయూ, రైతు సంఘం



పెనుకొండ ఆగస్టు 7 మనన్యూస్ : కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఆగస్టు 10న నియోజకవర్గ, జిల్లా కేంద్రాల్లో నిర్వహించనున్న జైల్‌భరో, ఆందోళన కార్యక్రమాల్లో కార్మికులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని సీఐటీయూ, ఏపీ రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పిలుపునిచ్చారు.పెనుకొండ పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో శుక్రవారం ఆయా సంఘాల ఆధ్వర్యంలో ఆందోళనకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, అమెరికాతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పంటల ఉత్పత్తి ఖర్చులపై అదనంగా 50 శాతం కలిపి మద్దతు ధర నిర్ణయించాలని, కౌలు రైతులకు బ్యాంకు రుణాలు అందించాలని కోరారు.మహాత్మా గాంధీ జాతీయగ్రామీణ ఉపాధిహామీపథకాన్ని పునరుద్ధరిం చి, రోజువారీ కనీస వేతనం రూ.600కు పెంచాలని డిమాండ్ చేశారు. విద్యుత్, ఆర్టీసీ, మున్సిపాలిటీల్లో ప్రైవేటీకరణ విధానాలను నిలిపివేయాలని కోరారు.అలాగేశ్రీ సత్యసాయిజిల్లాలోని చిలమత్తూరు, పాలసముద్రం, పెను కొండ,కదిరి ప్రాంతాల్లో గుడిసెలు వేసుకొని తాత్కాలిక ఆవాసాల్లో నివసిస్తున్న అర్హులైన పేదలకుఇళ్ల పట్టాలు, ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులు,రైతులు,వ్యవసాయ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసంనిర్వహిస్తున్న ఈఆందోళనను క్విట్ఇండియా ఉద్యమస్ఫూర్తితో విజయ వంతం చేయాలని, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొని ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకు రావాలని నాయకులు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శిహరి,సీఐటీయూజిల్లాఉపాధ్యక్షుడునాగరాజు,సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడుబాబావలి,వ్యవసాయకార్మికసంఘంజిల్లా కమిటీసభ్యుడు వెంకట్రా ముడు, సీఐటీయూ నాయకులు నరసింహ, ఆనంద్, హబీబ్ పాల్గొన్నారు.

# మడకశిర కెనరా బ్యాంక్‌లో భారీ గోల్డ్ లోన్ మోసం కేసు ఛేదన

▪ ప్రధాన నిందితుడి అరెస్ట్ రూ.30 లక్షల నగదు స్వాధీనం ▪ కేసు వివరాలను వెల్లడించిన అడిషనల్ ఎస్పీ కేవీ మహేష్




**మడకశిర,ఆగస్టు 07,మనంన్యూస్:** మడకశిర పట్టణంలోని కెనరా బ్యాంకులో జరిగిన నకిలీ బంగారం కేసును ఛేదించినట్లు శ్రీ సత్యసాయి జిల్లా అడిషనల్ ఎస్పీ కెవి మహేష్ తెలిపారు. మడకశిర పట్టణంలోని పోలీస్ స్టేషన్ లో అడిషనల్ ఎస్పీతో పాటు స్థామిక రూరల్ సిఐ ఎ.రాజ్ కుమార్ తో కలిసి మీడియా సమావేశంలో వివరాలను వెల్లడించారు.సిఆర్.నెశీ: 91/2026 యూ/ఎస్ఐసి 318(4), 316(2), 336(2), 338, 340(2) ఆర్/డబ్ల్యు 3(5) బిఎన్ఎస్ అఫ్ మడకశిర యూపీఎస్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తును ముమ్మరంచేసి కేసును చెడించడం జరిగిందన్నారు.ముద్దాయి వివరాలు సుందరేష్ చారి, వయస్సు 33 సంవత్సరా లు, తండ్రి నాగ రాజ చారి, ఎస్.రాయపురం గ్రామం, గుడిబండ మండలం.మోసం చేసి ముద్దాయి పొందిన నగదు వివరాలు రూ 70,66,000/-నన్నారు.వాటిలో నగదురూ30,20,000/-నుస్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. అనంతపురంలోని కెనరా బ్యాంక్ రీజినల్ ఆఫీస్ నుంచి వచ్చిన రీ-అప్రైజర్ల బృందం నిర్వహించిన ఆకస్మిక తనిఖీలో,మడకశిర కెనర బ్యాంకులో గోల్డ్ అప్రైజర్‌గా విధులు నిర్వహించిన సుందరేష్ చారి మొత్తం 7 మంది వ్యక్తుల పేర్లపై ఉన్న 12 గోల్డ్ లోన్ ఖాతాల్లో తాకట్టు పెట్టిన సుమారు 872.8 గ్రాముల బంగారు ఆభరణాలు నకిలీవని నిర్ధారించారన్నారు. దీంతో సుందరేష్ చారి బ్యాంకును మోసం చేసి సుమారు 872.8 గ్రాముల నకిలీ బంగారాన్ని తాకట్టు పెట్టి రూ. 70,66,000 విలువైన గోల్డ్ లోన్లు మంజూరు చేయించినట్లు అధికారులు గుర్తించి బ్యాంకు అధికారులు మడకశిర పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన విషయం తెల్సిందేనన్నారు. మడకశిర పోలీసు వారు సిఆర్ నెశీ 91/2026గా కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారన్నారు.ఈ కేసును శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీ శ్రీ సతీష్ కుమార్ ఐపీఎస్ వారు సవాలుగా తీసుకుని, శ్రీ సత్య సాయి జిల్లా అడిషనల్ ఎస్పీ శ్రీమతి అంకిత సురాన ఐపీఎస్, పెనుకొండ సబ్‌డివిజన్ ఇన్‌చార్జి డీఎస్పీనారాయణస్వామి వారి పర్యవేక్షణలో సమగ్రంగా దర్యాప్తు చేయాలని మడకశిర సర్కిల్ ఇన్స్పెక్టర్ రాజ్‌కుమార్‌ను ఆదేశించారన్నారు. మడకశిర సర్కిల్ ఇన్స్పెక్టర్ రాజ్‌కుమార్ దర్యాప్తు చేసి, కెనరా బ్యాంక్ మడకశిర బ్రాంచ్‌లో గోల్డ్ అప్రైజర్‌గా విధులు నిర్వహించిన సుందరేష్ చారి చెడు వ్యాసనాలకు బానిసై, తనకు వచ్చే జీతం సరిపోక, తన అధికారిక హోదాను దుర్వినియోగం చేసి,బ్యాంకుకు వచ్చే ఖాతాదారులతో పరిచయాలు పెంచుకుని, వారికి మాయమాటలు చెప్పి, వారి పేర్లపై నకిలీ బంగారు ఆభరణాలను కుదువ పెట్టించి, వాటిని అసలైన బంగారంగా ధృవీకరించి 7 మంది వ్యక్తుల పేర్లపై 12 గోల్డ్ లోన్ ఖాతాల ద్వారా సుమారు 872.8 గ్రాముల నకిలీ బంగారు ఆభరణాలు కుదువపెట్టించా రన్నారు. బ్యాంకు నుండి రూ 70,66,000/- ఋణంగా పొంది, వాటితో బెంగుళూరు నందు గుర్రపు పందేలు ఆడుతూ, జల్సాలు చేసేవాడని తేలిందన్నారు. దీంతోపోలీసులుశుక్రవారం మడకశిర పట్టణం లోని మధుగిరి రోడ్డులో ఉన్న వైబి హళ్లి క్రాస్ వద్ద ప్రధాన నిందితుడు సుందరేష్ చారినిఅరెస్ట్‌చేసి, అతనివద్ద నుంచి రూ. 30,00,000/- నగదును స్వాధీనంచేసుకోవడం జరిగిందన్నారు. అనంతరం నిందితుడిని గౌరవ న్యాయస్థానం ముందు హాజరుపరుస్తామన్నారు. ఈ కేసులో ఇతర నిందితుల పాత్రపై ఇంకా దర్యాప్తు కొనసాగుతోం దన్నారు.ఈ సందర్భంగా శ్రీ సత్యసాయి జిల్లా పోలీసు శాఖ తరుపున ప్రజలకు విజ్ఞప్తి చేస్తూ, బంగారు రుణాలు తీసుకునే సమయంలో సంబ ంధిత బ్యాంకుల విధి విధానాలను తప్పనిసరిగా పాటించాలని సూచిస్తున్నామన్నారు. మోసపూరిత కార్యకలాపాలపై ఏవైనా అనుమానాలు తలెత్తితే వెంటనే సమీప పోలీస్ స్టేషన్ లేదా సంబంధిత బ్యాంకు అధికారులకు సమాచారం అందించాలని వారు కోరారు.అలాగే బ్యాంకు సిబ్బందికి తెలియజేయడం ఏమనగా బ్రాంచ్ అప్రైజర్ లను నియమించుకునేటప్పుడు వారి గురించి పూర్తిగా సమాచారంసేకరించినతర్వాతనే వారిని తీసుకోవా లని, వారి పైన నిఘా ఉంచాలన్నారు.. అలాగే అప్రైజర్లు చెప్పినదే నమ్మకుండా బ్యాంకు సిబ్బంది కూడావాటిపైన అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ సమావేశంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.




# మడకశిరలో రైతన్న మీకోసం

- ఎల్ నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితుల్లో అనుసరించాల్సిన సాగు యాజమాన్యంపై అవగాహన
- మండల వ్యవసాయ శాఖ అధికారి వడ్డే తిమ్మప్ప



**మడకశిర,ఆగస్టు 07,మనంన్యూస్:** మడకశిర మండలంలో రైతన్న మీకోసం కార్యక్రమంను చేపట్టినట్లు మండల వ్యవసాయ శాఖ అధికారి వడ్డే తిమ్మప్ప తెలిపారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూవేరుశనగ మరియు కంది పంటలలో వర్షాభావ పరిస్థితులను తట్టుకునేందుకు ఎకరానికి 1 కిలో పొటాషియం నైట్రేట్ లేదా 19:19:19 నీటిలో కలిపి పిచికారీ చేయడం వల్ల మొక్కలకు అవసరమైన పోషకాలు అందడంతో పాటు ఒత్తిడిని తట్టుకునే సామర్థ్యం పెరుగుతుందన్నారు. తక్కువ కాలం పంటలైన ఉలవలు, కొర్ర, సజ్జ, జొన్న, రాగులు పంటలను వేసుకోవాలని సూచించడం జరిగిందన్నారు. కంది పంటలో తల్లి సాలు (కన్సర్వేషన్ ఫురో ) తీయడం ద్వారా వర్షం కురుసినప్పుడు నీరు నిలబడి నేలలో తేమ ఎక్కువ కాలం నిల్వ ఉండి పంట ఎదుగుదలకు అనుకూలంగా ఉంటుందన్నారు.నీటి పొదుపు పద్ధతులు, వాతావరణానికి అనుగుణంగా పంటల నిర్వహణ, సమయానుకూలంగా వ్యవసాయ పనులు చేపట్టాలన్నారు. క్రాప్ ఇన్సూరెన్స్ నమోదును వేగవంతం చేయలన్నారు.బెట్ట పరిస్థితులు తట్టుకోవడానికి 200 లీట్ ద్రవజీవామృతం లేదా 2 లీట్ పంచగవ్యను 200 లీట్ నీటిలో కలిపి పిచికారి చేయలన్నారు. పీఎండియాస్, విత్తన గుళికల ద్వారా విత్తన వేయడం పై అవగాహన కల్పిం చినట్లు అయన తెలిపారు.డ్రిప్, స్ప్రింకలేరు వంటి ఆధునిక పద్ధతులు అవల ంభించడం ఉత్తమం అన్నారు.పంట యొక్క వాటర్ రిక్వైర్‌మెంట్ ఆధారంగా నీటి తడులు ఇవ్వడంపై కరెంటు, నీటిని ఆదా చేయడంపట్ల వివరించడం జరిగిందన్నారు.పీఎండియాస్ పద్ధతిద్వారాపశువులమేత సాగును ప్రోత్సహి ంచడం పట్ల రైతులకు అవగాహన కల్పచడం జరిగిందని ఎ ఓ తిమ్మప్ప తెలి పారు.ఈ కార్యక్రమంలో రైతు సేవా కేంద్రం సిబ్బంది,రైతులు పాల్గొన్నారు.



# బోధనలో ఎంజేపీలదే అగ్రస్థానం

- రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత
- బీసీల విద్యకు కూటమి ప్రభుత్వం ప్రాధాన్యం
- ఈ ఏడాది కొత్తగా పది ఎంజేపీ గురుకులాల ఏర్పాటు
- 6 బాలికల గురుకులాలను జూనియర్ కళాశాలలుగా అప్ గ్రేడ్
- గురుకుల విద్యార్థులకు క్రీడల్లోనూ ప్రోత్సాహం : మంత్రి సవిత
- వేటపాలెం ఎంజేపీలో మంత్రి సవిత ఆకస్మిక తనిఖీలు



**పెనుకొండ ఆగస్టు 7 మనం న్యూస్ :** రాష్ట్రంలో ఉన్న విద్యా సంస్థల్లో మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ గురుకుల పాఠశాలలే అగ్రస్థానంలో ఉన్నాయని, ఎంజేపీల్లో నాణ్యమైన విద్యను బోధిస్తున్నామని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ చేనేత మరియు జౌళి శాఖామాత్యులు ఎస్ సవిత తెలిపారు. కార్పొరేట్ విద్యా సంస్థల కంటే ఎంజేపీ గురుకుల విద్యాలయాల సీట్లకు అధిక డిమాండ్ఉందన్నారు.బీసీల విద్యకు ప్రాధాన్య మిస్తూ...ఈ ఏడాది కొత్తగా పది ఎంజేపీ గురుకు లాలను ఏర్పాటు చేశామన్నారు. ఆరు బాలికల గురుకులాలను జూనియర్ కళాశాలలు అప్ గ్రేడ్ చేశామన్నారు. వేటపాలెం మండలం కేంద్రంలో ఉన్న ఎంజేపీ బాలుర గురుకుల పాఠశాలను మంత్రి సవిత శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యతోనే బీసీలు అత్యున్నత స్థానాలు అధిరోహిం చగలరన్నారు.అందుకేబీసీలవిద్యకు సీఎం చంద్ర బాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో కూటమి ప్రభుత్వం కొత్తగా పది ఎంజేపీ గురుకులాలను ఏర్పాటు చేసిందన్నారు. వాటితో పాటు ఆరు బాలికల గురుకులాలను జూనియర్ కళాశాలలు అప్ గ్రేడ్ చేశామన్నారు. ఏపీలో ఉన్న అన్ని విద్యా సంస్థల కంటే బోధనలో ఎంజేపీ గురుకులాలు అగ్రస్థానంలో ఉన్నాయ న్నారు. కార్పొరేట్ విద్యా సంస్థల సీట్ల కంటే ఎంజేపీ సీట్లకే డిమాండ్ ఎక్కువగా ఉందన్నారు. ఎంజేపీ గురుకులాల్లో నాణ్యమైన విద్యతో పాటు పౌష్టికాహారం, వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేసి పరిశుద్ధమైన తాగు నీటినిఅందిస్తున్నామన్నారు. గురుకులాల్లో నిరం తరంవిద్యుత్ సరఫరా ఉండేలా ఇన్వర్టర్లు ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థులకు విద్యతో పాటు క్రీడ ల్లోనూ,ట్రాక్ సూట్లు,షూస్,స్పోర్ట్స్‌కిట్లు అందజేస్తు న్నా మన్నారు. విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించడానికి సన్నబియ్యంసరఫరా చేస్తున్నామ న్నారు. విద్యా మిత్ర కిట్లు అందజేయడం తో పాటు ఇంట్లో ఎందరు విద్యార్థులు ఉంటే అందరికీ తల్లికి వందనం నిధులు మంజూరు చేశామన్నారు. ప్రభుత్వమందిస్తున్న ప్రోత్సాహంతో బీసీ విద్యా ర్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. విద్యా ర్థులను కంటికి రెప్పలా చూసుకోవాలని వేట పాలెం ఎంజేపీ సిబ్బందిని మంత్రి సవిత ఆదేశిం చారు. మారుతున్న వాతావరణ పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని విద్యార్థులకు తాజా ఆహారం, కాచి చల్లార్చిన నీటిని మాత్రమే అందివ్వాలన్నారు. బయటఆహారంలోపలికిరానివ్వొద్దన్నారు. రాబోయే టెన్త్ పరీక్షలకు ఇప్పటినుంచే సన్నద్ధం కావాల న్నారు. అనంతరం విద్యార్థులతో మంత్రి సవిత మాట్లాడారు. బోధన, మెనూ అమలు గురించి అడిగి తెలుసుకున్నారు. అంతకుముందు మంత్రి సవిత... గురుకుల పాఠశాలలో తరగతి గదులను, విశ్రాంతి గదులను, మరుగుదొడ్లను, బాత్ రూమ్ లను పరిశీలించారు. వంట గదితో పాటు స్టాక్ రూమ్ ను, రికార్డును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వేటపాలెం ఎంజేపీ గురుకులఉపాధ్యాయులు,ఇతర సిబ్బంది ఉన్నారు.





# పార్టీ బలోపేతం, రైతు, కార్యకర్తల సమస్యలపై సమీక్ష సమావేశం

**కనేకల్ ఆగస్టు 7 మనంన్యూస్ :** మండలంలోని శ్రీ చిక్కనేశ్వర స్వామి దేవాలయ ప్రాంగణంలో భారతీయ జనతా పార్టీ మండల సమావేశం శు క్రవారం ఆ పార్టీ మండల అధ్యక్షుడు కురుబ తిప్పేస్వామి అధ్యక్షతన నిర్వహి ంచారు. సమావేశంలో పార్టీ సంస్థాగత బలోపేతం, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు అనుసరించాల్సినకార్యాచరణ, 'మన ఊరి -మన జెండా' కార్యక్ర మం విజయవంతం చేయడం, కార్యకర్తలు మరియు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై విస్తృతంగా చర్చించారు.ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ, ప్రతి బూత్ స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసి, స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా కార్యకర్తలు సమిష్టిగా పని చేయాలని పిలుపునిచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారానికి పార్టీ నిరంతరం కృషి చేస్తుం దని పేర్కొన్నారు.అలాగే ఈ సమావేశంలో మండల ఉపాధ్యక్షుడు కురువ నాగరాజు, మండల ఇన్‌చార్జి, మార్కెట్ యార్డు డైరెక్టర్ ఓ. తిమ్మారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులుసత్యనారాయణరెడ్డి, హీరోజీరావు,కిసాన్‌మోర్చాజిల్లా ఉపాధ్య క్షులు మల్లయ్య చౌదరి, విజయ్ కుమార్ పాల్గొన్నారు.ఓబీసీ మోర్చా జిల్లా కార్యదర్శి అలాగే బీఎల్ఏ-1 టోలి సభ్యురాలు గలగల నేత్రావతి బీఎల్ఏ-2 బాధ్యతలనుసైతంసమర్థవంతంగా నిర్వహించి పార్టీ కార్యక్రమాల విజయానికి విశేష కృషి చేసినందుకు ఆమెను శాలువాతో ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో నరేంద్ర, ఉమేష్, పార్టీ నాయకులు, కార్యకర్తలపాల్గొన్నారు.



# జిల్లా సెన్సస్ హ్యాండ్‌బుక్ కార్యక్రమాలను గడువులోగా పూర్తి చేయాలి

### జిల్లా రెవెన్యూ అధికారి, జిల్లా సెన్సస్ నోడల్ అధికారి మలోలా



**అనంతపురం, కలెక్టరేట్ ఆగస్టు 07 మనంన్యూస్ :** 2027 జనాభా గణనలో భాగంగా జిల్లా సెన్సస్ హ్యాండ్‌బుక్ (డిస్ట్రిక్ట్ సెంసస్ హ్యాండ్బుక్ – ( డిసిహెచ్ బి ) తయారీకి సంబంధించి నిర్వహిస్తున్న శిక్షణా కార్యక్రమాలను జిల్లా రెవెన్యూ అధికారి మరియు జిల్లా సెన్సస్ నోడల్ అధికారి మలోలా ఆకస్మికంగా తనిఖీ చేసి పరిశీలించారు. శుక్రవారంఅనంతపురంలోని ఆర్ట్స్ కళాశాల, బుక్కరాయసముద్రం మండల పరిషత్ కార్యాలయం, రాప్తాడు మండలం సచివాలయం–2లో జరుగుతున్న శిక్షణా కేంద్రాలను సందర్శించి శిక్షణనిర్వహణ, పాల్గొంటున్న ఫీల్డ్ ఫంక్షనరీలకు అందిస్తున్న మార్గదర్శకాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి మాట్లాడుతూ, మండల స్థాయిలో నియమించబడిన పంచాయతీ కార్యదర్శులు మరియు గ్రామ రెవెన్యూ అధికారులు జిల్లా సెన్సస్ హ్యాండ్‌బుక్ తయారీలో అత్యంత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ప్రతి రెవెన్యూ గ్రామం, పట్టణానికి సంబంధించిన సమాచారాన్ని డీసీహెచ్‌బీ ( డిసిహెచ్బి ) మొబైల్ యాప్‌లో కచ్చితత్వంతో నమోదు చేయాలని ఆదేశించారు. అలాగే, 17-08-2026 నుండి 15-09-2026 వరకు ఫీల్డ్ ఫంక్షనరీలుగా నియమించబడిన పంచాయతీ కార్యదర్శులు గ్రామ రెవెన్యూ అధికారులు తమ పరిధిలోని రెవెన్యూ గ్రామాలు, పట్టణాలకు సంబంధించిన జిల్లా సెన్సస్ హ్యాండ్‌బుక్ క్షేత్రస్థాయిసమాచార సేకరణనుచేపట్టనున్నట్లుతెలిపారు. జిల్లా కలెక్టర్, ప్రిన్సిపల్ సెన్సస్ అధికారి ఆదేశాల మేరకు జిల్లా సెన్సస్ హ్యాండ్‌బుక్ తయారీకి సంబంధించిన అన్ని కార్యక్రమాలను నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి సంబంధిత అధికారులను ఆదేశించారు.

# శిథిల పాఠశాలపై జిల్లా న్యాయ సేవా సమితి కార్యదర్శి పరిశీలన

### సమస్యల పరిష్కారానికి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని హామీ



**డి.హీరేహాళ్ ఆగస్టు 7మనంన్యూస్:** మండల పరిధిలోని సిద్ధాపురం తాండ ప్రాథమిక పాఠశాలను జిల్లా న్యాయ సేవా సమితి కార్యదర్శి ఎన్. రాజశేఖర్ శుక్రవారం సందర్శించారు. శిథిలావస్థకు చేరుకున్న పాఠశాల భవనం గురించిగ్రామస్తులుతెలియజేయడంతో ఆయన ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాల పరిస్థితిని పరిశీలించిన రాజశేఖర్, భవన సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి తగిన చర్యలు తీసుకునేలా కృషి చేస్తానని హామీఇచ్చారు. అనంతరంవిద్యార్థులుతమకు ఉన్నత విద్యను అభ్యసించేందుకు రవాణా సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని అర్జీ ద్వారా ఆయనకు వివరించారు. దీనిపై స్పందించిన రాజశేఖర్, పాఠశాల భవనం నిర్మాణంతో పాటు విద్యార్థులకు రవాణా సౌకర్యం కల్పించే అంశాన్ని కూడా సంబంధితఉన్నతాధికారుల దృష్టికితీసుకెళ్లి సమస్యపరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. గ్రామస్తులు, విద్యార్థులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.



# నేతన్నల సంక్షేమమే ఎన్డీఏ ప్రభుత్వ ధ్యేయం



నేతన్నలతో మమేకమైన తర్వాత వారి శ్రమ, నైపుణ్యం, త్యాగం తనకు పూర్తిగా అర్థమైందని చెప్పారు. చేనేత కార్మికుల సంక్షేమాన్ని అత్యున్నత ప్రాధాన్యంగా భావిస్తున్న ఎన్డీఏ ప్రభుత్వం, వారి జీవితాల్లో ఆర్థిక భరోసా కల్పించేందుకు నేతన్న సేవలో వంటి కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. చేనేత కుటుంబాల ఆదాయాన్ని పెంచడం, మగ్గాల నిర్వహణ, ముడిసరుకుల కొనుగోలు, ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించడం ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. అదేవిధంగా రూ.420 కోట్లతో చేనేత రంగంలో పనిచేస్తున్న అర్హులైన 50 సంవత్సరాలు పైబడిన 85 వేల మంది చేనేత కార్మికులకు ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ ద్వారా ప్రతి నెల 4000/– గౌరవప్రదమైన పెన్షన్ అందిస్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగానే శ్రీ సత్య సాయి జిల్లాలో 12712/– వేల మందికి పెన్షన్అందించడం జరుగుతుంది. చేతి మగ్గాలకు, పవర్‌లూమ్‌లకు విద్యుత్ రాయితీలు అందిస్తూ 150 కోట్లతో ఉచిత విద్యుత్, అందిస్తూ చేనేత రంగాన్ని ఆదుకుంటున్నామని చెప్పారు. 109 ప్రాథమిక చేనేత సహకార సంఘాలకు క్యాష్ క్రెడిట్ ద్వారా రూ.79 కోట్ల ఆర్థిక సహాయం అందిస్తూ... తాజాగా అర్హులైన ప్రతి చేనేత కార్మికుడికి 25 వేల చొప్పున 82,000 మందికి రూ.179 కోట్ల వ్యయంతో నేతన్న సేవ పథకాన్ని నేటినుంచి ప్రారంభించి అందించడం జరుగుతోంది. ధర్మవరం చేనేత రంగానికి మరింత ఊతమివ్వడానికి కేంద్ర ప్రభుత్వ సహకారంతో సుమారు రూ.40 కోట్ల వ్యయంతో మెగా హ్యాండ్లూమ్ క్లస్టర్ మంజూరైందని తెలిపారు. ఈ క్లస్టర్ ద్వారా డిజైన్ స్టూడియో, వర్క్ షెడ్లు, వాణిజ్య సముదాయం, విలువ ఆధారిత ఉత్పత్తుల కేంద్రం, డైయింగ్ యూనిట్, ఆధునిక మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయబడతాయని, వేలాది మంది నేత కార్మికులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. త్వరలోనే ధర్మవరానికి వీవర్ సర్వీస్ సెంటర్, సిల్క్ యార్న్ డిపో కూడా తీసుకురావడానికి చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. దీని ద్వారా నాణ్యమైన పట్టు నూలు స్థానికంగానే అందుబాటులోకి రావడంతో పాటు చేనేత ఉత్పత్తి వ్యయం తగ్గుతుందని తెలిపారు. ధర్మవరం పట్టు చీరకు అంతర్జాతీయ స్థాయిలో ప్రత్యేక బ్రాండ్ గుర్తింపు తీసుకురావడమే తన లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. ప్రస్తుతం ధర్మవరం పట్టు ఇతర ప్రాంతాల పేర్లతో విక్రయించబడుతున్న పరిస్థితిని మార్చి, ధర్మవరం సిల్క్ పేరును ప్రపంచవ్యాప్తంగా నిలబెట్టేందుకు మాస్టర్ వీవర్లు, డిజైనర్లు, చేనేత సంఘాలు, ప్రభుత్వ శాఖల సమన్వయంతో ప్రత్యేక కార్యాచరణ చేపట్టామని తెలిపారు. ఈ–కామర్స్, ఆధునిక మార్కెటింగ్, బ్రాండింగ్ ద్వారా ధర్మవరం పట్టు ప్రపంచ మార్కెట్లలో మరింత ఆదరణ పొందేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి రెండింటినీ సమానంగా ముందుకు తీసుకెళ్తున్న ఎన్డీఏ ప్రభుత్వం చేనేత కార్మికుల పట్ల చిత్తశుద్ధితో పనిచేస్తోందని మంత్రి అన్నారు. గత ప్రభుత్వ హయాంలో చేనేత రంగం నిర్లక్ష్యానికి గురైందని, ప్రస్తుతం చేనేత కుటుంబాల సంక్షేమం కోసం పింఛన్లు, ఉచిత విద్యుత్, నేతన్న సేవలో, మెగా క్లస్టర్లు, మౌలిక వసతులు వంటి అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. ధర్మవరం ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకోవడం తన బాధ్యత అని, చేనేత కార్మికుల అభివృద్ధికి, ధర్మవరం పట్టు ఖ్యాతిని ప్రపంచవ్యాప్తంగా విస్తరించేందుకు నిరంతరం కృషి చేస్తానని మంత్రి సత్యకుమార్ యాదవ్ స్పష్టం చేశారు. నేతన్న సేవ కార్యక్రమం అనంతరం.... సంస్కృతి సేవా సంస్థ సౌజన్యంతో, రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 28వ తేదీన ధర్మవరంలోని సీఎన్‌బీ కళ్యాణ మండపంలో నిర్వహించనున్న మెగా జాబ్ మేళాకు సంబంధించిన పోస్టర్లను మంత్రి ఆవిష్కరించి ఈ ధర్మవరం నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించే లక్ష్యంతో ఈ మెగా జాబ్ మేళాను నిర్వహిస్తున్నామని తెలిపారు. సంస్కృతి సేవా సంస్థ, రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ ఉద్యోగ మేళాను నియోజకవర్గంలోని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకొని తమ భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని మంత్రి సత్యకుమార్ యాదవ్ పిలుపునిచ్చారు. ధర్మవరం ఆర్డీవో రాంభూపాల్ రెడ్డి, ధర్మవరం మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్య, హ్యాండ్లూమ్ ఏడి రామకృష్ణ, ప్రాజెక్ట్ మేనేజర్ ఎస్ అప్పాజీ, డెవలప్మెంట్ పీవీ సుబ్బానాయుడు, ఏడీవోలు సేనసేన నాయక్, ఆర్ రాజేశ్వరి, వై రాజేశ్వరి, పవన్ కుమార్, చేనేతలు, హిందూపురం శాసనసభ్యులు ప్రతినిధి వీరయ్య, ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# ఉన్నత విద్యతోనే ఉన్నత శిఖరాలు

– సిద్ధాపురం తండాలో జాతీయ న్యాయ సేవా సమితి ఆధ్వర్యంలో న్యాయ అవగాహన సదస్సు

– చట్టాలపై అవగాహన ప్రతి పౌరుడికి అవసరం: జిల్లా న్యాయ సేవా సమితి కార్యదర్శి ఎన్. రాజశేఖర్




**డి.హీరేహాళ్ ఆగస్టు 7 మనంన్యూస్:** విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించి జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని జిల్లా న్యాయ సేవా సమితి కార్యదర్శి ఎన్. రాజశేఖర్ పిలుపునిచ్చారు. మండల పరిధిలోని సిద్ధాపురం తండా గ్రామంలో జాతీయ న్యాయ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన న్యాయ అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు, విద్యార్థులకు వివిధ చట్టాలపై అవగాహన కల్పించారు. న్యాయవాదులు మోటార్ వెహికల్ చట్టం, బాల్య వివాహాల నిషేధ చట్టం, భారత రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులు, పౌరుల బాధ్యతలు, ఉచిత న్యాయ సేవల ప్రాధాన్యంపై వివరించారు. అనంతరం ఎన్. రాజశేఖర్ మాట్లాడుతూ, విద్యతో పాటు చట్టాలపై అవగాహన కూడా ప్రతి ఒక్కరికీ అవసరమనిపేర్కొన్నారు. న్యాయపరమైన సమస్యలను కోర్టుల వరకు తీసుకెళ్లకుండా, సాధ్యమైనంత వరకు రాజీపూర్వకంగా సంబంధిత మండల అధికారుల సమక్షంలో పరిష్కరించుకునే దిశగా ప్రజలు కృషి చేయాలని సూచించారు. జాతీయ న్యాయ సేవా సంస్థ అందిస్తున్న ఉచిత న్యాయ సేవలనుఅర్హులైనవారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో దాసా నాయక్, తహసీల్దార్ సాకే శ్రీనివాసులు, డీఆర్ఓ దామోదర్, ఎస్ఐ గురు ప్రసాద్ రెడ్డి, సీనియర్ న్యాయవాదులు శ్రీనివాసులునాగమణి రాధా అధికారలోకదాలత్ అధికారిరాజశేఖర్ రెడ్డి, గ్రామ ప్రజలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



# సీనియర్ జర్నలిస్ట్ వెంకటేష్ దేశాయ్‌కు డా. బిది న్ చంద్ర రాయ్, పురస్కారం

### పేదల ఆరోగ్య సంరక్షణపై వివిధ కథనాలు





**బళ్ళారి, ఆగస్టు 07, మనం ప్రతినిధి :** సీనియర్ జర్నలిస్ట్, వెంకటేష్ దేశాయ్ కు 2026వ సంవత్సరం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఇండియన్ మెడికల్ అసోసియేషన్( ఐఎంఏ ) ఏటా అందించే, భారతరత్న, డా, బిదిన్ చంద్రరాయ్ పురస్కారం లభించింది. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ బళ్లారి శాఖ వారు ప్రతి ఏటా, వైద్యుల దినోత్సవం ( డాక్టర్స్ డే) సందర్భంగా సమాజానికి వివిధ రంగాల వారు అందించిన సేవలను గుర్తించి పురస్కరించడం ఆనవాయితీ. గ్రామీణ ప్రాంతాల పేద కుటుంబాల ఆరోగ్య సంరక్షణకు ప్రభుత్వాలు అందించే వివిధ పథకాలను ప్రత్యేక కథనాలుగా రూపొందించి పేద ప్రజల ఆరోగ్య సంరక్షణ కోసం అందించిన పాత్రికేయ రంగం విశేష సేవలను గుర్తించి వెంకటేష్ దేశానికి ఈ పురస్కారాన్ని అందిస్తున్నట్టు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ బళ్ళారి విభాగం అధ్యక్షుడు, డా.వి. జె. భరత్, సంఘం గౌరవ కార్యదర్శి డా పి హరీష్ తెలిపారు. ఈ పురస్కారాన్ని ఈనెల తొమ్మిదవ తేదీ ఆదివారం సాయంత్రం పార్వతీ నగర్ లోని బసవ భవన్ లో జరిగే కార్యక్రమంలో అందించడం జరుగుతుందని తెలిపారు. కొప్పల్ జిల్లా ఎల్బుర్గా తాలూకా వజ్రబండి గ్రామానికి చెందిన, సాధారణ రైతు కుటుంబంలో జన్మించిన వెంకటేష్ దేశాయ్, తన గ్రాడ్యుయేషన్ మరియు జర్నలిజం పూర్తి చేసిన తర్వాత పాత్రికేయ రంగంలో అడుగుపెట్టి ఆయా ప్రాంతాలలో నెలకొన్న సమస్యల పరిష్కారం గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి వాటికి సంబంధించిన అభివృద్ధి పథకాలు, పేద ప్రజల ఆరోగ్య సంరక్షణ కోసం ప్రభుత్వం అందించే ఆరోగ్య పథకాలను పేదలకు దరికి చేర్చడంతో పాటు సమాజంలో ఉత్తమ ఆరోగ్య సేవలు అన్ని వర్గాలకు అందేందుకు తనువంత కృషి చేసినట్టుగా పేర్కొన్నారు. ప్రముఖ కన్నడ పత్రికల అయిన విజయ కర్ణాటక, కన్నడమ్మా, లతోపాటు పలు మీడియా సంస్థలలో పనిచేశారు, అత్యుత్తమ ప్రతిష్టాత్మకమైన పురస్కారాన్ని అందుకున్న వెంకటేష్ దేశాయ్ ను జర్నలిస్టులు సీనియర్ జర్నలిస్టులు అభిమానులు స్నేహితులు అభినందనలతో ముంచెత్తారు.

## ప్రతి కుటుంబానికి సంక్షేమం.. రాష్టానికి అభివృద్ధి ఫలాలు



**నార్పల ఆగస్టు 7 మనం న్యూస్** : కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో రెండేళ్లు పూర్తయిన సందర్భంగా టిడిపి శ్రేణులు చేపట్టిన ఇంటింటికి టిడిపి..సంక్షేమ ఫలాలు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం రోజున యూనిట్ ఇంచార్జ్ బాబావలి తన పరిధిలో ఇంటింటికి టిడిపి కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో భాగంగా.. ఇంటింటికి కరపత్రాలను పంపిణీ చేస్తూ.. కూటమి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను వివరిస్తూ ముందుకు సాగారు. ప్రతి ఇంటికి కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందిస్తోందని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. రాష్ట్రం అభివృద్ధిలో ముందుకు సాగుతూ లక్షలాదిమంది నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనిట్ ఇన్చార్జ్ తోపాటు టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

## పుట్లూరులో ఏపీ జెన్ జి వార్ రిలే నిరాహార దీక్ష




**పుట్లూరు ఆగస్టు 7 మనంన్యూస్** : మండల కేంద్రంలో వైయస్సార్ సిపి కార్యాలయం వద్ద వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మహేశ్వర్ రెడ్డి అధ్యక్షతన డీఎస్సీ ప్రక్రియలు జరిగిన అక్రమాలపై నిరసన దీక్ష కార్యక్రమాన్ని శుక్రవారం రోజున వైఎస్సార్సీపీ శ్రేణులు నిర్వహించాయి. ఈ కార్యక్రమానికి సాకే శైలజనాథ్, ఆయన తనయుడు సాకే రుత్విక్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బండ్లపల్లి ప్రతాపరెడ్డి హాజరయ్యారు. సందర్భంగా డాక్టర్ రిత్విక్, మరియు మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూరాష్ట్రంలోని లక్షలాదిమంది విద్యార్థులు, నిరుద్యోగులభవిష్యత్తు కోసంవైఎస్సార్సీపీ రిలేనిరాహార దీక్ష కార్యక్రమాన్ని చేపట్టిందని తెలిపారు. నారా లోకేష్ తన మంత్రి పదవికి రాజీనామా సమర్పించే వరకు ఈ ఉద్యమం ఆగదని వారు హెచ్చరించారు. రాష్ట్రంలోని లక్షలాదిమంది నిరుద్యోగ యువత కుటుంబాలకు కన్నీళ్లు ప్రభుత్వానికి కనిపించడం లేదని, ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు విడుదల కాకపోవడంతో రాష్ట్రంలోని ఎంతోమంది పేద విద్యార్థులు కాలేజీ ఫీజులు కట్టలేక చదువులు మధ్యలో ఆపేసే పరిస్థితి వచ్చిందని, విద్యార్థుల తల్లిదండ్రులు వడ్డీలకు అప్పులు చేసి పిల్లలను చదివిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పెండింగ్ ఫీజు బకాయిల్ని ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో నాగేశ్వర్ రెడ్డి, మంజునాథ్ రెడ్డి, చామలూరు రాజగోపాల్, బీసీ నాగిరెడ్డి, గూడూరు శివారెడ్డి, రమణారెడ్డి, భాస్కర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు

## నేతన్నల ఆధ్వర్యంలో సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

**నల్లచెరువు ఆగస్ట్ 07 మనంన్యూస్**: రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన 'నేతన్న సేవలో' పథకం ద్వారా చేనేత కార్మికులకు ఆర్థిక సహాయం అందడంపై నేతన్నలు హర్షం వ్యక్తం చేశారు.చేనేత కార్మికుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఒక్కో చేనేత కార్మికుడి ఖాతాలో రూ.25 వేల నగదు జమ కావడంతో శుక్రవారం నల్లచెరువులో నేతన్నలు సంబరాలు నిర్వహించారు. చేనేత జిల్లా ఉపాధ్యక్షుడు జక్క లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. అనంతరం కేక్ కట్ చేసి నేతన్నలతో కలిసి ఆనందాన్ని పంచుకున్నారు.ఈ సందర్భంగా చేనేత కార్మికులు మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న 'నేతన్న సేవలో' పథకం తమకు ఎంతో ప్రయోజనకరంగా ఉందన్నారు. తమ ఖాతాల్లో రూ.25 వేల ఆర్థిక సహాయం జమ చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు.



# కన్నీళ్లు తెప్పించిన మానవత్వం...!



**ధర్మవరం ఆగస్టు 7 మనంన్యూస్** : ఈ మధ్యకాలంలో సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఓ వీడియో లక్షలాది మంది హృదయాలను కదిలిస్తోంది. ఆ వీడియో చూసిన ప్రతి ఒక్కరి నోట ఒకటే మాట... "బంధాలు, బంధుత్వాలు అంటే ఇదేనా? పుట్టిన బిడ్డలు ఇంత కఠినంగా మారతారా?" హర్యానాకు చెందిన గుప్తా--మీనా దంపతులు జీవనోపాధి కోసం ముంబైకి వెళ్లి వస్త్ర వ్యాపారం ప్రారంభించారు. ముగ్గురు కుమార్తెలను ఎంతో ప్రేమగా పెంచి, ఉన్నత విద్యలు చెప్పించి, మంచి కుటుంబాల్లో వివాహాలు చేశారు. ఒకరిని నేపాల్‌కు, మరొకరిని ఉత్తరప్రదేశ్‌కు, ఇంకొకరిని ముంబైలోనే వివాహం చేశారు. భార్యాభర్తల జీవితమంతా పిల్లల భవిష్యత్తు కోసమే గడిచిపోయింది. కాలం ఒక్కసారిగా కరుణించలేదు. జీవితాంతం తోడుగా ఉన్న భార్య కన్నుమూసింది. ఆ తర్వాత ఒంటరితనాన్ని భరించలేక గుప్తా స్వగ్రామానికి వెళ్లినా, అక్కడా ఆదరించే మనిషి లేక చివరకు పానిపట్ సమీపంలోని ఓ వృద్ధాశ్రమంలో ఆశ్రయం పొందారు. 78 ఏళ్ల వయసులో అనారోగ్యంతో ఆయన కన్నుమూశారు. ఆశ్రమ నిర్వాహకులు కుమార్తెలకు సమాచారం అందించగా... "మేము రాలేం... అంత్యక్రియలు మీరేచేయండి. ఎంత ఖర్చయితే చెబితే పంపిస్తాం" అనే సమాధానం వచ్చిందని నిర్వాహకులు చెబుతున్నారు. అంతటితో ఆగలేదు. "నాన్నను చివరిసారి చూడడానికి వీడియో కాల్ పెట్టండి" అని కోరారు. తండ్రి మృతదేహం పక్కన ఫోన్ ఉంచగానే... "నాన్న... నాన్న..." అని పిలిచారు. కానీ ఆ పిలుపులో ఆప్యాయత కంటే దూరం ఎక్కువగా కనిపించిందని అక్కడున్నవారు ఆవేదన వ్యక్తం చేశారు.అంత్యక్రియల కోసం రూ.5,001 ఫోన్‌పే చేసినట్లు చెబుతారు. చితి మండుతుండగానే "ఇంకెంతసేపు పడుతుంది... మాకు ఆకలేస్తోంది" అన్న మాటలు విన్న ఆశ్రమ సిబ్బంది దిగ్భ్రాంతికి గురయ్యారని సమాచారం. చివరికి అస్థికలను కూడా తీసుకెళ్లకుండా, "మీరు గంగలో కలిపేయండి... అయ్యే ఖర్చు కూడా పంపిస్తాం" అని చెప్పినట్లు తెలుస్తోంది.అయితే తన జీవితంతంలోగుప్తా చేసినపని మాత్రం అందరి హృదయాలను తాకింది. మరణించే ముందు తన రెండు కళ్లను దానం చేసి ఇద్దరి జీవితాల్లో వెలుగులు నింపారు. తన కళ్లతో ప్రపంచానికి వెలుగు ఇచ్చిన ఆ తండ్రి... తన సొంత పిల్లల కళ్లలో మాత్రం చివరి క్షణంలో కూడా చోటు సంపాదించ లేకపోవడం అత్యంత విషాదకరం.ఈ ఘటన నిజమైతే, అది ఒక కుటుంబం కథ మాత్రమే కాదు... మారుతున్న సమాజానికి అద్దం పట్టే ఘటన. తల్లిదండ్రులు పిల్లల కోసం జీవితాన్ని అంకితం చేస్తారు. కానీ చివరి రోజుల్లో వారికి కావాల్సింది సంపద కాదు... ఒక ఆప్యాయమైన పలకరింపు, ఓ చేయి, ఓ కన్నీటి చుక్క.తల్లిదండ్రులు మనకు జన్మనిస్తారు... పెంచుతారు... జీవితాన్ని తీర్చిదిద్దుతారు. వారి చివరి ప్రయాణంలో తోడుగా నిలవడం బాధ్యత మాత్రమే కాదు, మనిషిగా మన కర్తవ్యం కూడా. సమాజం ఎక్కడికి పోతుంది..? బంధాలు బతికున్నాయా... బంధుత్వాలు మిగిలాయా...?తండ్రి చితి ముందు... వీడియో కాల్‌లో వీడ్కోలు! జీవితమంతా పిల్లల కోసం... చివరికి ఒంటరి ప్రయాణం కళ్లను దానం చేసిన తండ్రి... కన్నీరు ఇవ్వని పిల్లలు ఇదేనా ఆధునిక బంధం...?మనిషి బతికేది ప్రేమ కోసం...

- కన్న తండ్రి చితి ముందు... వీడియో కాల్‌లో చివరి చూపు
- కళ్లను దానం చేసి వెళ్లిన తండ్రి...
- చితిపై కాలింది శరీరం కాదు... బంధాల విలువ..
- మానవత్వం మసకబారిన వేళ... కళ్లను తడిపిన కథ
- ప్రతి కొడుకు, ప్రతి కూతురు చదవాల్సిన కథ



చనిపోయింది మానవత్వమా?ఆస్తి కోసం కాదు... ఆప్యాయత కోసం ఎదురుచూసిన తండ్రి పేగు బంధం కన్నా... డబ్బే గొప్పదైపోయిందా? చివరి చూపుకూ వీడియో కాల్... కాలం మార్చిన బంధాలు మానవత్వం ఎక్కడ...? మనసులు ఎందుకు రాళ్లయ్యాయి...?తల్లిదండ్రుల త్యాగాలకు ఇదేనా ప్రతిఫలం? ఒంటరి తండ్రి... ఓ సమాజానికి మిగిల్చిన ప్రశ్న చివరి ప్రయాణంలో తోడు కాలేని బంధాలు మరణానంతరం కళ్లతో వెలుగు... జీవితంలో ప్రేమకు చీకటి ప్రేమతో పెంచిన తండ్రికి...వీడియో కాల్‌లో వీడ్కోలు బంధుత్వాలకు బదులు బ్యాంక్ ట్రాన్స్ఫర్...! నేటి భావి భారత పౌరులు వీటిని చూసేనా మానవత్వం చెల్లించాలి.

## పరిటాల డిగ్రీ కళాశాలలో పిడియస్‌యు నూతన కమిటీ ఏర్పాటు

– విద్యార్థుల సమస్యల పరిష్కారానికి పెద్ద ఎత్తున పోరాటాలు: హర్షకుమార్



**పెనుకొండ ఆగస్టు 7 మనం న్యూస్** : పట్టణంలోని పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం పిడియస్ యు నూతన విద్యార్థి సంఘం కమిటీని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశానికి పిడియస్ యు జిల్లా ఉపాధ్యక్షులు హర్షకుమార్ ముఖ్య అతిథిగాహాజరయ్యారు.ఈ సందర్భంగా హర్షకుమార్ మాట్లాడుతూ.. పరిటాల డిగ్రీ కళాశాలకు 20 మందితో నూతన కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కమిటీ అధ్యక్ష, కార్యదర్శులుగా జగదీష్, అరవిందలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు.విద్యార్థుల సమస్యల పరిష్కారానికి పిడియస్ యు ఆధ్వర్యంలో రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహిస్తామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలనిడిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరారు.అదేవిధంగా ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల్లో జరుగుతున్న విద్యా దోపిడీకి వ్యతిరేకంగా విద్యార్థులను సమీకరించి పోరాటాలు చేపడతామని హర్షకుమార్ స్పష్టం చేశారు. విద్యార్థుల హక్కుల సాధన కోసం పిడియస్‌యునిరంతరం పోరాడుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో పిడియస్ యు జిల్లా కమిటీ సభ్యులు నజీర్, అభిషేక్, బాబావలి, నాగేంద్రతో పాటు కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం

– ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్



**కదిరి రూరల్ డిసెంబర్ 7 మనంన్యూస్:** శ్రీ సత్యసాయి జిల్లా కదిరి పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఒక నెల ఒక నియోజకవర్గం నాలుగు సందర్శనలు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కదిరి నియోజవర్గంలో ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ఆధ్వర్యంలో ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగాకదిరి నియోజకవర్గ శాసన సభ్యులు కందికుంట వెంకటప్రసాద్ పాల్గొని ప్రజల నుంచి వినతులను స్వీకరించారు.ఈ కార్యక్రమంలో శ్రీ సత్యసాయి జిల్లా జాయింట్ కలెక్టర్ అభిషేక్ మౌర్య భరద్వాజ్ , ఆర్డీవో కళావతి , నియోజకవర్గంలోని వివిధ శాఖల అధికారులు,జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు. ప్రజా దర్బార్‌కు అధిక సంఖ్యలో హాజరైన ప్రజలు తమ సమస్యలు, వినతులను ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ కు, అధికారులకు అందజేశారు. ప్రతి వినతిని సానుకూలంగా పరిశీలించి, అర్హత మేరకు త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ఆదేశించారు. ప్రజలకు పారదర్శకమైన, జవాబుదారీతనంతో కూడిన పాలన అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ ప్రజా దర్బార్ కార్యక్రమాలను నిర్వహిస్తోందని, ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలోనే పరిష్కరించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో కదిరి తాసిల్దార్ రెడ్డి శేఖర్ వివిధ శాఖల అధికారులు, నియోజకవర్గంలోని ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు



# పుట్టిన బిడ్డకు ముర్రు పాలు అమృతం

పెనుగొండ సిడిపిఓ ధనలక్ష్మి




**నార్పల ఆగస్టు 7 మనంన్యూస్ :** మండల కేంద్రంలోని ఉయ్యాలకుంట అంగన్వాడీ కేంద్రం 3 నందు శుక్రవారం రోజున తల్లిపాల వారోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పెనుగొండ ఐసిడిఎస్ ప్రాజెక్టు సిడిపిఓ ధనలక్ష్మి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె చిన్నారుల తల్లులకు, గర్భవతులకు తల్లిపాల వారోత్సవాల సందర్భంగా విలువైన సలహాలను సూచనలను వివరించారు. చిన్నారుల తల్లులు అంగన్వాడీ కేంద్రం సేవలను సద్వినియోగం చేసుకోవాలని, చిన్నారులు ఆరోగ్యంగా ఎదగడానికి అంగన్వాడి కేంద్రం సేవలు దోహదం చేస్తాయని వివరించారు. చిన్నారులు శారీరక మానసిక ఎదుగుదలకు చిన్నారుల తల్లులు ప్రాధాన్యం ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమానికి సూపర్వైజర్ నారాయణమ్మ, అంగన్వాడీ కార్యకర్త భారతి చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.




# మెగా డీఎస్సీ పేరుతో నిరుద్యోగులను మోసం చేశారంటూ వైసీపీ రిలే దీక్షలు



**హిందూపురం ఆగస్టు 7 మనంన్యూస్:** మెగాడీఎస్సీ పేరుతో నిరుద్యోగులకు అన్యాయం జరిగిందని ఆరోపిస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న మూడు రోజుల రిలే నిరాహార దీక్షలలో భాగంగా హిందూపురంలో దీక్షలు కొనసాగుతున్నాయి. ఈ కార్యక్రమంలో భాగంగా హిందూపురం పట్టణంలోని సద్భావన సర్కిల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ టీ.ఎన్. దీపికా వేణురెడ్డి ఆధ్వర్యంలో రెండో రోజు రిలేనిరాహారదీక్షనునిర్వహించారు. ఈ సందర్భంగా వైసీపీ నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మెగా డీఎస్సీ నిర్వహిస్తామని ప్రకటించి నిరుద్యోగ యువతలో ఆశలు కల్పించిందని, అయితే ఆ హామీకి అనుగుణంగా ఉద్యోగాల భర్తీ జరగలేదని విమర్శించారు. డీఎస్సీ కోసం ఏళ్లుగా ఎదురుచూస్తున్న నిరుద్యోగ ఉపాధ్యాయ అభ్యర్థులకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను గుర్తించి పారదర్శకంగా భర్తీ చేయడంతో పాటు, నిరుద్యోగ యువతకు స్పష్టమైన నోటిఫికేషన్లు, ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు. మూడు రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా కొనసాగనున్నఈకార్యక్రమం ద్వారాప్రభుత్వంపైఒత్తిడి తీసుకువచ్చి నిరుద్యోగులకు న్యాయంజరిగేలా పోరాటాన్ని కొనసాగిస్తామని వైసీపీనాయకులు తెలిపారు. 2వ రోజు రిలే నిరాహార దీక్షలకు హిందూపురం న్యాయవాదులు తమ సంఘీభావాన్ని తెలియజేసారు. రెండో రోజు నిర్వహించిన రిలే దీక్షల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, పార్టీ కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా దీక్షా ప్రాంగణంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు నిరుద్యోగుల సమస్యలకు మద్దతుగా నినాదాలు చేశారు.







# ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమంలో ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్



**కదిరి రూరల్ ఆగస్టు 7 మనంన్యూస్ :** కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా కదిరి మున్సిపల్ పరిధిలోని 6వ వార్డు అమీన్ నగర్లో శుక్రవారం ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ఇంటి ఇంటికి తెలుగుదేశం డోర్ టు డోర్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరించి, కూటమి ప్రభుత్వం గత రెండేళ్లలో అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజా సంక్షేమ పథకాలను ప్రతి కుటుంబానికి చేరవేయాలనే లక్ష్యంతో కరపత్రాలను పంపిణీ చేసి అవగాహన కల్పించారు. ఈ పర్యటనలో భాగంగా స్థానికులు ప్రస్తావించిన తాగునీరు,పారిశుద్ధ్యంవీధులు, మౌలిక వసతులకు సంబంధించిన పలు సమస్యలను ఎమ్మెల్యే స్వయంగాపరిశీలించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ అజయ్కుమార్ కు సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు నాయకత్వంలోకూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమాన్ని సమన్వయం చేస్తూ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన సాగిస్తోందన్నారు. రాష్ట్రానికి పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు తీసుకురావడంతో పాటు ప్రతిగ్రామం, ప్రతివార్డు అభివృద్ధే ప్రభుత్వలక్ష్యమని పేర్కొన్నారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యలను వెంటనే పరిష్కరించేదిశగా తాము నిరంతరం పనిచేస్తామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణఅధ్యక్షుడుడైమండ్ ఇర్ఫాన్6వవార్డు ఇన్చార్జి చైతన్య,మహబూబ్,శేషు,చల్లాశ్రీనివాసులు, పిచ్చిలి శంకర్, ఖాసిం వలి, విశ్వనాథ్, ప్రవీణ్, రత్నమ్మ, గంగారత్నమ్మ,ఉమాదేవి,పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



# కళ్యాణదుర్గం ప్రజలకు సేవ చేసే భాగ్యం కల్పించిన మా ముఖ్యమంత్రికి ఋణపడి ఉంటా..

▪ ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ▪ వైసీపీ మంత్రి ఉషా శ్రీ ఇక్కడి రైతులను పట్టించుకోలేదు ▪ గ్రామీణ విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే



**కళ్యాణదుర్గం ఆగస్టు 7 మనం న్యూస్ :** విద్యార్థుల భవిష్యత్తుకు తోడుగా ఉండి విద్యకు ప్రాధాన్యత కల్పించి వారికి మరింత ప్రోత్సాహం అందించడం కోసం సరైన రవాణా సౌకర్యం లేక పాఠశాలలకు నడుచుకుంటూ వెళ్తున్న గ్రామీణ ప్రాంతాల 9,10 తరగతి, ఇంటర్ విద్యార్థులకు కానుకగా సైకిళ్లు అందిస్తున్నామని గత వైసీపీ ప్రభుత్వంలో జగన్మోహన్ రెడ్డి మధ్యాహ్న భోజనం పేరును కూడా జగన్ పేరుపెట్టుకుని, చివరికి గుడ్డు, గరిట, జగ్గుపై బొమ్మలు వేయించుకోవడమే కాకుండా పిల్లలకు ఇచ్చే బ్యాగు, పుస్తకాలు, బెల్టు, టై పై కూడా బొమ్మలు వేసుకుని రాజకీయం చేసాడని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు పేర్కొన్నారు శుక్రవారం గ్రామీణ విద్యార్థులకు ప్రోత్సాహక కానుకగా ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు అందిస్తున్న సైకిళ్ల పంపిణీని కళ్యాణదుర్గం మండలం తూర్పు కోడిపల్లి గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించగా టీడీపీ మండల, స్థానిక నాయకులు ఎమ్ ఈ ఓలు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందంతో కలసి పాల్గొని సైకిళ్లు విద్యార్థులకు వారి తల్లిదండ్రుల సమక్షంలో అందజేశారు..ఈ సందర్భంగా ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు మాట్లాడుతూ విద్యార్థుల బంగారు భవిష్యత్తును అత్యుత్తమంగా తీర్చిదిద్దడం కోసం కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని అందులో భాగంగానే కార్పొరేట్ స్థాయిలో మౌలిక వసతులు కల్పించి అదే తరహాలో స్కూల్ యూనిఫామ్ దగ్గర నుంచి షూస్, బెల్ట్, బ్యాగ్, పుస్తకాలు అందించి, నాణ్యమైన సన్నబియ్యంతో మధ్యాహ్న భోజనం అందిస్తూ పాఠశాలలను బలోపేతం చేస్తున్నారని, రాష్ట్రానికి భోగాపురం ఒక వైభవని నేడు దేశ ప్రధాని నరేంద్ర మోడీ గారి చేతుల మీదుగా ప్రారంభం అవడం మన రాష్ట్రానికి గర్వకారణమని, అందరికి అమ్మవడి అని చెప్పి తీరా అందించే సమయానికి ఒక్క ఇంట్లో ఒక్కరికే ఇచ్చి వారి చదువులను తుంగలో తొక్కారన్నారు. కేవలం అమ్మవడి పథకం ద్వారా కేవలం 5500 కోట్లు అందించారని,కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు తల్లిదండ్రుల బాధలు తెలుసుకుని అధికారంలోకి వచ్చిన వెంటనే ఇంట్లో ఒకటో తరగతి నుంచి ఇంటర్ చదివే విద్యార్థులు ఎంతమంది ఉంటే అందరికి తల్లికివందనం అందిస్తామని హామీ ఇచ్చి నేడు 10,190 కోట్లు కేటాయించి ప్రతి తల్లి ఖాతాకు జమ చేసి నిబద్ధత చాటుకున్నారని అందులో కూడా చాలీ చాలని జీతాలతో ఇబ్బందులుపడుతున్న30,000 మంది అంగన్వాడీ ఉపాధ్యాయులకు అందించి కూటమి ప్రభుత్వం గొప్ప మనసు చాటుకుందని తెలిపారు..అంతే కాకు ఒడా గతంలో విద్యావ్యవస్థను నిర్లక్ష్యం చేసి ఉపాధ్యాయులను బ్రాంది షాపుల వద్ద ఉంచారని అన్నారు..ఎన్నికల ముందు గ్రామాలకు వెళ్లిన సందర్భంలో చాలా చోట్ల విద్యార్థులు పుస్తకాల బ్యాగులు మోసుకుని నడుచుకుంటూ రావడం చుసి బాధ కలిగి అనాడే అనుకున్నా విద్యార్థులకు ఏదో ఒక రాకంగా వారి ఇబ్బందులు తొలగించాలని నిర్ణయించుకున్నానని నేడు వారికి సైకిళ్లు అందించడంచాలా సంతోషంగా ఉందన్నారు..ప్రతి విద్యార్థి భవిష్యత్తు కోసం తల్లిదండ్రులు బాధ్యత తీసుకోవాలని, వారికి అనవసరపు పనులకు కేటాయించకుండా చదువుకునేందుకు ఎక్కువ సమయం కేటాయించి వారి బంగారు భవిష్యత్తుకు బాసటగా నిలవాలన్నారు. మోడీ సహకారంతో ముఖ్యమంత్రిచంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ దేశ విదేశాలు తిరిగి లక్షల కోట్ల పెట్టుబడులు తీసుకువచ్చి రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్నారని, మన ప్రాంతంలో ఎంతో మంది ఉన్నత చదువులు చదివి ఉద్యోగాల కోసం ఇతర ప్రాంతాల వెళుతున్నారని, తిమ్మసముద్రం ప్రాంతంలో ఇప్పటికే ఉన్న 1200 ఎకరాలను మరో3000 ఎకరాలు భూమి తీసుకుని రాష్ట్రంలోనేరెండో అతిపెద్ద ఇండస్ట్రీయల్ కారిడార్ ఏర్పాటుచేయబోతున్నారనితద్వారాఉద్యోగ, ఉపాధి అవకాశాలు వస్తాయని అంతే కాకుండా ఈ ప్రాంతంలో భూములు ధరలు పెరుగుతాయన్నారు.



# కళ్యాణదుర్గంలో డీఎస్సీ అక్రమాలపై వైసిపి ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్ష

▪ భారీగా పాల్గొన్న విద్యార్థులు యువకులు నిరుద్యోగులు ▪ డీఎస్సీలో అక్రమాలకు నైతిక బాధ్యత వహించి మంత్రి లోకేష్ ▪ వెంటనే రాజీనామా చేయాలి



**కళ్యాణదుర్గం ఆగస్టు 7 మనం న్యూస్ :** నియోజకవర్గం తహసిల్దార్ కార్యాలయం ఎదురుగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో డీఎస్సీ లో అక్రమాలపై రిలే నిరాహార దీక్ష కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి భారీగా పాల్గొన్న విద్యార్థి యువకులు. సీఎం చంద్ర బాబు ఎన్నికల ముందు మెగా డీఎస్సీ ఇస్తానని నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఇస్తానని... 20 లక్షల ఉద్యోగాలు ఇస్తానని చెప్పి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత డీఎస్సీ ఉపాధ్యాయుల పోస్టులు తూతూ మంత్రంగావదిలిఅందులోఉపాధ్యాయులను కూడా అక్రమంగా నియమించారని... అర్హత కలిగిన డీఎస్సీ అభ్యర్థులకు ఉద్యోగం రాలేదని.... డీఎస్సీ లో భారీ అక్రమాలు జరిగాయి. ఇక నిరుద్యోగ భృతి అసలే లేదు 20 లక్షలు ఉద్యోగాలలో కనీసం ఒక ఉద్యోగం కూడా ఇవ్వకుండా కాలక్షేపం చేస్తున్న కూటమి ప్రభుత్వం... డీఎస్సీలో అక్రమాలకు నేతిగా బాధ్యత వహించి మంత్రి లోకేష్ గారు వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ నేడు కళ్యాణదుర్గం లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ విద్యార్థి యువకుల విభాగ ఆధ్వర్యంలోభారీ రిలే నిరాహార దీక్ష కార్యక్రమం చేపట్టడం జరిగింది... ఈ కార్యక్రమానికి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోయ తిప్పేస్వామి గారు విద్యార్థులు యువకులు భారీగా మద్దతు తెలిపారు... ఈ కార్యక్రమానికి కళ్యాణ్ దుర్గం మున్సిపాలిటీ మరియు బ్రహ్మసముద్రం మండలం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు విద్యార్థి విభాగం యువజన విభాగం వైసీపీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయడం జరిగింది.



# తారు రోడ్డు త్వరలోనే పూర్తి చేసి ప్రజల రవాణా వ్యవస్థ మెరుగు పరుస్తా..



**-ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు**
**- ఇంటింటికి టీడీపీ కార్యక్రమంలో ముద్దినాయనపల్లి గ్రామంలో స్వయంగా సమస్యలు అడిగి తెలుసుకున్న ఎమ్మెల్యే**



**కళ్యాణదుర్గం ఆగస్టు 7 మనం న్యూస్ :** వైసీపీ ప్రభుత్వంలో ఉన్న రహదారులకు అక్కడక్కడ పడిన చిన్నపాటి గుంతలు కూడా పుడ్చకుండా అరకొరగా ఉన్న రోడ్లు కూడా పూర్తిగా దెబ్బతిన్నాయి..నేడు రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఇబ్బందిగా ఉన్నా ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ తో కలసి మా ప్రాంతం చాలా వెనుకబడింది గ్రామీణ రహదారులు లేక రవాణా సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారని చెప్పగ తప్పకుండా మంజూరు చేస్తాను, మొదటి ప్రాధాన్యత మీ నియోజకవర్గానికే ఇస్తానని చెప్పాడని తప్పకుండా త్వరలోనే చాలా వరకు రోడ్లు మంజూరవుతాయని ఈ గ్రామంలో కూడా సీసీ రహదారులు నిర్మించి మౌళిక వసతులు కల్పించి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూస్తానని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు పేర్కొన్నారు. శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇంటింటికి టీడీపీ కార్యక్రమంలో భాగంగా కళ్యాణదుర్గం మండలం ముద్దినాయనపల్లి గ్రామంలో టీడీపీ సీనియర్ నాయకులు, మండల గ్రామ స్థాయి నాయకులతో కలసి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు పాల్గొని ప్రతి ఇంటికి వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమం, అభివృద్ధి వివరిస్తూ వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గ్రామానికి చేరుకున్న ఎమ్మెల్యే సురేంద్రబాబుకి గ్రామస్థులు, నాయకులు పూలవర్షం కురిపించి ఘన స్వాగతం పలుకగా గ్రామంలోని మహర్షి వాల్మీకి విగ్రహానికి పూలమాల వేయడం జరిగింది..ఈ సందర్భంగా ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్య పాలన, కనీసం గ్రామాల్లో సరైన మౌళిక వసతుల కల్పనపై కూడా ద్రుష్టి పెట్టకుండా సమస్యలను పెంచి వెళ్లారని ఇప్పుడు వాటిని అదిగమించి గ్రామీణ రహదారులతో పాటు గ్రామాల్లో మౌళిక వసతులైన విద్యుత్, తాగునీరు, సీసీ రహదారులు నిర్మించి ప్రజల సమస్యలు లేకుండా చూస్తామని తెలిపారు. గ్రామంలో తాగునీటి ఇబ్బందులు తొలగిస్తామని, గ్రామంలో మౌళిక సదుపాయలు కల్పిస్తామని తెలిపారు.

## పూర్వ విద్యార్థుల సేవాభావం..

**పాఠశాలకు 10 మంది స్వాతంత్ర్య సమరయోధుల చిత్రాలు అందజేత**



**హిందూపురం రూరల్ మనంన్యూస్ ఆగస్టు 7:** హిందూపురం మండలం కొల్లకుంట గ్రామంలోని మండల ప్రాథమిక పాఠశాలకు పూర్వ విద్యార్థులు అనిల్ కుమార్, కుమ్మర సురేష్ తమ వంతు సేవగా 10 మంది స్వాతంత్ర్య సమర యోధుల చిత్రాలను అందజేశారు. తాము విద్యనభ్యసించిన పాఠశాలకు పూర్వ విద్యార్థులు స్వాతంత్ర్య సమరయోధుల చిత్రాలను అందించడం పట్ల పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన మహనీయుల త్యాగాలను విద్యార్థులకు పరి చయం చేయడంతో పాటు, వారిలో దేశభక్తి భావాలను పెంపొందించేందుకు ఈ చిత్రాలు ఎంతగానో ఉప యోగపడతాయని పలువురు పేర్కొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల విద్యాశాఖాధికారి ఎం. గంగప్ప పాల్గొని పూర్వ విద్యార్థులను అభినందించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె. భాస్కర్ ఆధ్వర్యంలో కార్య క్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ రత్నమ్మ, వైస్ చైర్మన్ రాజేశ్వరి, నాగరాజు, భారతి, వెంకటేశప్ప పాల్గొన్నారు.

## పాఠశాల ఆటోలు, బస్సులపై ప్రత్యేక తనిఖీలు



**గుత్తి, ఆగస్టు 7 మనంన్యూస్ :** విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకుని పట్టణంలో పాఠశాల ఆటోలు, బస్సులపై పోలీసులు ప్రత్యేక వాహన తనిఖీలు నిర్వహించారు. అనంతపురం జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు, గుంతకల్ సబ్‌డివిజన్ డీఎస్పీ ఉత్తర్వులతో గుత్తి సీఐ రామారావు, ఎస్సై కె. సురేష్ ఆధ్వర్యంలో ఎస్సై అమీర్ ఖాన్, పోలీసు సిబ్బంది ఈ తనిఖీలు చేపట్టారు.ఈ సందర్భంగా పాఠశాల వాహనాలకు సంబంధించిన ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు, పర్మిట్లు, ఇన్సూరెన్స్ తదితర ధ్రువపత్రాలను పోలీసులు తనిఖీ చేశారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వాహనాలపై నిబంధనల ప్రకారం జరిమానాలు విధించారు.అదేవిధంగా పాఠశాల ఆటోలు, బస్సుల డ్రైవర్లకు డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతున్నట్లు గుర్తించిన డ్రైవర్లపై నిబంధనల ప్రకారం కేసులు నమోదు చేసి జరిమానాలు విధించారు. విద్యార్థుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, వాహన డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని ఎస్సై డ్రైవర్లకు సూచించారు.

# అగ్గిపెట్టెలో ఇమిడే అద్భుతం.. ప్రపంచాన్ని అలరించే భారతీయ చేనేత కళ





**- నూలు పోగుల్లో భారతీయ సంస్కృతి.. మగ్గం చప్పుడులో వేల కుటుంబాల జీవనగీతం**
**- శ్రీ వెంకటేశ్వరుడి రూపం నుంచి శ్రీరామ పట్టాభిషేకం వరకు.. చీరపై సాక్షాత్తూ దైవకళ.. ఒక్కో దారంలో ఓ కథ.. ఒక్కో చీరలో ఓ కుటుంబం శ్రమ..**
**- సంప్రదాయానికి ఆధునికత జోడిస్తూ చేనేతకు కొత్త ఊపిరి...నేతన్నల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత**
**- మంత్రి సవితమ్మ చొరవ -చేనేత దినోత్సవం సందర్భంగా నేత కార్మికులందరికీ 'మనం' యాజమాన్యం శుభాకాంక్షలు.. మనం లో ప్రత్యేక కథనం**





**గోరంట్ల, ఆగస్టు 7 మనం న్యూస్:** ఒక దేశ సంస్కృతిని తెలుసుకోవాలంటే ఆ దేశ చేనేతను చూడాలంటారు పెద్దలు. భారతీయ చేనేత అనేది కేవలం ఓ వస్త్రం కాదు.. అది తరతరాలుగా కొనసాగుతున్న సంప్రదాయం.. సంస్కృతి.. కళ.. జీవన విధానం. మగ్గం చప్పుడులో ఓ సంగీతం ఉంటుంది.. నూలు పోగుల్లో ఓ చరిత్ర ఉంటుంది.. ప్రతి చీర వెనుక ఓ నేతన్న కుటుంబం చెమట ఉంటుంది.. కళాకారుడి ఆత్మగౌరవం ఉంటుంది. యంత్రాల వేగానికి ప్రపంచం పరుగులు తీస్తున్నా.. చేతి మగ్గంపై రూపుదిద్దుకున్న వస్త్రానికి ఉన్న ప్రత్యేకత మాత్రం చెక్కుచెదరలేదు. ఎందుకంటే చేనేతలో యంత్రం చేయలేని మానవ స్పర్శ ఉంటుంది. కళాకారుడి ఆలోచన ఉంటుంది. తరతరాలుగా వస్తున్న నైపుణ్యం ఉంటుంది.

**-అగ్గిపెట్టెలో ఇమిడే చీర.. ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచిన కళ**

భారతీయ చేనేత కళాకారుల సృజనాత్మకతకు అగ్గిపెట్టెలో ఇమిడిపోయేంత సన్నని చీరలు ఓ అద్భుత నిదర్శనం. అంతటి సన్నని నూలుతో, అత్యంత నైపుణ్యంతో చీరను నేయడం సాధారణ విషయం కాదు. అది చేతివేళ్ల మాయాజాలం.. ఓర్పుకు పరీక్ష.. కళాకారుడి ఏకాగ్రతకు ప్రతిరూపం.

అగ్గిపెట్టెలో ఇమిడేంత చిన్నగా మడిచినా.. విప్పితే అందమైన చీరగా మారే ఆ కళ భారతీయ చేనేత ప్రతిభను ప్రపంచానికి చాటి చెబుతోంది. ఒక చిన్న మగ్గం ముందు కూర్చొని కళాకారుడు చేసే సుదీర్ఘ శ్రమ వెనుక ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచే అద్భుతం దాగి ఉంటుంది. రాయలసీమ కళా వైభవానికి ప్రతీకగా నిలిచే ధర్మవరం పట్టు చీరలకు దేశవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు ఉంది. నాణ్యమైన పట్టుదారం.. సంప్రదాయ డిజైన్లు.. ఆకర్షణీయమైన రంగుల కలయిక.. అద్భుతమైన జరీ పనితనం.. ఇవన్నీ కలగలిసి ధర్మవరం పట్టు చీరకు ప్రత్యేక అందాన్ని తీసుకొస్తాయి.కాలానుగుణంగా కొత్త డిజైన్లు, ఆధునిక రంగుల కలయికలు, వినూత్న ఆలోచనలను జోడిస్తూ ధర్మవరం నేతన్నలు తమ కళకు కొత్త రూపాన్ని ఇస్తున్నారు. సంప్రదాయాన్ని కాపాడుతూనే ఆధునిక మార్కెట్ అభిరుచులకు అనుగుణంగా చీరలను తీర్చిదిద్దుతున్నారు. ధర్మవరం చేనేత కళలో మరో ప్రత్యేక ఆకర్షణ దేవతామూర్తుల డిజైన్లు. శ్రీ వెంకటేశ్వర స్వామి, శ్రీ మహాలక్ష్మీదేవి, శ్రీకృష్ణుడు, శ్రీరామ పట్టాభిషేకం, సీతారాముల కల్యాణం, రాధాకృష్ణులు, దుర్గాదేవి వంటి దైవ రూపాలను పట్టు చీరలపై అత్యంత నైపుణ్యంతో ఆవిష్కరించడం నేతన్నల సృజనాత్మకతకు అద్దం పడుతోంది.

**చీరపై ప్రతి ఆకృతి ఒక కళాఖండమే..** ప్రతి రంగు ఓ భావాన్ని పలుకుతుంది.. ప్రతి దారం వెనుక గంటల తరబడి శ్రమ ఉంటుంది. దేవతామూర్తుల రూపాలను చీరపై సజీవంగా ఆవిష్కరించే సమయంలో నేతన్న చూపే ఏకాగ్రత, ఓర్పు, నైపుణ్యం అబ్బురపరుస్తాయి. అందుకే ఆ చీర కేవలం ధరించే వస్త్రంగా కాకుండా.. భక్తి, కళ, సంప్రదాయాల సమ్మేళనంగా నిలుస్తోంది.

**నేతన్న కుటుంబమే ఓ చిన్న పరిశ్రమ..**

ఒక చీర వినియోగదారుడి చేతికి చేరే వరకు దాని వెనుక ఎన్నో చేతుల శ్రమ ఉంటుంది. దారం సిద్ధం చేయడం.. రంగులు అద్దడం.. డిజైన్లు రూపొందించడం.. మగ్గాన్ని సిద్ధం చేయడం.. నేయడం.. చివరకు చీరకు తుది మెరుగులు దిద్దడం వరకు అనేక దశలు ఉంటాయి.చేనేత కుటుంబంలో ఒక్క వ్యక్తి మాత్రమే పనిచేయడు. కుటుంబ సభ్యులందరి భాగస్వామ్యం ఉంటుంది. అందుకే నేతన్న కుటుంబాన్ని ఓ చిన్న పరిశ్రమగా చెప్పవచ్చు. ఉదయం నుంచి సాయంత్రం వరకు మగ్గం ముందు కూర్చొని పనిచేసే నేతన్నకు ప్రతి చీర ఓ ఆదాయ వనరు మాత్రమే కాదు.. తన పూర్వీకుల నుంచి అందుకున్న కళను భావితరాలకు అందించే బాధ్యత కూడా.

నేతన్న జీవితంలో మగ్గం ఒక భాగం కాదు.. మగ్గమే అతని జీవితం. మగ్గం కదిలిన ప్రతిసారీ నూలుపోగులు కలుస్తాయి..

**నూలుపోగులు కలిసిన ప్రతిసారీ ఓ కొత్త కథ పుడుతుంది.**

ఒక చీరలో కనిపించే అందం వెనుక కనిపించని ఎన్నో గంటల శ్రమ ఉంటుంది. చీరపై మెరిసే ప్రతి దారం నేతన్న చెమటకు ప్రతిబింబం. అందుకే చేనేత వస్త్రాన్ని కొనడం అంటే కేవలం ఓ వస్త్రాన్ని కొనడం కాదు.. ఓ కుటుంబం శ్రమకు గౌరవం ఇవ్వడం. ఈ నేపథ్యంలోనే నేతన్నకు అండగా కూటమి ప్రభుత్వం రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి సవితమ్మ నేతృత్వంలో చేనేత రంగ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోంది. నేతన్నలకు ఆర్థిక భరోసా కల్పించడం, సంక్షేమ పథకాల ప్రయోజనాలను చేరవేయడం, చేనేత ఉత్పత్తులకు మార్కెట్ అవకాశాలను పెంచడం, మహిళా చేనేత కార్మికులను ప్రోత్సహించడం వంటి అంశాలపై దృష్టి సారిస్తోంది.అదే సమయంలో ఆధునిక డిజైన్లపై శిక్షణ, నైపుణ్యాభివృద్ధి, మార్కెటింగ్ విధానాలపై అవగాహన, కొత్త మార్కెట్లకు చేనేత ఉత్పత్తులను పరిచయం చేయడం వంటి చర్యల ద్వారా సంప్రదాయ చేనేతకు ఆధునిక మార్కెట్‌ను అనుసంధానం చేసే ప్రయత్నాలు కొనసాగుతున్నాయి.యువత చేనేత రంగంలోకి రావడానికి అనుకూల వాతావరణం కల్పించడం.. సంప్రదాయ నైపుణ్యానికి ఆధునిక ఆలోచనలను జోడించడం.. నేతన్న కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడం ద్వారా చేనేతకు కొత్త భవిష్యత్తును నిర్మించడమే లక్ష్యంగా ముందుకు సాగాల్సిన అవసరం ఉంది. నేతన్న తయారు చేసిన వస్త్రానికి సరైన మార్కెట్ లభించినప్పుడే అతని కళకు తగిన విలువ దక్కుతుంది. ప్రదర్శనలు, విక్రయ మేళాలు, ఆధునిక మార్కెటింగ్ వేదికలు, డిజిటల్ మార్కెట్ వంటి అవకాశాలను మరింత విస్తృతం చేయడం ద్వారా చేనేత ఉత్పత్తులను కొత్త తరానికి చేరువ చేయాల్సిన అవసరం ఉంది. ధర్మవరం పట్టు చీరకు ప్రపంచస్థాయి గుర్తింపు రావాలి.. దానికి తగిన ఆదాయం నేతన్నకు అందాలి.. అతని కుటుంబంలో ఆర్థిక భరోసా పెరగాలి.. అప్పుడే తరతరాలుగా వస్తున్న ఈ కళ మరింత బలపడుతుంది.చేనేతను కాపాడటం అంటే కేవలం ఓ వృత్తిని కాపాడటం కాదు. ఓ కుటుంబాన్ని నిలబెట్టడం.. ఓ కళాకారుడి ఆత్మగౌరవాన్ని కాపాడటం.. ఓ సంప్రదాయాన్ని భావితరాలకు అందించడం.. భారతీయ సంస్కృతిని సజీవంగా ఉంచడం.ధర్మవరం పట్టు చీరలో కనిపించే ప్రతి రంగు వెనుక ఓ ఆలోచన ఉంది. ప్రతి డిజైన్ వెనుక ఓ కళ ఉంది. ప్రతి దారం వెనుక ఓ నేతన్న శ్రమ ఉంది. మగ్గం ఆగితే ఓ కళ ఆగినట్టే..చేతి కళ ఆగితే ఓ సంప్రదాయం ఆగినట్టే..నేతన్న నవ్వితేనే చేనేత వెలుగుతుంది..

**చేనేత వెలిగితేనే భారతీయ సంస్కృతి మరింత ప్రకాశిస్తుంది**

చేనేత దినోత్సవం సందర్భంగా దేశవ్యాప్తంగా ఉన్న నేతన్నలు, చేనేత కార్మికులు, కళాకారులందరికీ 'మనం' యాజమాన్యం హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తోంది.సంప్రదాయాన్ని కాపాడుతూ.. ఆధునికతను జోడిస్తూ..నేతన్నకు అండగా నిలుస్తూ..చేనేతకు కొత్త భవిష్యత్తును నిర్మిద్దాం.

# డ్రగ్స్‌కు దూరంగా ఉండండి.. సమాజాన్ని చైతన్యపరచండి



**– యువత లక్ష్యం దేశసేవ కావాలి.. క్రమశిక్షణ, కఠోర శ్రమే విజయానికి బాట**

**– ఎన్‌డీపీఎస్ చట్టంపై అవగాహన కల్పించిన ఎస్పీ సతీష్ కుమార్**

**పుట్టపర్తి ఆగస్టు 7 మనం న్యూస్:** మాదకద్రవ్యాలు వ్యక్తి జీవితాన్ని మాత్రమే కాకుండా కుటుంబాన్ని, సమాజాన్ని సైతం నాశనం చేసే ప్రమాదకరమైన సామాజిక దురాచారమని జిల్లా ఎస్పీ ఎస్. సతీష్ కుమార్, అన్నారు. యువత డ్రగ్స్‌కు పూర్తిగా దూరంగా ఉండటంతో పాటు, మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై కుటుంబ సభ్యులు, స్నేహితులు, సమాజంలో అవగాహన కల్పించే బాధ్యతను కూడా తీసుకోవాలని పిలుపునిచ్చారు. మాదకద్రవ్యాలపై పోలీస్ శాఖ రాజీలేని పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. కదిరి పరిధిలోని కుటాగుళ్లలో ఓబులేశ్వర అకాడమీలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన "డ్రగ్స్ వద్దు బ్రో" అవగాహన కార్యక్రమానికి జిల్లా ఎస్పీ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులు, యువతను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా మాదకద్రవ్యాల నియంత్రణ కోసం అమల్లో ఉన్న నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకోట్రోపిక్ సబ్‌స్టాన్సెస్ చట్టం--1985పై కీలక విషయాలను వివరించారు. మాదకద్రవ్యాలను స్మాల్, ఇంటర్‌మీడియట్, కమర్షియల్ క్వాంటిటీలుగా వర్గీకరిస్తారని ఎస్పీ తెలిపారు. గంజాయి విషయంలో ఒక కిలోలోపు స్మాల్ క్వాంటిటీ, ఒకటి నుంచి 20 కిలోలలోపు ఇంటర్‌మీడియట్ క్వాంటిటీ, 20 కిలోలకు పైగా కమర్షియల్ క్వాంటిటీగా పరిగణిస్తారని వివరించారు. ఇంటర్‌మీడియట్ క్వాంటిటీ కేసుల్లో గరిష్ఠంగా 10 సంవత్సరాల వరకు, కమర్షియల్ క్వాంటిటీ కేసుల్లో 10 నుంచి 20 సంవత్సరాల వరకు జైలు శిక్ష పడే అవకాశం ఉందని యువతకు చట్టపరమైన అవగాహన కల్పించారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో విధులు నిర్వహించిన సమయంలో గంజాయి సాగు, అక్రమ రవాణాపై అనేక చర్యలు చేపట్టిన అనుభవంతో డ్రగ్స్ వల్ల కలిగే దుష్పరిణామాలను ప్రత్యక్షంగా చూశానని ఎస్పీ పేర్కొన్నారు. మాదకద్రవ్యాలకు అలవాటు పడితే యువత భవిష్యత్తుతో పాటు కుటుంబ గౌరవం, సామాజిక జీవితం కూడా ప్రమాదంలో పడుతుందని హెచ్చరించారు.




లక్ష్యసాధన కోసం శిక్షణ పొందుతున్న విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండటంతో పాటు, వాటి నియంత్రణకు సంబంధించిన చట్టాలపై కూడా పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. జీవితంలో ఒక స్పష్టమైన లక్ష్యాన్ని ఏర్పరచుకోవాలని, క్రమశిక్షణతో జీవించాలని, కఠోరంగా శ్రమించాలని, దేశసేవను ధ్యేయంగా పెట్టుకోవాలని ఎస్పీ యువతకు దిశానిర్దేశం చేశారు. తాము డ్రగ్స్‌కు దూరంగా ఉండటమే కాకుండా, తమ కుటుంబాలు, స్నేహితులు, పరిచయస్తులు కూడా మాదకద్రవ్యాలకు బానిసలు కాకుండా అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమ ప్రారంభంలో గర్ల్స్ కమాండోలు అందించిన గార్డ్ ఆఫ్ ఆనర్‌ను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన డ్రిల్ ఫార్మేషన్స్‌ను ప్రశంసించారు. ఆర్మీ శిక్షకుల మార్గదర్శకత్వంలో సుమారు 20 నిమిషాల పాటు ఎలాంటి పొరపాట్లు లేకుండా క్రమశిక్షణతో ప్రదర్శన ఇవ్వడం అభినందనీయమన్నారు. దేశంలోని ఎలైట్ భద్రతా దళాలు, విదేశీ శిక్షణా విధానాలను పరిశీలించిన అనుభవంతో ఈ ప్రదర్శనలు అత్యున్నత ప్రమాణాలకు దగ్గరగా ఉన్నాయని కొనియాడారు. ప్రతి కదలిక సహజంగా మారేంత వరకు నిరంతర సాధన చేయాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, ముఖ్యంగా విద్యార్థినుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయని ఎస్పీ పేర్కొన్నారు. విద్యతో పాటు వ్యక్తిత్వ వికాసానికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. యువతలో దేశభక్తి, క్రమశిక్షణ, సేవాభావాన్ని పెంపొందించడంలో ఓబులేశ్వర అకాడమీ చేస్తున్న కృషిని అభినందించారు. యూనిఫాం ధరించడం కేవలం ఉద్యోగం కాదని.. దేశానికి సేవ చేసే గొప్ప బాధ్యత అని ఎస్పీ అన్నారు. పోలీస్ శాఖ, సైన్యం, కేంద్ర సాయుధ దళాల్లో సేవ చేసే అవకాశం కష్టపడి సాధించుకున్న గౌరవమని పేర్కొన్నారు. తన కుటుంబంలో యూనిఫాం ఉద్యోగాలపై పెద్దగా అవగాహన లేకపోయినా, ఐపీఎస్‌గా ఎంపికై యూనిఫాం ధరించిన తర్వాత దేశసేవ విలువను మరింతగా తెలుసుకున్నానని విద్యార్థులతో తన అనుభవాన్ని పంచుకున్నారు. "డ్రగ్స్‌కు దూరంగా ఉండటమే కాదు.. మాదకద్రవ్యాలపై సమాజాన్ని చైతన్యపరచడం కూడా ప్రతి యువకుడి బాధ్యత. మీ లక్ష్యాన్ని దృష్టిలో ఉంచుకుని క్రమశిక్షణ, కఠోర శ్రమ, దేశసేవతో ముందుకు సాగండి" అని ఎస్పీ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ శివ నారాయణస్వామి, సీఐలు వెంకటేశ్వర్లు, నిరంజన్ రెడ్డి, నాగేంద్ర, ఎస్సై బాబ్జాన్, అకాడమీ ప్రతినిధులు, యువకులు పాల్గొన్నారు.



# ప్రతి అర్జీకి పరిష్కారం చూపండి..

**– సమస్యలపై ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పుకోవద్దు**

**– ప్రజా గ్రీవెన్స్‌లో అధికారులకు ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ఆదేశం**

**పుట్టపర్తి, ఆగస్టు 7మనం న్యూస్ :** ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం వహించకుండా, ప్రతి అర్జీపై బాధ్యతాయుతంగా స్పందించి సత్వర పరిష్కారం చూపాలని పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి అధికారులను ఆదేశించారు. సమస్యల పరిష్కారం కోసం ప్రజలను పదేపదే కార్యాలయాల చుట్టూ తిప్పుకోవద్దని స్పష్టం చేశారు.

పుట్టపర్తి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ప్రజా గ్రీవెన్స్ కార్యక్రమంలో నియోజకవర్గం నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి ఎమ్మెల్యే అర్జీలను స్వీకరించారు. తాగునీరు, భూ సమస్యలు, పెన్షన్లు, రెవెన్యూ, విద్యుత్, రోడ్లు, సంక్షేమ పథకాలకు సంబంధించిన సమస్యలను ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాట్లాడుతూ.. ప్రజల సమస్యలను పరిష్కరించడం ప్రభుత్వ ప్రధాన బాధ్యత అన్నారు. ప్రజల నుంచి వచ్చిన ప్రతి అర్జీని సంబంధిత శాఖ అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. సమస్యల పరిష్కారంలో పారదర్శకత, జవాబుదారీతనం పాటించాలని సూచించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అధికారులు స్పందించాలి అని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు మెరుగైన పాలన అందించడమే లక్ష్యంగా పనిచేస్తోందని, ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ఎలాంటి సంకోచం లేకుండా తనను సంప్రదించవచ్చని తెలిపారు. ప్రజా గ్రీవెన్స్‌లో మొత్తం 12 అర్జీలు స్వీకరించగా, అందులో విద్యుత్‌కు సంబంధించి 6, రెవెన్యూకు సంబంధించి 5, పోలీస్ శాఖకు సంబంధించి 1 అర్జీ ఉన్నాయి. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ విజయ్ కుమార్, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, కృష్ణారెడ్డి, మురళీధర్ రెడ్డి, గడ్డం రమణారెడ్డి, సురేష్, అంబులెన్స్ రమేష్, వెంకటరెడ్డి, బేకరి నాయుడు, దేవేంద్ర రెడ్డి తదితర కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



# తల్లిపాలే బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం పుట్టిన బిడ్డకు ముర్రుపాలె మొదటి టిక

**– ఐసిడిఎస్ సీడీపీఓ చల్లా లలితమ్మ**



**శింగనమల ఆగస్టు 7 మనం న్యూస్:** తల్లిపాలే బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం పుట్టిన బిడ్డకు ముర్రుపాలె మొదటి టిక..... ఐసిడిఎస్ సీడీపీఓ చల్లా లలితమ్మ అన్నారుప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా సింగనమల మండల కేంద్రంలోని ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో శుక్రవారం అవగాహన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఐసీడీఎస్ సీడీపీఓ చల్లా లలితమ్మ పాల్గొన్నారు ఈ సందర్భంగా ఐసిడిఎస్ సిడిపిఓ చల్లా లలితమ్మ మాట్లాడారు సింగనమల మండల వ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయతీల్లో ఉన్న అంగన్వాడి కేంద్రాలలో నిర్వహించిన తల్లిపాలు వారోత్సవం చివరిగా మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు, తల్లిపాలు శిశువుకు ప్రకృతి ప్రసాదించిన సంపూర్ణ ఆహారమని పేర్కొన్నారు. శిశువు జన్మించిన తొలి గంటలోపే తల్లిపాలు పట్టించడం ద్వారా బిడ్డకు వ్యాధి నిరోధక శక్తి పెరగడంతో పాటు ఆరోగ్యవంతమైన ఎదుగుదలకు బలమైన పునాది ఏర్పడుతుందని తెలిపారు. పుట్టిన తొలి ఆరు నెలల వరకు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని సూచించారు. విద్యార్థులు జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండి పాలు, పండ్లు, ఆకుకూరలు, గుడ్లు వంటి పౌష్టికాహారం తీసుకోవాలని, ప్రతిరోజూ వ్యాయామం చేసి పరిశుభ్రత పాటించాలని సూచించారు. కార్యక్రమంలో తల్లిపాల ప్రాముఖ్యత, గర్భిణుల ఆరోగ్య సంరక్షణ, రక్తహీనత నివారణ, శిశుపోషణ, బాలలఎదుగుదల, టీకాలప్రాధాన్యత, మహిళలఆరోగ్య పరిరక్షణ, కుటుంబ సభ్యుల బాధ్యత తదితర అంశాలపై విస్తృతంగా అవగాహన కల్పించారు. ప్రతి తల్లి తన బిడ్డకు తల్లిపాలను అందించడం ద్వారా ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి తోడ్పడాలని సీడీపీఓ చల్లా లలితమ్మ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ అధికారులు, సూపర్వైజర్లు కల్పన, వాణిశ్రీ, నేతాజీ, కౌసల్య, నాగమణి,, హెల్త్ సిబ్బంది అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు, చిన్నారుల తల్లులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# కేజీబీవీ విద్యార్థినులకు భద్రతపై సమగ్ర అవగాహన పోక్సో చట్టం

**– సైబర్ నేరాలు, శక్తి యాప్‌పై ఎస్ఐ కే ప్రసాద్**



**శింగనమల ఆగస్టు 7 మనం న్యూస్ :** కేజీబీవీ విద్యార్థినులకు భద్రతపై సమగ్ర అవగాహనపోక్సో చట్టం, సైబర్ నేరాలు, శక్తి యాప్‌పై ఎస్ఐ కే ప్రసాద్ బాలికల భద్రత, మహిళలపై నేరాల నివారణ, సైబర్ మోసాలపై అప్రమత్తత కల్పించేందుకు సింగనమల మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం (కేజీబీవీ) పాఠశాల లో సింగనమల పోలీస్ స్టేషన్ ఎస్ఐ కే ప్రసాద్ సందర్శించి విద్యార్థినులతో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎస్సై కే ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థినులతో నేరుగా మాట్లాడిన ప్రస్తుతం సమాజంలో మహిళలు, బాలికలు ఎదుర్కొంటున్న సవాళ్లపై అవగాహన కలిగి ఉండటం అత్యంత అవసరమని తెలిపారు. బాలికలపై జరిగే లైంగిక వేధింపులు, దాడులు, దుర్వినియోగాన్ని అరికట్టేందుకు అమలులో ఉన్న పోక్సో ఫోక్స్ చట్టం గురించి సవివరంగా వివరించారు. ఎలాంటి వేధింపులు ఎదురైనా భయపడకుండా వెంటనే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా పోలీసులను సంప్రదించాలని సూచించారు. మహిళలు, చిన్నారులపై నేరాలను నిరోధించడంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని, అనుమానాస్పద వ్యక్తులు లేదా సంఘటనలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని చెప్పారు. యువతను తప్పుదోవ పట్టిస్తున్న మాదకద్రవ్యాల దుష్పరిణామాలు గురించి వివరించి, వాటికి పూర్తిగా దూరంగా ఉండాలని విద్యార్థినులకు సూచించారు. అలాగే ప్రస్తుతం పెరుగుతున్న సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని, తెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, సందేశాలు, లింకులు, ఓటీపీలు, బ్యాంకు వివరాలు ఎవరికీ ఇవ్వకూడదని హెచ్చరించారు. సోషల్ మీడియాను బాధ్యతాయుతంగా వినియోగించాలని, ఆన్‌లైన్ మోసాలకు గురైతే వెంటనే 1930 సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్కు ఫిర్యాదు చేయాలని వివరించారు. మహిళల భద్రత కోసం ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చిన శక్తి యాప్ వినియోగంపై అవగాహన కల్పిస్తూ, అత్యవసర పరిస్థితుల్లో దాని ద్వారా సహాయం పొందవచ్చని తెలిపారు. అలాగే ప్రాణాపాయ పరిస్థితులు లేదా ఇతర అత్యవసర సందర్భాల్లో వెంటనే డయల్--100కు కాల్ చేసి పోలీసుల సహాయం పొందాలని సూచించారు. విద్యార్థినులు ధైర్యంగా చదువుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని, ఎలాంటి సమస్య వచ్చినా పోలీసు శాఖ అండగా ఉంటుందని ఎస్ఐ భరోసా ఇచ్చారు. ఈ అవగాహన కార్యక్రమంలో పాఠశాల, కళాశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొని విద్యార్థినులకు భద్రతా సూచనలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమం ఏ ఎస్ ఓ గీతా రాణి ఉపాధ్యాయురాలు విద్యార్థులు పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పురంలో ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు



**హిందూపురం (మనం న్యూస్) ఆగస్టు 7:** హిందూపురం పురపాలక సంఘం ఆధ్వర్యంలో పట్టణం అభివృద్ధిలో భాగంగా శాసన సభ్యులు పద్మవిభూషణ్ నందమూరి బాలకృష్ణ ఆదేశాల మేరకు పట్టణ ప్రజలకు ట్రాఫిక్ అంతరాయం లేకుండా సజావుగా రవాణా సౌకర్యం కల్పించుటకు గాను రహమత్ పురం, గురునాథ్ థియేటర్ వద్ద గల (శ్రీయాద్య సర్కిల్) సర్కిల్, అంబెద్కర్ సర్కిల్ ల వద్ద ట్రాఫిక్ సిగ్నల్స్ లను ఏర్పాటు చేసి, జీబ్రా క్రాసింగ్ లైన్స్ మరియు స్టాప్ లైన్స్ పురపాలక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు.అందులో రహమత్ పురం సర్కిల్ నందు దిగ్విజయంగా ట్రయల్ రన్ ప్రారంభించడం జరిగినది. ఇతర రెండు ప్రదేశాలలో ఆగస్టు 15 న స్వాతంత్ర్య దినోత్సవం లోపు పనులను పూర్తిచేసి వాటిని ప్రారంభించి వినియోగంలోనికి తీసుకొనిరావడం జరుగుతుంది.ఈ సందర్భంగా శుక్రవారం రహమత్ పురం సర్కిల్ నందు పాదచారుల గుర్తులు స్టాప్ లైన్ మార్కింగ్ (నిలుపు గీతల గుర్తులు) ఏర్పాటు చేయడం జరిగినది. పట్టణ ప్రజలు ట్రాఫిక్ నియమాలు పాటించి సహకరించవలసినదిగా మున్సిపల్ కమిషనర్ వి. మల్లికార్జున కోరారు.

# రైతన్న... మీకోసం



**నార్పల ఆగస్టు 7 మనం న్యూస్ :** మండలంలోని రైతు సేవా కేంద్రాల్లో శుక్రవారం మండల వ్యవసాయ శాఖ, ఉద్యాన శాఖ అధికారులు రైతన్న.. మీకోసం అనే కార్యక్రమాన్ని చేపట్టాయి. ఈ కార్యక్రమంలో భాగంగా ఎల్ నినో ప్రభావం వ్యవసాయ రంగంపై పడుతున్న తీరు పట్ల రైతాంగానికి అవగాహన కల్పించారు. వాతావరణ పరిస్థితుల కనుగుణంగా పంటల ఎంపిక చేసుకోవాలని సూచించారు. తేమ సంరక్షణ చర్యలు, నీటి వినియోగం పొదుపు, శాస్త్రీయ సాగు విధానాలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి సన్న వీరస్వామి, ఉద్యాన శాఖ అధికారి నెట్టికంటయ్య, రైతు సేవ కేంద్రాల సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

# భూగర్భ జలాలను కాపాడితే భవిష్యత్తు కాపాడినట్టే

**– వర్షాభావం ప్రత్యామ్నాయ పంటలే తక్కువనీరు ఎక్కువ లాభం**



**కుందుర్పి ఆగస్టు 7, మనం న్యూస్ :** భూగర్భ జలాలను కాపాడితే మన భవిష్యత్తు కాపాడినట్లేనని జిల్లా నాబార్డ్ అధికారులు, ఏ ఎఫ్ , ఏ కాలేజీ, సంస్థ ప్రతినిధులు రైతులకు సూచించారు. శుక్రవారం కుందుర్పి మండల పరిధిలోని మాయదార్లపల్లి గ్రామంలో నాబార్డ్ వాటర్‌షెడ్ ప్రాజెక్టు , ఎ ఎఫ్ ఏకాలజీ సంస్థ లు ఆధ్వర్యంలో ఆర్.డి.టి, స్కూల్ వద్ద పంట నీరుపై బడ్జెట్‌పై గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. వర్షాభావం మూలంగా ఖరీఫు సిజనులో పంటనీరును పొదుపుచేసి ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని రైతులను కోరారు.సహజ వ్యవసాయం ఆరోగ్యకర వ్యవసాయం అన్నారు. మీరు లేకుండా వ్యవసాయమే లేదు అన్నారు. వర్షాబావముతో ప్రత్యమాయ పంటలే తక్కువ నీరు ఎక్కువ లాభం పొందవచ్చున్నారు. నీరు పొదుపుతో రైతు బతుకు తక్కువ ఎక్కువ దిగుబడి సాధ్యమన్నారు. ఈ సమావేశంలో గ్రామంలోని చెక్‌డ్యామ్‌లు, కుంటలు, సంప్రదాయ నీటి వనరులు ,ఇతర జల సంరక్షణ నిర్మాణాల ద్వారా వర్షపు నీరు భూగర్భ జలాల్లోకి ఎంత మేరకు ఇంకుతుందో రైతులకు వివరించారు. అలాగే 2025--26 సంవత్సరంలో సాగు చేసిన పంటలకు ఎంత నీరు వినియోగించ బడిందో లెక్కలతో రైతులకు తెలియజేశారు. గత 50 సంవత్సరాలలో గ్రామంలోని భూగర్భ జలాల పరిస్థితిలో వచ్చిన మార్పులు, నీటి మట్టం తగ్గడానికి గల కారణాలు మరియు వర్షపు నీటి సంరక్షణ ద్వారా భూగర్భ జలాలను పెంపొందించే మార్గాలపై విస్తృతంగా చర్చించారు. భవిష్యత్తులో తక్కువ నీటి వినియోగం చేసే పంటలను సాగు చేయడం ద్వారా నీటిని ఆదా చేసుకుంటూ రైతులు అధిక లాభాలు పొందవచ్చని సూచించారు. వ్యవసాయంలో అధికంగా రసాయన ఎరువులు, పురుగుమందులు వాడటం వల్ల ప్రజల్లో బీపీ, షుగర్, క్యాన్సర్ వంటి ఆరోగ్య సమస్యలు పెరుగుతున్న నేపథ్యంలో, సహజసిద్ధమైన మరియు స్థిరమైన వ్యవసాయ పద్ధతులను అనుసరించాలని రైతులకు అవగాహన కల్పించి జన జాగృతి చేశారు. వర్షపు నీరు భూగర్భ జలాల్లోకి ఎంత మేరకు ఇంకుతుందో లెక్కలను చూపించారు. గత 50ఏళ్ళలో మార్పు భూగర్భ జలాల పరిస్థితి నీటిమట్టం తగ్గడానికి గల కారణాలను నిశితంగా వివరించారు. ఈ ఏడాది సాగుచేసిన పంటలకు ఎంత నీరు వినియోగించబడుతుందో లెక్కలతో రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎ.ఎఫ్. ఏకాలజీ సంస్థ ,ప్రతినిధులు భాస్కర్‌బాబు , కోఆర్డినేటర్ , రామయ్యసెట్టి , కోఆర్డినేటర్, అనిల్, ప్రాజెక్టు ఇంజినీర్, రామకృష్ణ, యస్.టి.ఓ, యం,తిప్పేస్వామి, యస్.టి.ఓ, గ్రామ మాజీ సర్పంచ్, భర్త ,బొమ్మ య్య, వాటర్ షెడ్ చైర్మెన్ నాగభూషన్ ,గ్రామ పెద్దలు పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

# తల్లిపాలు.. రోగాలను దూరం చేసే దివ్యౌషధం





**హిందూపురం (మనం న్యూస్) ఆగస్టు 7:** తల్లిపాలు ఆరోగ్యకరమైన భవిష్యత్ తరానికి దివ్యౌషధమని జిల్లా ప్రోగ్రాం మానిటరింగ్ అధికారిణి (డిపిఎంఓ) డా. జయం పద్మజ పేర్కొన్నారు. తల్లిపాలను కొనసాగించడం ద్వారా ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి బాటలు వేయవచ్చని తెలిపారు. తల్లిపాల వారోత్సవాల ముగింపు సందర్భంగా హిందూపురం లక్ష్మీపురం పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం గర్భిణులు, బాలింతలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డా. జయం పద్మజ తల్లిపాల ప్రాధాన్యతను వివరించారు. తల్లి రక్తం నుంచి రూపుదిద్దుకునే తల్లిపాలలో శిశువు ఎదుగుదలకు అవసరమైన లాక్టోజ్, విటమిన్లు, ప్రోటీన్లు తదితర పోషకాలు సమతుల్యంగా ఉంటాయని తెలిపారు. ఇవి శిశువు శారీరక, మానసిక ఎదుగుదలకు ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు. తల్లిపాలు తాగే సమయంలో తల్లి స్పర్శ, గుండె చప్పుడు ద్వారా శిశువు పొందే అనుభూతికి వెలకట్టలేమన్నారు. వైద్యాధికారిణి డా. ఉషారాణి మాట్లాడుతూ తల్లిపాలు శిశువుల్లో రోగనిరోధక శక్తిని పెంచే ముఖ్యమైన ఆయుధమని తెలిపారు. తల్లిపాలలో సులభంగా జీర్ణమయ్యే పోషకాలు ఉంటాయని, పిల్లల్లో అలెర్జీలు, ఆస్తమా, ఇన్ఫెక్షన్లు, శ్వాసకోశ సంబంధిత వ్యాధుల ముప్పును తగ్గించడంలో ఇవి సహాయపడతాయని వివరించారు. శిశువులకు సరైన పద్ధతిలో తల్లిపాలు పట్టించే విధానాలను గర్భిణులు, బాలింతలకు వివరించారు. ఆరోగ్య కార్యకర్తలు గౌసియా, తిమ్మక్క గర్భధారణ దశ నుంచి ప్రసవానంతరం వరకు తల్లులు, శిశువులు తీసుకోవాల్సిన పోషకాహారం, పాటించాల్సిన జాగ్రత్తలు, శిశు పోషణకు సంబంధించిన పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కొందరు గర్భిణులు, బాలింతలు మాట్లాడుతూ అవగాహన కార్యక్రమం ద్వారా తల్లిపాలు, శిశు పోషణకు సంబంధించి అనేక కొత్త విషయాలు తెలుసుకున్నామని తెలిపారు. కార్యక్రమంలో ముస్తఫా, శ్రీనివాస్ రెడ్డి, లక్ష్మణ్,ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎల్‌నినో ప్రభావంపై రైతులు అప్రమత్తంగా ఉండాలి



**గుత్తి, ఆగస్టు 7 మనం న్యూస్ :** ఎల్‌నినో ప్రభావంతో మాన్సూన్ వర్షపాతం తగ్గే అవకాశం ఉన్నందున రైతులు అప్రమ త్తంగా ఉండి పంటల సాగులో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని గుత్తి ఏడీఏ వెంకటశ్రీ రాముడు సూచించారు. గుత్తి మండలం తొండపాడు గ్రామంలోని పంట పొలాల్లో శుక్రవారం రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ వాతావరణ పరిస్థితుల్లో మార్పులు చోటుచేసుకుంటున్న నేపథ్యంలో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉందన్నారు. రైతులు ఎండను తట్టుకునే పంటలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. నీటి వినియోగాన్ని తగ్గించేందుకు డ్రిప్, స్ప్రింక్లర్ వంటి సూక్ష్మ సాగు పద్ధతులను వినియోగించుకోవాలని, పంటల వైవిధ్యాన్ని పాటించడం ద్వారా వాతావరణ మార్పుల వల్ల కలిగే నష్టాలను తగ్గించుకోవచ్చని తెలిపారు. వ్యవసాయ శాఖ అందించే వాతావరణ సూచనలు, సలహాలను రైతులు పాటించాలని, పంట బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పంటల సాగుపై ఏవైనా సందేహాలు ఉంటే సమీపంలోని వ్యవసాయ అధికారులను సంప్రదించాలని కోరారు. రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, అవసరమైన సహాయం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గుత్తి వ్యవసాయ అధికారి ముస్తాక్ అహ్మద్, అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కంపెనీ ఆఫ్ ఇండియా ప్రతినిధి సురేంద్ర, వీఏఏ అశ్విన్, ఎంపీఈఓ ఓబులకృష్ణతో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

# వర్షాల కోసం అపిలేపల్లిలో ప్రత్యేక ప్రార్థనలు



**-వర్షాలు పడాలి పంటలు పండాలి**
**-రైతులు సుభిక్షంగా ఉండాలని ప్రార్థనలు.**

**కుందుర్పి ఆగస్టు 7 మనం న్యూస్ :** కుందుర్పి మండల పరిధిలోని అపిలేపల్లి గ్రామంలో ముసలప్పనాయుడు చెరువు లోతట్టు ప్రాంతాలో శుక్రవారం వర్షాలు సమృద్ధిగా కురవాలని, పంటలు దిగుబడి బాగా పండాలని ఆ గ్రామ ముస్లింలు ఆధ్వర్యంలో ఐక్యంగా ఏర్పడి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. గ్రామ చెరువులో ముస్లిం సోదరులు అందరు సమావేశమైన ఐకమత్యంతో భక్తులు అల్లాహ్ ను రెండో సారి ప్రార్థించారు. సకాలంలో వర్షాలు కురిసి రైతుల కష్టాలు తీరాలని, గ్రామానికి సుభిక్షంగా ఉండాలని,ప్రజలు సురక్షితంగాను వుండాలని ప్రార్థన చేసి అల్లా కరుణతోను కోరారు. రైతులు ఏ ఒక్కరు పంటలు పండక బలవన్మరణం చెందకూడదని అల్లాను కోరి ప్రార్థించారు. రైతులు బాగు వుంటే రాజ్యాలు బాగుంటాయి దేశం బాగువుంటుందని వారు ఆశా భావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మత పెద్దలు అయిన బండి, దీనాసాబ్, ముతవల్లి, అతావుల్లా, దాదా పీర్, హాజీ అబ్దుల్లా, షఫీ సాబ్, వన్నూరు సాబ్, దాదా పీర్ ,మండలపల్లి, ఫక్రుద్దీన్, శెట్టూర్ అల్తాఫ్, తదితరులు పాల్గొన్నారు.

# తల్లిపాలే పుట్టిన బిడ్డకు శ్రీరామరక్ష: సీహెచ్‌ఓ మౌనిక



**శింగనమల ఆగస్టు 7 మనంన్యూస్ :** సింగనమల మండల పరిధిలోని శోధనపల్లి గ్రామంలోని ఎస్సీ కాలనీలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం తల్లిపాల వారోత్సవాల కార్యక్రమం పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా సిహెచ్ఓ మౌనిక పాల్గొన్నారు . ఈ సందర్భంగా సిహెచ్ఓ మౌనిక మాట్లాడుతూ పుట్టిన బిడ్డకు తల్లిపాలే శ్రీరామరక్ష అని పేర్కొన్నారు. గర్భిణులు, బాలింతలు ప్రభుత్వ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న రాగిపిండి, అటుకులు, బెల్లం, పాలు, గుడ్లు ఆకుకూరలు క్యారెట్ వంటి పౌష్టికాహారాన్ని తప్పనిసరిగా తీసుకోవాలని అన్నారు పుట్టిన బిడ్డకు ఆరు నెలలు వరకు తల్లిపాలు స్తాపించాలి అన్నారు గర్భవతులు మరియుతల్లులు మంచి పౌష్టికాహారం తీసుకోవడం వల్ల పుట్టబోయే శిశువు ఆరోగ్యంగా, సరైన ఎత్తు, బరువుతోఎదుగుతాడని తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ బండారు సరస్వతి అంగన్వాడి హెల్పర్ శ్రావణి ఆశా వర్కర్ శివలక్ష్మి పేట లక్ష్మీదేవి ధనలక్ష్మి రామాంజనమ్మ రాజేశ్వరి లక్ష్మి భాగ్యమ్మ భూమిక జ్యోతి నాగమ్మ ఆసాదు నాగమ్మ అంగన్వాడి విద్యార్థులు సిబ్బంది, ఆశా కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

# ముచ్చర్ల సురేష్ యాదవ్ జన్మదిన వేడుకలు



**కళ్యాణదుర్గం ఆగస్ట్ 07 మనం న్యూస్ :** తెలుగుదేశం పార్టీ యువనాయకుడు అగ్రికల్చర్ ఫర్టిలైజర్ వైస్ ప్రెసిడెంట్ కంబదూరు మండలం యర్రమల్లేపల్లి సురేష్ యాదవ్ జన్మదిన వేడుకలు సందర్భంగా తెదేపా నాయకులు ఫర్టిలైజర్స్ నిర్వాహకులు మిత్రులు శుక్రవారం ఉదయం పట్టణంలోని ఫర్టిలైజర్ దుకాణం నందు ముచ్చర్ల యాదవ్ దుప్పటి శాలువాతో సన్మానించి కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. సురేష్ ముందుకు మరెన్నో పదవులు పొంది. ఆపదన్నవారికి తనువంతగా సహాయం చేసే స్నేహశీలి కార్యక్రమంలో ముదిగల్లు బంగ్రోత్ మంజునాథ్ గ్రామ కమిటీ మాజీ అధ్యక్షుడు మనోహర్ మేముల చందు చౌదరి రాళ్ల అనంతపురం రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## గుత్తి ఎంఎస్ డిగ్రీ కళాశాలలో మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ అడ్మిషన్ల ప్రచార కరపత్రాల విడుదల



**గుత్తి,ఆగస్టు 07 మనం న్యూస్ :** పట్టణంలోని ఎంఎస్ డిగ్రీ కళాశాలలో శుక్రవారం దూర విద్య ద్వారా మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ 2026-27 నూతన విద్యా సంవత్సరానికి సంబంధించిన ప్రవేశాలపై ప్రచార కరపత్రాలను విడుదల చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ నలిమి ఆధ్వర్యంలో కళాశాల సిబ్బంది, విద్యార్థుల సమక్షంలో ప్రవేశ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ నలిమి మాట్లాడుతూ కళాశాల అభివృద్ధిలో భాగంగా మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ దూర విద్యా కేంద్రం ద్వారా నూతన కోర్సుల్లో అడ్మిషన్లు ప్రారంభించేందుకు ప్రచార కరపత్రాలను విడుదల చేసినట్లు తెలిపారు. నాక్ ఏం గుర్తింపు పొందిన మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ ద్వారా నూతన కోర్సులను దూర విద్యా విధానంలో అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నత విద్యను అభ్యసించి మంచి భవిష్యత్తును నిర్మించుకోవాలని ఆకాంక్షించారు. గుత్తి పట్టణం, గుత్తి మండల ప్రజలు, విద్యావంతులు, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ -- ఎంఎస్ డిగ్రీ కాలేజ్, గుత్తి గౌరవ డాక్టర్ ఐజక్ వరప్రసాద్ (బిషప్, రాయలసీమ డయాసిస్), కరస్పాండెంట్ భారతి, ప్రిన్సిపాల్ నలిమి, కో-ఆర్డినేటర్ ఇసాక్ బాషా, సీనియర్ లెక్చరర్ అన్వర్ బాషా, లెక్చరర్ దాదాపీరా, ఆఫీస్ సూపరింటెండెంట్ జింగిరీడ్, కళాశాల సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## పెరవలి గ్రామం జిల్లా ఉన్నత పరిషత్ పాఠశాలలో 2026 అనంత స్పోర్ట్స్ ఛాంపియన్‌షిప్ అండర్ -14 క్రీడా పోటీలు



**శింగనమల ఆగస్టు 7 మనం న్యూస్ :** సింగనమల మండలం పెరవలి గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అనంతపూర్ ఛాంపియన్ పోటీలు క్రీడా పోటీలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి పలువురు ప్రజా ప్రతినిధులు, అధికారులు విద్యాశాఖ ప్రతినిధులు మరియు గ్రామ పెద్దలు ముఖ్య అతిథులుగా హాజరై క్రీడాకారులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఎంపీడీవో భాస్కర్,ఎమ్మార్వో శేషానంద రెడ్డి సింగనమల తెలుగుదేశం మండల కన్వీనర్ మారుతి నాయుడు, రాష్ట్ర పంచాయతీరాజ్ ఛాంబర్ కార్యదర్శి దేగల కృష్ణమూర్తి నాయి బ్రాహ్మణ రాష్ట్ర డైరెక్టర్ ఆదినారాయణ సింగల్ విండో చైర్మన్ గుర్రం లక్ష్మీనారాయణ మాజీ సింగనమల మండల కన్వీనర్ గుత్త ఆదినారాయణ, ఎంఈఓ నరసింహారాజు శివప్రసాద్ పాఠశాల స్థలం దాత అయినటువంటి శైలజ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ముక్కర హరినాథ్, పిడి నరసింహారెడ్డి స్కూల్ కమిటీ చైర్మన్ వరదరాజులు సర్పంచ్ రాజు మరియు రాము 6 మండలాల స్పోర్ట్స్ కోఆర్డినేటర్ పీడీలు ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు తల్లిదండ్రులు మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పోటీలను విజయవంతం చేశారు మండల కన్వీనర్ మారుతి నాయుడు మాట్లాడుతూ ఓటమి గెలుపు ఉంటాయి ఓటమి అయిన వారు అధైర్పడకండి ముందుకు ఆలోచించండి. మీ భవిష్యత్తు బంగారు బాట వేసుకోండి అని తెలియజేశారు. ఈ క్రీడా పోటీలకు వివిధ మండలాల నుంచి వచ్చి ఎంతో ఆనందంగా ఉత్సాహంగా ఆటలు ఆడడం జరిగింది. ఈ పోటీలలో గెలుపొందిన కబడ్డీ (బాలురు) విజేత నార్పల మండలం రన్నర్ ఆఫ్ పుట్లూరు కబడ్డీ( బాలికలు )విజేత పుట్లూరు మండలం రన్నర్ ఆఫ్ సింగనమల మండలం ఖో -ఖో( బాలురు) విజేత బుక్కరాయ సముద్రం మండలం రన్నర్ ఆఫ్ సింగనమల మండలం ఖో ఖో( బాలికలు) విజేత సింగనమల మండలం రన్నర్ ఆఫ్ పుట్లూరు వాలీబాల్ (బాలురులు) విజేత బుక్కరాయసముద్రం మండలం రన్నర్ ఆఫ్ గార్లదిన్నె వాలీబాల్ (బాలికలు) విజేత నార్పల రన్నర్ ఆఫ్ యల్లనూరు గెలుపొందడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు తల్లిదండ్రులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు విజయం పట్ల గ్రామానికి గర్వంగా ఉంది

**-ప్రతిభ చాటిన క్రీడాకారులుకు అభినందనలు**

**కుందుర్పి ఆగస్టు 7 మనం న్యూస్ :** కళ్యాణదుర్గంలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి అనంత ఛాంపియన్‌షిప్ పోటీల్లో ఖోఖో బాలుర అండర్-14 విభాగంలో అపిలేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు కళ్యాణదుర్గం గోల్డెన్ బెల్స్ పాఠశాల జట్టుపై అద్భుత విజయం సాధించి తమ ప్రతిభను చాటారు. ఈక్రమంలోనే తమ పాఠశాల విద్యార్థులు విజయం పట్ల పాఠశాల ఉపాధ్యాయ కాకుండా గ్రామానికి చాలా గర్వంగా ఉందని,ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బిసి, తిమ్మప్ప అన్నారు.మండల పరిధిలోని అపిలేపల్లి గ్రామంలో శుక్రవారం ఈ సందర్భంగా విజేతలైన విద్యార్థులను, వారికి శిక్షణ అందించిన వ్యాయామ ఉపాధ్యాయిని రేణుక వారిని పాఠశాల ప్రధానోపాధ్యాయులు, బి.సి. తిమ్మప్ప , ఉపాధ్యాయ బృందం, మరియు గ్రామ ప్రజలు హృదయపూర్వకంగా అభినందించినారు, భవిష్యత్తులో క్రీడాకారులు మరెన్నో విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.విజేతలందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేసినారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలతో పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని విద్యా కుసుమాలును కోరారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



# బీసీ హాస్టల్ వార్డెన్‌పై కొరడా.. సస్పెన్షన్‌కు రంగం సిద్ధం..

**-విద్యార్థుల ఫిర్యాదులతో కదిలిన బీసీ సంక్షేమ శాఖ**
**- మీడియా కథనాలపై స్పందించిన అధికారులు**
**-విద్యార్థుల ఫిర్యాదులపై అధికారిణి విచారణ..**
**- వార్డెన్‌పై చర్యలు తప్పవు**



**గోరంట్ల, ఆగస్టు 7 మనం న్యూస్ :** గోరంట్ల పట్టణంలోని బీసీ బాలుర వసతి గృహంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై అధికారులు సీరియస్‌గా స్పందించారు. వార్డెన్ ఆంజనేయులు విధులకు సక్రమంగా హాజరు కావడం లేదని, మెనూ ప్రకారం భోజనం అందడం లేదని, హాస్టల్‌లో కనీస వసతులు సైతం సరిగా లేవని విద్యార్థులు, పీఎస్‌యూ విద్యార్థి సంఘం నాయకులు చేసిన ఫిర్యాదులు, మీడియాలో వచ్చిన కథనాలపై బీసీ సంక్షేమ శాఖ అధికారులు విచారణ చేపట్టారు. విద్యార్థుల ఫిర్యాదుల మేరకు హాస్టల్‌ను పరిశీలించిన సహాయ బీసీ సంక్షేమ శాఖాధికారి లీలావతి అక్కడి పరిస్థితులపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిపారు. ముఖ్యంగా బాత్రూమ్‌లు సక్రమంగా లేకపోవడం, భోజన వసతులు మెనూ ప్రకారం లేకపోవడం, వార్డెన్ విధుల నిర్వహణలో నిర్లక్ష్యం తదితర అంశాలపై విద్యార్థులు చెప్పిన విషయాలు విచారణలో వాస్తవంగా ఉన్నట్లు గుర్తించామని ఆమె వెల్లడించారు. వార్డెన్ పనితీరును ఏడాది కాలంగా గమనిస్తున్నామని, అయినప్పటికీ ఆయన ప్రవర్తనలో ఆశించిన మార్పు కనిపించలేదని లీలావతి తెలిపారు. ఈ వ్యవహారంపై పూర్తి స్థాయి విచారణ నివేదికను ఉన్నతాధికారులకు సమర్పించనున్నట్లు చెప్పారు.

**సస్పెన్షన్‌కు కార్యాచరణ..**

హాస్టల్‌లో పరిస్థితులపై ఉన్నతాధికారుల దృష్టికి విషయం వెళ్లిందని, ఇలాంటి పరిస్థితుల్లో సంబంధిత వ్యక్తిని ఇన్నాళ్లు ఎలా కొనసాగించారనే అంశంపైనా అధికారులు ఆరా తీసినట్లు లీలావతి తెలిపారు. వార్డెన్‌పై తగిన క్రమశిక్షణ చర్యలు తీసుకోవడంతో పాటు సస్పెన్షన్‌కు సంబంధించిన కార్యాచరణ రూపొందించాలని ఉన్నతాధికారులు ఆదేశించినట్లు ఆమె పేర్కొన్నారు. విద్యార్థుల ఫిర్యాదులను నిర్లక్ష్యం చేయకుండా హాస్టల్ నిర్వహణపై మరింత కఠినంగా పర్యవేక్షణ చేపట్టనున్నట్లు అధికారులు స్పష్టం చేశారు. విచారణ నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు ఉండనున్నాయి.

# నిరుద్యోగులకు వరం.. కూటమి ప్రభుత్వం..




**- ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ చొరవతో 2వేలకు పైగా ఉద్యోగాలు..**
**- వైసిపి ఉనికి కోసమే దీక్షలు**
**- మీడియా సమావేశంలో టిడిపి నాయకులు వెల్లడి**

**హిందూపురం (మనం న్యూస్) ఆగస్టు 7:** నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. స్థానిక ప్రెస్ క్లబ్ లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో పరిశ్రమలను రాష్ట్రానికి తీసుకువచ్చి యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు చర్యలు చేపడుతున్నారని తెలిపారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో నిరుద్యోగ యువతకు తగిన అవకాశాలు కల్పించలేదని టీడీపీ నాయకులు విమర్శించారు. యువతను డ్రగ్స్, మద్యం వంటి వ్యసనాలకు దూరంగా ఉంచి వారికి మెరుగైన భవిష్యత్తు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ఆధ్వర్యంలో పలు కార్పొరేట్ సంస్థలను హిందూపురానికి రప్పించి మెగా జాబ్ మేళా నిర్వహించి 2,000కు పైగా ఉద్యోగ అవకాశాలు కల్పించారని తెలిపారు. భవిష్యత్తులో కూడా ప్రతి ఏటా జాబ్ మేళాలు నిర్వహించి నిరుద్యోగ యువతకు అండగా నిలవాలని బాలకృష్ణ లక్ష్యంగా పెట్టుకున్నారని పేర్కొన్నారు. వైసీపీ నాయకులు ఉనికి కోసం రిలే నిరాహార దీక్షలు, ఇతర ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నారని టీడీపీ నాయకులు విమర్శించారు. ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలను ప్రజలు సహించరని, రానున్న రోజుల్లో ప్రజలే తగిన సమాధానం చెబుతారని అన్నారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మెగా డీఎస్సీ కాదు.. దగా డీఎస్సీ' అంటూ వైఎస్సార్‌సీపీ నిరసన

**- డీఎస్సీ అవకతవకలపై సీబీఐ విచారణ జరపాలని డిమాండ్..**
**- మంత్రి లోకేష్ రాజీనామా చేయాలంటూ నినాదాలు**



**అమడగూరు ఆగస్టు 7, మనం న్యూస్:** ఇటీవల నిర్వహించిన డీఎస్సీ నియామక ప్రక్రియలో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం మండల కేంద్రంలోనిరసన కార్యక్రమం నిర్వహించారు. ఏపీ జెన్-జెడ్ వార్ రిలే కార్యక్రమం భాగంగా చేపట్టిన ఈ ఆందోళనలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి. కేశవరెడ్డి.మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో "మెగా డీఎస్సీ" పేరుతో నిరుద్యోగ యువతకు హామీలు ఇచ్చిన ప్రభుత్వం, చివరకు వారి ఆశలను వమ్ము చేసిందని విమర్శించారు. డీఎస్సీ పరీక్షల నిర్వహణలో అవకతవకలు, ప్రశ్నాపత్రం లీకేజీ ఆరోపణలు రావడం వల్ల నిజాయితీగా పరీక్షలు రాసిన అభ్యర్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని ఆరోపించారు. టీచర్ ఉద్యోగాల కోసం ఎన్నో సంవత్సరాలుగా సిద్ధమవుతూ టెట్, బీఈడ్ పూర్తి చేసిన వేలాది మంది నిరుద్యోగ యువతకు తీవ్ర అన్యాయం జరిగిందని ఆయన అన్నారు. డీఎస్సీ నియామకాల్లో జరిగిన అక్రమాలపై కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ)తో సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నైతిక బాధ్యత వహిస్తూ వెంటనే రాజీనామా చేయాలని, నిజాయితీగా పరీక్ష రాసిన అభ్యర్థులకు న్యాయం చేయాలని, ఎన్నికల హామీ మేరకు నిరుద్యోగ భృతిని అమలు చేయడంతో పాటు పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని వైఎస్సార్‌సీపీ నాయకులు డిమాండ్ చేశారు. "మెగా డీఎస్సీ కాదు.. దగా డీఎస్సీ", "విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆపాలి", "డీఎస్సీ అవకతవకలపై సీబీఐ విచారణ జరపాలి", "లోకేష్ రాజీనామా చేయాలి" అంటూ నిరసనకారులు నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్ మండల కన్వీనర్ తనకంటి జయప్ప, జడ్పిటిసి కవితా, శివశంకర్ ,రెడ్డి , శేషు రెడ్డి సురేందర్ రెడ్డి మాజీ కన్వీనర్ సూర్యనారాయణ రెడ్డి , రంగారెడ్డి మహిళా విభాగం.దేశాయి భారతమ్మ, గంగులమ్మ. నాగరాజు నక్కల చిన్నప్ప రమేష్ మీసాల నాగరాజు యూత్ విభాగం ఎస్ పాల్ బొట్టు స్వామి ఉత్తప్ప లక్ష్మీనారాయణ.నవీన్ శ్రీకాంత్ మణికంఠ సుధాకర్ రాజు మూర్తి నాగభూషణ్, నరసింహులు, రాజు , ప్రతాప్ రెడ్డి, టి ఆదినారాయణ కాసుల శంకర అమర్నాథ్ రెడ్డి , వెంకట్ రెడ్డి, ప్రతాప్, సేవే నాయక్, రామచంద్ర, పేట సురేష్ ,పాండురాజు మధుసూదన్ రెడ్డి శివ రాము ఖాజా పీరా బాబు అక్కమ్మ గారి రామాంజనేయులు, నారాయణస్వామి గంగులప్ప ప్రభాకర జి శంకర తదితరులు పాల్గొన్నారు.

# వేణుగాన మాధుర్యంలో.. మేరెడ్డిపల్లిలో ఆధ్యాత్మిక వైభవం..!

– గ్రామ ప్రజలు.. బెంగళూరు బ్రాహ్మణులు.. ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో మూడు రోజులు.. మురళీమోహనుడి మహా ఉత్సవం

– భక్తి బంధం.. బెంగళూరు నుంచి మేరెడ్డిపల్లి వరకు... మురిసే వేళ.. వేణుగోపాలుడి రథం కదిలే వేళ..మేరెడ్డిపల్లిలో ఆధ్యాత్మిక సందడి



**గోరంట్ల, ఆగస్టు 7 మనం న్యూస్ :** శ్రీకృష్ణుడి దివ్యరూపమైన శ్రీ వేణుగోపాలస్వామి కొలువుదీరిన మేరెడ్డిపల్లి గ్రామం మూడు రోజుల పాటు భక్తి పారవశ్యంలో మునిగిపోనుంది. గోరంట్ల మండలం మేరెడ్డిపల్లి గ్రామంలోని శ్రీ వేణుగోపాలస్వామి ఆలయంలో బ్రహ్మరథోత్సవ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు.మేరెడ్డిపల్లి గ్రామ ప్రజలు, బెంగళూరు పట్టణానికి చెందిన వేణుగోపాలస్వామి భక్తులు, బ్రాహ్మణులు, ఆలయ అర్చకులు మంజునాథస్వామి ఆధ్వర్యంలో ఈ మూడు రోజుల ఉత్సవాలను సంప్రదాయబద్ధంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతి సంవత్సరం ఆనవాయితీగా కొనసాగుతున్న ఈ ఉత్సవాలు గ్రామ ప్రజల భక్తిశ్రద్ధలకు, బెంగళూరు నుంచి తరలివచ్చే భక్తుల ఆధ్యాత్మిక అనుబంధానికి ప్రతీకగా నిలుస్తున్నాయి.ఈ సందర్భంగా ఆలయ అర్చకులు మంజునాథస్వామి మాట్లాడుతూ.. స్వామివారి బ్రహ్మరథోత్సవాన్ని ప్రతి సంవత్సరం భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నామని తెలిపారు. మూడు రోజుల పాటు ప్రత్యేక పూజలు, ఉత్సవ కార్యక్రమాలు, అన్నదాన కార్యక్రమాలను నిర్వహించి స్వామివారి ఆశీస్సులు పొందేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. మండల పరిధిలోని ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేయాలని కోరారు. స్వామివారి కళ్యాణోత్సవం ఆగస్టు 7న శ్రీ వేణుగోపాలస్వామి కళ్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.వేదమంత్రోచ్ఛారణలు, మంగళవాయిద్యాల నడుమ స్వామివారి కళ్యాణ మహోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.రెండో రోజు.. జ్యోతుల వెలుగుల్లో స్వామివారి వైభవం ఆగస్టు 8న ఉదయం స్వామివారికి ప్రత్యేక అభిషేకం నిర్వహించి, అనంతరం విశేష అలంకరణ చేయనున్నారు. జ్యోతుల మహోత్సవం, తేరు కార్యక్రమం నిర్వహించడంతో పాటు భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయనున్నారు.గరుడ పూజతో బ్రహ్మరథోత్సవం నిర్వహించి అనంతరం బ్రహ్మరథోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. రథోత్సవాన్ని తిలకించేందుకు మండల పరిధితో పాటు పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరానున్నారు.బెంగళూరు నుంచి భక్తుల ప్రత్యేక రాక..మేరెడ్డిపల్లి శ్రీ వేణుగోపాలస్వామి బ్రహ్మరథోత్సవానికి ప్రతి సంవత్సరం బెంగళూరు పట్టణానికి చెందిన బ్రాహ్మణులు, స్వామివారి భక్తులు ప్రత్యేక వాహనాల్లో మేరెడ్డిపల్లికి చేరుకోవడం ఆనవాయితీగా వస్తోంది. గ్రామ ప్రజలతో కలిసి మూడు రోజుల పాటు ఉత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు.అలాగే అన్నదాన కార్యక్రమాలను కూడా నిర్వహిస్తూ స్వామివారి సేవలో భాగస్వాములవుతున్నారు. వేడుకలు ముగిసే వరకు గ్రామంలోనే ఉండి మేరెడ్డిపల్లి గ్రామ ప్రజలు, బెంగళూరు నుంచి వచ్చిన బ్రాహ్మణులు, భక్తులు, ఆలయ అర్చకులతో కలిసి ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించడం ఈ వేడుకల ప్రత్యేకతగా నిలుస్తోంది. ఈ వేడుకలలో శ్రీ గుడిబండ ఫ్యామిలీ రాగి లోహంతో గోల్డ్ పూతతోవేణుగోపాల స్వామి మూలవిరాట్ కు కవచాన్ని వితరణ చేయనున్నారు.మేరెడ్డిపల్లి గ్రామ ప్రజలు, ఆలయ అర్చకులు మాట్లాడుతూ.. గోరంట్ల మండల పరిధిలోని ప్రజలు, శ్రీ వేణుగోపాలస్వామి భక్తులు మూడు రోజుల పాటు



జరిగే ఉత్సవాల్లో పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శిం చుకుని పూజా కార్యక్ర మాల్లో భాగ స్వాములు కావాలని కోరారు. భక్తులు తీర్థప్రసాదాలు స్వీకరి ంచి స్వామివారి ఆశీ స్సులు పొందాలని పిలుపునిచ్చారు

# అక్కదేవతల హుండీ ఆదాయం లెక్కింపు

– రూ.1.20 లక్షల ఆదాయం రాబడి

**కళ్యాణదుర్గం: ఆగస్టు 7 మనం న్యూస్ :** పట్టణంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అక్కమ్మగార్ల దేవాలయంలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. అమ్మవారి దర్శనార్థం విచ్చేసిన భక్తులు భక్తిశ్రద్ధలతో సమర్పించిన కానుకలతో ఆలయ హుండీలు నిండాయి. శుక్రవారం ఎండోమెంట్స్ శాఖ అధికారులు, ఆలయ కమిటీ సభ్యుల సమక్షంలో హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని పారదర్శకంగా నిర్వహించారు. ఈ లెక్కింపులో భక్తులు సమర్పించిన నగదు ద్వారా మొత్తం రూ. 1,20,602 ఆదాయం సమకూరినట్లు అధికారులు అధికారికంగా వెల్లడించారు. అమ్మవారిపై భక్తులకున్న అపార విశ్వాసానికి, భక్తిప్రపత్తులకు ఈ కానుకల వెల్లువ నిదర్శనమని ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎండోమెంట్స్ అధికారులు, ఆలయ పాలక మండలి సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

